

రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థ
ఆంధ్రప్రదేశ్

# తెలుగుబాట 6

## తెలుగు వాచకం

సమగ్ర శిక్షా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ



सत्यमेव जयते

# భారత రాజ్యాంగం

## ప్రవేశిక

భారతదేశ ప్రజలమైన మేము 1949వ సంవత్సరం, నవంబర్ నెల 26వ తేదీన ఈ భారత రాజ్యాంగాన్ని మాకోసం రూపొందించుకొని, మాకు మేమే సమర్పించుకున్నాం. ఆ క్రమంలో భారతదేశాన్ని సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్రంగా ప్రకటిస్తున్నాం.

భారత రాజ్యాంగం దేశ ప్రజలకు ఈ క్రింది సౌలభ్యాలు కలిగించటం లక్ష్యంగా కలిగి ఉంటుంది :

- సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం.
- ఆలోచనా స్వేచ్ఛ, భావ ప్రకటనా స్వేచ్ఛ, నమ్మకాన్ని విశ్వాసాన్ని కలిగివుండే స్వేచ్ఛ, ఆరాధనా స్వేచ్ఛ.
- సమాన హోదా, సమాన అవకాశాలు.
- ప్రజలందరిలో దేశ సమైక్యతను, అఖండతా భావాన్ని, సోదర భావాన్ని, వ్యక్తి గౌరవాన్ని పెంపొందించడం.

# భారత రాజ్యాంగం
## ప్రాథమిక బాధ్యతలు

**విభాగము – IVఎ, అధికరణం 51ఎ**

**ఈ కిందివి భారతదేశ పౌరుల బాధ్యతలు :**

- భారత రాజ్యాంగానికి బద్ధులై ఉండాలి. జాతీయ పతాకాన్ని, జాతీయ గీతాన్ని, రాజ్యాంగ ఆశయాలను, రాజ్యాంగ సంస్థలను గౌరవించాలి.
- భారత స్వాతంత్ర్య సంగ్రామానికి స్ఫూర్తినిచ్చిన మహోన్నత ఆశయాలను అనుసరించాలి.
- భారతదేశ సార్వభౌమాధికారాన్ని, సమైక్యతను గౌరవించటం, సంరక్షించటం.
- భారతదేశాన్ని సంరక్షించుకోవటం, అవసరం ఏర్పడినప్పుడు (ప్రభుత్వం ఆదేశించినపుడు) ప్రభుత్వానికి సేవలందించటం.
- మత, ప్రాంతీయ, వేర్పాటువాద, భాషాపరమైన సంకుచిత భావాలకు అతీతంగా సోదర భావాన్ని, స్నేహపూర్వక వాతావరణాన్ని పెంపొందించటం, స్త్రీల గౌరవాన్ని కించపరిచే పద్ధతులు, చర్యలను నిరసించటం.
- విభిన్న సంస్కృతుల సమ్మిళితమైన మన గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని సంరక్షించటం.
- అడవులు, సరస్సులు, నదులు, వన్యమృగాలతో సహా మన జాతీయ పర్యావరణాన్ని సంరక్షించటం, సమస్త జీవుల పట్ల ప్రేమానురాగాలను కలిగి ఉండడం.
- శాస్త్రీయ దృక్పథాన్ని, మానవతా వాదాన్ని, జిజ్ఞాసను, సంస్కరణ వాదాన్ని పెంపొందించుకోవటం.
- హింసావాదాన్ని వ్యతిరేకించటం, ప్రభుత్వ ఆస్తులను సంరక్షించటం.
- వ్యక్తిగతంగాను, సమిష్టి కృషి ద్వారాను ఉన్నత శిఖరాలను అధిరోహించటం ద్వారా దేశ ఔన్నత్యాన్ని పెంపొందించటం.
- ఆరు నుండి 14 సంవత్సరాల లోపు పిల్లలకు విద్యావకాశాలను కల్పించటం ఆ పిల్లల తల్లిదండ్రుల లేక సంరక్షకుని బాధ్యత (86వ రాజ్యాంగ సవరణ ద్వారా ఈ క్లాజు చేరింది.)

CHILD LINE 1098 NIGHT & DAY

# తెలుగు బాట - 6

## ఆరవ తరగతి (ప్రథమ భాష)

### పాఠ్యపుస్తకాభివృద్ధి, ప్రచురణ సమితి


శ్రీ ప్రవీణ్ ప్రకాష్ I.A.S
ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పాఠశాల విద్య,
ఆంధ్రప్రదేశ్

శ్రీ బి. శ్రీనివాసరావు I.A.S
స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్, సమగ్ర శిక్ష, ఆంధ్రప్రదేశ్

శ్రీ ఎస్. సురేష్ కుమార్ I.A.S
కమీషనర్, పాఠశాల విద్య, ఆంధ్రప్రదేశ్

శ్రీ కె. రవీంద్రనాథ్ రెడ్డి, M.A., B.Ed.,
సంచాలకులు, ప్రభుత్వ పాఠ్యపుస్తక ముద్రణాలయం,
ఆంధ్రప్రదేశ్

డా॥ బి. ప్రతాప్ రెడ్డి M.A., B.Ed., Ph.D
సంచాలకులు, రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థ,
ఆంధ్రప్రదేశ్


### సంపాదకులు


డా॥ డి. చంద్రశేఖర రెడ్డి
విశ్రాంత ప్రధానాచార్యులు, ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రాచ్యకళాశాల, హైదరాబాద్

ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి
విశ్రాంత ఆచార్యులు, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం; అనంతపురం

ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి
మాజీ శాఖాధిపతి, ఆచార్య నాగార్జునవిశ్వవిద్యాలయం; గుంటూరు

డా॥ కడిమిళ్ళ వరప్రసాద్
గురుసహస్రావధాని, నరసాపురం


### కార్యక్రమ సమన్వయకర్త


డా॥ జి. కేశవ రెడ్డి, M.Sc., M.Sc., M.Ed., M.Phil., Ph.D
ఆచార్యులు, విద్యాప్రణాళిక పాఠ్యపుస్తక విభాగము,
రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణా సంస్థ, ఆంధ్రప్రదేశ్


### సలహాదారులు


డా॥ ఎమ్. స్వర్ణలత MA., M.Phil., Ph.D.,
ప్రధానాచార్యులు, క్రిస్టియన్ మహిళా కళాశాల, గుంటూరు.

డా॥ కె. వెంకటేశ్వరరావు MA., M.Ed., M.Phil., Ph.D.,
విశ్రాంత ఆచార్యులు, అత్యున్నత విద్యా శిక్షణా సంస్థ, రాజమహేంద్రవరం.

గంట్యాడ గౌరు నాయుడు MA., B.Ed.
విశ్రాంత ఉపాధ్యాయుడు, పార్వతీపురం, విజయనగరం జిల్లా.

**© Government of Andhra Pradesh, Amaravati**

*First Published 2020*
*New Impression - 2021, 2022, 2023, 2024*

**All rights reserved**

No part of this publication may be reproduced, stored in a retrieval system, or transmitted, in any form or by any means without the prior permission in writing of the publisher, nor be otherwise circulated in any form of binding or cover other than that in which it is published and without a similar condition including this condition being imposed on the subsequent purchaser.

The copy right holder of this book is the Commissioner of School Education, Amaravati, Andhra Pradesh.

This book has been printed on 70 G.S.M. SS Maplitho

Title Page 220 G.S.M. White Art Card

**సమగ్ర శిక్షా, పాఠశాల విద్యాశాఖ,**

**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ**

Printed in India
at the A.P. Govt. Text Book Press
Amaravati
Andhra Pradesh

# వందే మాతరం



– బంకించంద్ర ఛటర్జీ

వందే మాతరం వందే మాతరం
సుజలాం సుఫలాం మలయజ శీతలాం
సస్యశ్యామలాం మాతరం వందే మాతరం
శుభ్రజ్యోత్స్నాపులకిత యామినీం
పుల్లకుసుమిత ద్రుమదళ శోభినీం
సుహాసినీం సుమధుర భాషిణీం
సుఖదాం వరదాం మాతరం వందే మాతరం.

# మా తెలుగు తల్లి

- శంకరంబాడి సుందరాచారి



మా తెలుగు తల్లికి మల్లెపూదండ
మా కన్నతల్లికి మంగళారతులు
కడుపులో బంగారు కనుచూపులో కరుణ
చిరునవ్వులో సిరులు దొరలించు మా తల్లి
గలగలా గోదారి కదలిపోతుంటేను
బిరబిరా కృష్ణమ్మ పరుగులిడుతుంటేను
బంగారు పంటలే పండుతాయి
మురిపాల ముత్యాలు దొరలుతాయి
అమరావతీ నగర అపురూప శిల్పాలు
త్యాగయ్య గొంతులో తారాడు నాదాలు
తిక్కయ్య కలములో తియ్యందనాలు
నిత్యమై, నిఖిలమై నిలిచియుండేదాక
రుద్రమ్మ భుజశక్తి, మల్లమ్మ పతిభక్తి
తిమ్మరుసు ధీయుక్తి, కృష్ణరాయల కీర్తి
మా చెవుల రింగుమని మారుమ్రోగేదాక
నీ ఆటలే ఆడుతాం – నీ పాటలే పాడుతాం
జై తెలుగు తల్లీ ! జై తెలుగు తల్లీ! జై తెలుగు తల్లీ!

# జాతీయ గీతం

*- రవీంద్రనాథ్ ఠాగూర్*

జనగణమన అధినాయక జయహే!
భారత భాగ్యవిధాతా!
పంజాబ, సింధు, గుజరాత, మరాఠా,
ద్రావిడ, ఉత్కళ, వంగా!
వింధ్య, హిమాచల, యమునా, గంగా!
ఉచ్ఛల జలధి తరంగా!
తవ శుభనామే జాగే!
తవ శుభ ఆశిష మాఁగే
గాహే తవ జయగాథా!
జనగణ మంగళదాయక జయహే!
భారత భాగ్య విధాతా!
జయహే! జయహే! జయహే!
జయ జయ జయ జయహే!!

# ప్రతిజ్ఞ

*- పైడిమర్రి వెంకటసుబ్బారావు*

భారతదేశం నా మాతృభూమి. భారతీయులందరూ నా సహోదరులు.

నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను. సుసంపన్నమైన, బహువిధమైన నా దేశ వారసత్వ సంపద నాకు గర్వకారణం. దీనికి అర్హత పొందడానికై సర్వదా నేను కృషి చేస్తాను.

నా తల్లిదండ్రుల్ని, ఉపాధ్యాయుల్ని, పెద్దలందర్ని గౌరవిస్తాను. ప్రతివారితోను మర్యాదగా నడుచుకొంటాను. జంతువులపట్ల దయతో ఉంటాను.

నా దేశంపట్ల, నా ప్రజలపట్ల సేవానిరతితో ఉంటానని ప్రతిజ్ఞ చేస్తున్నాను.

వారి శ్రేయోభివృద్ధులే నా ఆనందానికి మూలం.

# పాఠ్యపుస్తక రూపకల్పనలో పాల్గొన్నవారు

**ముద్వల రాంబాబు**
పాఠశాల సహాయకులు. తెలుగు
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
సీతానగరం, విశాఖపట్నం

**చెఱుకూరి వెంకట సూర్యనారాయణశర్మ,**
పాఠశాల సహాయకులు. తెలుగు,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
లూటుకుర్రు, తూర్పుగోదావరి.

**డా॥ దోనేపూడి నరేశ్‌బాబు**
పాఠశాల సహాయకులు. తెలుగు
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
పేరుసోముల, కర్నూలు

**కొంపల్లి లీలాకుమార్**
పాఠశాల సహాయకులు. తెలుగు,
శ్రీరాజాజిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల
లక్కవరం, పశ్చిమగోదావరి

**కట్టా శ్రీనివాసరావు**
పాఠశాల సహాయకులు. తెలుగు
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలురు),
జంగారెడ్డి గూడెం, పశ్చిమగోదావరి

**జోస్యుల లక్ష్మీకాంతం**
పాఠశాల సహాయకులు. తెలుగు
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
వెదురుపావులూరు, కృష్ణా

**యేలేశ్వరపు సురేష్ కుమార్**
పాఠశాల సహాయకులు. తెలుగు
గాంధీ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల,
పెదపూడి, తూర్పుగోదావరి

**చింతలచెరువు ఏడుకొండలు**
పాఠశాల సహాయకులు. తెలుగు,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
పుల్లలచెరువు, ప్రకాశం

**బొడ్డుపల్లి శ్రీనివాసరావు**
పాఠశాల సహాయకులు. తెలుగు,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
నాదెండ్ల, గుంటూరు

**డా॥ పాంద్రంగి శారద**
పాఠశాల సహాయకులు. తెలుగు
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
జాడుపల్లి, శ్రీకాకుళం

## విషయనిపుణులు, సమన్వయకర్తలు

**డా. టి.వి.ఎస్. రమేష్**
పాఠ్యపుస్తకాల సమన్వయకర్త
విద్యాప్రణాళిక పాఠ్యపుస్తక విభాగము,
రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణా సంస్థ, ఆంధ్రప్రదేశ్

**కొంపల్లి లీలాకుమార్**
పాఠశాల సహాయకులు. తెలుగు,
శ్రీరాజాజిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల
లక్కవరం, పశ్చిమగోదావరి

## సాంకేతిక సహాయకులు, విషయ నిపుణులు

**డా. వేంపల్లి గంగాధర్**
జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల,
ముద్దనూరు, వై.ఎస్.ఆర్. కడప

**వంగీపురం స్వర్ణలత**
ఎస్.పి.పి.ఆర్.ఆర్. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
తాళ్ళపూడి, పశ్చిమగోదావరి

## చిత్రకారులు

**ఉత్తమ్**

## లే అవుట్ డిజైనింగ్

**స్టార్ మీడియా సర్వీసెస్, హైదరాబాద్**

## ఉపాధ్యాయులకు సూచనలు

★ విద్యాసంవత్సరం ప్రారంభంలోనే ప్రారంభ పరీక్ష నిర్వహించాలి. పిల్లల స్థాయిని అంచనా వెయ్యాలి.

★ ఈ పాఠ్యపుస్తకంలో కొత్తగా సంసిద్ధతా పాఠాలు చేర్చబడ్డాయి. జూన్, జూలై మాసాలలో ఈ పాఠాల ఆధారంగా చదవడం, రాయడం విషయమై తగిన శిక్షణ ఇవ్వాలి.

★ పాఠ్యపుస్తకంలో రాయడానికి అవకాశం లేని అభ్యాసాలను నోటు పుస్తకాలలో రాయించాలి.

★ పదజాలం, వ్యాకరణాంశాల అభ్యాసాలు మాత్రం ఎక్కువగానే ఉన్నాయి. విద్యార్థికి భాషమీద పట్టురావాలంటే ఉపాధ్యాయులు ఆ అభ్యాసాలను, వ్యక్తిగత కృత్యాలు, జట్టు కృత్యాల ద్వారా శ్రద్ధతో చేయించాలి.

★ ప్రాచీన, ఆధునిక సాహిత్యాల నుండి పాఠ్యాంశాలను సేకరించారు. ఉపాధ్యాయులు పాఠ్యబోధనకు ముందే సంబంధిత పాఠాల మూలాలను, నేపథ్యాలను, పాఠ్యభాగ ఉద్దేశాలను ఆకళింపు చేసుకొని విద్యార్థులకు వివరించాలి.

★ పాఠ్యాంశాన్ని బోధిస్తున్నప్పుడు సందర్భానుసారంగా నైతిక విలువలు, మానవ విలువలు, కళలు, సంస్కృతి, జాతీయత, సమానత్వం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై చర్చింప జేయాలి. పిల్లలలో మంచి పరివర్తనకోసం ప్రయత్నించాలి.

★ ప్రతి పాఠానికీ ముందిచ్చిన ఉన్ముఖీకరణ చిత్రాలను ఉపయోగించి పిల్లల ఆలోచనలకు, వివేచనకు, మాట్లాడే సామర్థ్యానికి పదును పెట్టాలి.

★ పాఠాల స్వభావాన్ని బట్టి బోధనవ్యూహాలను ఎంపిక చేసుకోవాలి. పిల్లలకు ప్రశ్నించే అవకాశం కల్పించడం అందరినీ భాగస్వాములను చేయడం ప్రధానం.

★ ఇందుకోసం ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా బోధించాలి. ప్రతి పాఠానికీ కింది విధంగా పాఠ్యప్రణాళిక రాయాలి.

★ 1. పాఠం పేరు 2. అవసరమైన పీరియడ్ల సంఖ్య 3. సాధించాల్సిన సామర్థ్యాలు 4. పీరియడ్ల విభజన

| పీరియడ్ సంఖ్య | బోధనాంశం | బోధనవ్యూహం | సామగ్రి / వివరాలు |
|---|---|---|---|
| | | | |

★ పాఠంలోని విషయాన్ని అర్థం అయ్యేలా చెప్పడానికి 3 నుండి 4 పీరియడ్లు కేటాయించు కోవాలి. అభ్యాసాలు, ప్రశ్నల జవాబులు పిల్లలతో సొంతంగా రాయించడానికి ఎక్కువ పీరియడ్లు కేటాయించు కోవాలి.

★ తప్పనిసరిగా ప్రతిపాఠానికి ఉక్తలేఖనం నిర్వహించాలి. ఇవి చేయండి అభ్యాసాలను తరగతిలో చర్చించాలి. విద్యాప్రమాణాలను తగ్గించలేదు. 7 విద్యాప్రమాణాలను 3 విద్యాప్రమాణాలుగా మార్చడమైనది.

**I. అవగాహన - ప్రతిస్పందన : (వినడం మాట్లాడటం - చదవడం రాయడం)**

★ ఈ అభ్యాసాలను, ప్రశ్నలను పూర్తి తరగతి కృత్యంగా నిర్వహించాలి.

★ జట్లలో చర్చింప జేసి తర్వాత వ్యక్తిగతంగా చేసేటట్లు చూడాలి.

**II. వ్యక్తీకరణ - సృజనాత్మకత : (స్వీయరచన - సృజనాత్మకత - ప్రశంస)**

★ ప్రశ్నలను తరగతి గదిలో చర్చింపజేసి, జవాబులను రాబట్టి, దోషసవరణ చేసి వ్యక్తిగతంగా రాసేటట్లు ప్రోత్సహించాలి.

**III. భాషాంశాలు : (పదజాలం - వ్యాకరణాంశాలు)**

★ పదజాలం, వ్యాకరణాంశాల బోధనలో ఉపాధ్యాయుల పాత్ర ఎక్కువగా ఉండాలి. ప్రతి విషయాన్నీ సోదాహరణంగా వివరించి రాయించాలి.

★ **ప్రాజెక్ట్ పని :** విద్యార్థుల సౌలభ్యం దృష్ట్యా 4 నిర్మాణాత్మక మూల్యాంకనాలకు 4 ప్రాజెక్ట్‌లు మాత్రమే ఇవ్వడమైనది. ఈ ప్రాజెక్ట్ పనులను సులభశైలిలో జట్టు కృత్యాలుగా లేదా వ్యక్తిగత కృత్యాలుగా చేయించాలి.

# విద్యార్థులకు సూచనలు

పిల్లలూ! .....

- మీరందరూ ధారాళంగా చదవగలగాలి. తెలిసినదానిని గురించి సొంతంగా రాయగలగాలి. ఒకవేళ మీరు చదవడం, రాయడం చేయలేకపోతే ఉపాధ్యాయుల సాయంతో చదవడం, రాయడం తప్పనిసరిగా నేర్చుకోవాలి.
- మీకోసం మీరు నేర్చుకోవలసిన అంశాలను దృష్టిలో పెట్టుకొని తెలుగు పుస్తకాన్ని రూపొందించారు. ఈ పుస్తకంలో మీరు సాధించాల్సిన అభ్యసన ఫలితాలు గురించి ఒక పేజీలో ఇచ్చారు. విద్యాసంవత్సరం పూర్తయ్యేసరికి మీరు వీటిని చేయగలగాలి. వాటిని చదవండి.
- ప్రతి పాఠం ప్రారంభంలో చిత్రం ఉంటుంది. దానిని గురించి మాట్లాడండి. ప్రశ్నలకు జవాబులు చెప్పండి.
- మీ ఉపాధ్యాయుడు పాఠంలోని విషయం గురించి బోధించేటప్పుడు తప్పనిసరిగా మీకు తెలియని పదాలు, వాక్యాలు విషయాలను గురించి ప్రశ్నించండి, చర్చించి తెలుసుకోండి.
- తరగతిగదిలో చర్చలు జరుగుతున్నప్పుడు, జట్టుపనులు నిర్వహిస్తున్నప్పుడు మీరు కూడా పాల్గొనాలి, మాట్లాడాలి, అవసరం అయితే ప్రశ్నించాలి.
- పాఠం తర్వాత 'ఇవి చేయండి' అనే పేరుతో అభ్యాసాలు ఉన్నాయి. వాటిని మీరు సొంతంగా పూర్తి చేయాలి. ప్రశ్నలకు మీరే ఆలోచించి సొంతంగా జవాబులు రాయాలి. ఎలాంటి పరిస్థితుల్లో గైడ్లు, స్టడీ మెటీరియల్, ప్రశ్నల జవాబులు చూసి రాయగూడదు. ఒకవేళ అలా రాస్తే నిర్మాణాత్మక మూల్యాంకనంలో మీకు మార్కులు ఇవ్వరు.
- పాఠంలోని ప్రాజెక్టుపనులకు సంబంధించిన అభ్యాసాలను మీరు మీ మిత్రుల సహాయంతో చేయవచ్చు. వీటిని ఎలా చేయాలో మీ ఉపాధ్యాయుణ్ణి అడిగి తెలుసుకోండి. వీటిని చేసిన తర్వాత మీరు ఎలా చేశారు? ఏం చేశారు? ఏం నేర్చుకున్నారు? మీరే సొంతంగా చెప్పాల్సి ఉంటుంది.
- సృజనాత్మకతలోని అంశాలను ఎలా చేయాలో తరగతిగదిలో మీ ఉపాధ్యాయుణ్ణి అడిగి తెలుసుకోండి. మీరు తరగతిలో రాసి చూపాలి. దీనిపైన చర్చ జరిగిన తర్వాతే మీ నోటుపుస్తకాలలో రాయాలి.
- వ్యక్తీకరణ – సృజనాత్మకత అభ్యాసాలను మీరే సొంతంగా చేయండి. చేయలేని వాటిని గురించి మాత్రమే ఉపాధ్యాయుణ్ణి అడిగి తెలుసుకోండి.
- అభ్యాసాలలో ఇచ్చిన భాషాంశాలు లోని వ్యాకరణాంశాలు మీకు అర్థంకావడానికి మొదట ఉదాహరణలు ఇచ్చారు. వాటి ఆధారంగా మీకు అర్థమయ్యేలా సూత్రాన్ని ఇచ్చారు. కాబట్టి ఉదాహరణలను జాగ్రత్తగా పరిశీలించి వాటిని విశ్లేషించి సూత్రాన్ని తెలుసుకోండి.
- ప్రతి పాఠంలో చివరకు 'నేనివి చేయగలనా?' అనే పట్టిక ఉంది. ఒక్కొక్క వాక్యాన్ని చదవండి. చేయగలిగితే 'ఔను' వద్ద '✓' పెట్టండి. చేయలేకుంటే 'కాదు' వద్ద '✓' పెట్టండి. వీటిలో మీరు చేయలేనివాటిని మీ ఉపాధ్యాయుడి సహాయంతో పునరభ్యాసం చేయండి.
- ఉపవాచకం పాఠాలను మీరే సొంతంగా చదవండి. వాటిని గురించి మాట్లాడండి.
- పాఠాలకు సంబంధించిన ఇతర పుస్తకాలను, గ్రంథాలను పాఠశాల గ్రంథాలయానికి వెళ్ళి అడిగి తీసుకొని చదవండి.
- మీరు తప్పనిసరిగా వ్యాసాలు, లేఖలు, నినాదాలు, కరపత్రాలు, సంభాషణలు, పోస్టర్లు వంటివి రాయగలగాలి.
- కొన్ని పాఠాలలో నాటకీకరణ చేయడం, ఏకపాత్రాభినయం చేయడం, గేయాలను రాగంతో పాడడం – అభినయంచేయడం, పద్యాలను కంఠస్థం చేసి రాగభావయుక్తంగా పాడడం వంటివి ఉన్నాయి. వీటిని మీరు తప్పనిసరిగా సాధనచేయండి.
- సృజనాత్మకతలోని అంశాలను మీరు రాసిన తరవాత ఒక పుస్తక రూపంలో సంకలనంచేసి తరగతిలో ప్రదర్శించండి.

# విషయసూచిక


| క్ర.సం. | పాఠం | ప్రక్రియ | ఇతివృత్తం | కవి / రచయిత | మాసం | పుట |
|---|---|---|---|---|---|---|
| 1. | అమ్మఒడి | గేయం | తల్లిప్రేమ | బి.వి.నరసింహారావు | జూన్ | 1-8 |
| 2. | తృప్తి | కథానిక | మానవ విలువలు | సత్యం శంకరమంచి | జూలై | 9-18 |
| 3. | మాకొద్దీ తెల్లదొరతనం | గేయం | దేశభక్తి | గరిమెళ్ల సత్యనారాయణ | ఆగస్టు | 19-26 |
| 4. | సమయస్ఫూర్తి | కథ | సమయస్ఫూర్తి | కందుకూరి వీరేశలింగం | ఆగస్టు | 27-36 |
| 5. | మన మహనీయులు (ఉపవాచకం) | వ్యాసం | దేశభక్తి | రచయితల బృందం | సెప్టెంబర్ | 37-42 |
| 6. | సుభాషితాలు | శతక పద్యాలు | నైతికవిలువలు | శతక కవులు | సెప్టెంబర్ | 43-52 |
| 7. | మమకారం | కథ | భాషాభిరుచి | చిలుకూరి దేవపుత్ర | అక్టోబర్ | 53-62 |
| 8. | మేలుకొలుపు | పద్యం | సమానత్వం | కుసుమ ధర్మన్న | నవంబర్ | 63-70 |
| 9. | ధర్మ నిర్ణయం | చారిత్రక కథ | స్థలపురాణం | సేకరణ | డిసెంబర్ | 71-78 |
| 10. | త్రిజట స్వప్నం | పద్యం | సహానుభూతి | ఆతుకూరి మొల్ల | డిసెంబర్ | 79-86 |
| 11. | దూడూ బసవన్న | జీవిత చిత్రం | సంస్కృతి | డా॥రావూరి భరద్వాజ | జనవరి | 87-95 |
| 12. | ఎంత మంచివారమ్మా..! (ఉపవాచకం) | వ్యాసం | జీవన వైవిధ్యం | వెన్నెలకంటి రాఘవయ్య | ఫిబ్రవరి | 96-99 |
| 13. | పునశ్చరణ | | | | మార్చి ఏప్రిల్ | |


సంస్కృతం కాంపోజిట్‌కోర్సుగా చదివేవారు ఉపవాచకం మినహా అన్ని పాఠ్యాంశాలను చదవాలి.

## ఈ పాఠ్య పుస్తకం ద్వారా విద్యార్థులు సాధించాల్సిన అభ్యసన ఫలితాలు

### I. అవగాహన - ప్రతిస్పందన (వినడం మాట్లాడటం - చదవడం, రాయడం)

- ★ విని చదివి తెలుసుకున్న రచనలు, సంఘటనల వంటి అంశాలపైన అవగాహనతో అభిప్రాయాలు వ్యక్తీకరించడం.
- ★ ఉపన్యాసాలు, వార్తలు విని అర్థం చేసుకోవడం, ప్రతిస్పందించడం.
- ★ విభిన్న భాషలు, కట్టుబాట్లు, ఆచారవ్యవహారాలకు సంబంధించిన వ్యత్యాసాలను గురించి మాట్లాడగలగడం, ఆసక్తిని, అభిరుచిని పెంచుకోవడం.
- ★ పద్యం, వచనం, గేయం మొదలైన సాహితీప్రక్రియలను శైలీభేదంతో అవగాహనతో చదవడం
- ★ వ్యాసరూప అంశాలను, లేఖలను చదివి అర్థంచేసుకోవడం.
- ★ చదివిన అంశాల్లోని కీలకాంశాలు గుర్తించడం, రాయడం, శీర్షికలు సూచించడం, విశ్లేషించడం, అభిప్రాయాలు చెప్పడం.

### II. వ్యక్తీకరణ - సృజనాత్మకత (స్వీయరచన - సృజనాత్మకత - ప్రశంస)

- ★ తాము అర్థం చేసుకున్న విషయాలను, తెలిసిన విషయాలను స్పష్టంగా లిఖిత రూపంలో రాయగలుగుతారు.
- ★ పాఠాలనుండి సూచిత అంశాలకు సారాంశాలు, భావాలు రాయడం.
- ★ విరామచిహ్నాలను పాటిస్తూ, సరైన పదజాలాన్ని ఉపయోగిస్తూ దోషరహితంగా రాయగలగడం.
- ★ తాను చదివిన, విన్న, అనుభవంలో ఉన్న, చూసిన అంశాలను వర్ణించి చెప్పడం, బొమ్మలుగీయడం, నినాదాలు రాయడం.
- ★ వివిధ భాషా ప్రక్రియలను మార్చగలగడం, సంభాషణలు, నాటకీకరణం చేయడం.
- ★ ప్రకటనలు, ఆహ్వానపత్రికలు, ఆత్మకథ, డైరీ వంటి వివిధ వ్యవహారరూపాలు రాయడం.
- ★ భాషా ప్రయోగాలలోని సూక్ష్మాంశాలను, భాషానిర్మాణాలను, శైలిని గమనిస్తూ వాటిని ప్రశంసించడం.
- ★ ఇతరభాషలు, మతాలు, సంస్కృతులను సవ్యంగా అర్థంచేసుకోవడం, మంచిని గ్రహించడం, గౌరవించడం.
- ★ తరగతిలోని బాలురు, బాలికలు, ప్రత్యేకావసరాల పిల్లలు అందరు సమానమని గుర్తించి, వారు చేసిన మంచి పనులను ప్రశంసించడం.

### III. భాషాంశాలు (పదజాలం - వ్యాకరణాంశాలు)


- ★ నిఘంటువును ఉపయోగిస్తూ అర్థాలు, పర్యాయపదాలు వంటివి స్వీయ అధ్యయనం చేయడం
- ★ ప్రకృతి వికృతులు, జాతీయాలు, సామెతలు గుర్తించడం. అవగాహన చేసుకొని, కొత్త పదాలతో పాటు సొంతవాక్యాల్లో ఉపయోగించడం.
- ★ వ్యాకరణాంశాలపట్ల అవగాహన పెంచుకోవడం. (అక్షరమాల - విభాగాలు, భాషాభాగాలు, విభక్తులు, సంధులు, సమాసాలు, వాక్యభేదాలు)
- ★ వ్యాకరణ నియమాలను స్పష్టంగా గుర్తించగలగడం. సందర్భానుసారంగా వ్యాకరణ దోషాలు లేకుండా రాయడం.

# 1. అమ్మ ఒడి

N5N9Q8



**వినడం - ఆలోచించి మాట్లాడడం**




1. చిత్రంలో ఎవరెవరున్నారు?
2. అమ్మ పిల్లలకు ఏమి చెబుతూంది?
3. అమ్మ పిల్లల కోసం ఏమేమి చేస్తుంది?

**ఉద్దేశం:** అమ్మ ప్రేమను, గొప్పతనాన్ని తెలియజేయడం ఈ పాఠం ఉద్దేశం.

**కవి పరిచయం**

## బాడిగ వెంకట నరసింహారావు

(15.8.1913 - 6.1.1994)




కృష్ణా జిల్లాలోని కౌతరంలో జన్మించారు. 'బాలరసాలు', 'పాలబడి పాటలు', 'ఆవు-హరిశ్చంద్ర', 'బాలతనం', 'చిన్నారిలోకం', 'పూలబాలలు' 'ఋతువాణి' వంటి 17 పుస్తకాలు పిల్లల కోసం రాశారు. 'బాలబంధు'గా ప్రసిద్ధులు. బాల సాహిత్యాన్ని ఉద్యమ స్ఫూర్తితో వ్యాప్తి చేయడం తన జీవిత ధ్యేయంగా బి.వి.నరసింహారావు పెట్టుకున్నారు. వింజమూరి లక్ష్మీ నరసింహారావు రాసిన 'అనార్కలి' నాటకంలో అనార్కలి పాత్ర ధరించి, 'అనార్కలి నరసింహారావు'గా ఖ్యాతి గడించారు.

ప్రస్తుత పాఠ్యభాగం బాలబంధు బి.వి. నరసింహారావు సంపూర్ణ రచనలు రెండవ సంకలనం లోనిది.

# అమ్మ ఒడి

**అమ్మ** ఒడి చదువుల బడి మా
యమ్మ ఒడి నా కొక గుడి

అమ్మ చూపును ఒరవడి, దై
వమ్ము కంటెను త్వరపడి

అమ్మ చెప్పిన సుద్దులు, అని
శమ్ము ఒప్పిన బుద్ధులు

అమ్మ పెదవుల హాసము ని
త్యమ్ము మాకు వికాసము

అమ్మ మంజుల భాషణం, శ్రా
వ్యమ్ము వీనుల భూషణం





అమ్మ హృది అనురాగము, ది
వ్యమ్ము భవ్యము యోగము
అమ్మ చల్లని కరములు దా
నమ్మునకు ఆకరములు

అమ్మ చరణ తలమ్ములు క్షే
మమ్ము పండు పొలమ్ములు

అమ్మ కన్నుల కాంతులు లో
కమ్మునకు సుఖశాంతులు

అమ్మయే నా సర్వము ధై
ర్యమ్ము బలమూ గర్వము

## సారాంశం

మా అమ్మ తన ఒడిలోనే నాకు ఎన్నో సంగతులు నేర్పిన నా తొలిగురువు.
నన్ను ఎల్లప్పుడూ కాపాడుతూ బాగోగులు చూసే నా ప్రత్యక్ష దైవం.
అందుకే మా అమ్మఒడి నాకు బడి, గుడి.
దేవునికంటే ముందే త్వరపడుతూ నా భవితకు ఒరవడి చూపిస్తుంది.
అమ్మ చెప్పే మంచిమాటలు ఎల్లప్పుడూ ప్రకాశించే తెలివితేటలు.
అమ్మ పెదవులపై చిరునవ్వు మాకు నిరంతరం సంతోషాన్నిస్తుంది.
అమ్మ అందమైన మాటలు వినడం మా చెవులకే అలంకారం.
అమ్మ మనస్సులోని ప్రేమ ఉత్తమమైనది, శుభకరమైనది, అన్నిటినీ సమకూర్చేది.
అమ్మ చల్లని (మేలైన) చేతులు దానధర్మాలకు నిలయాలు.
అమ్మ పాదాలు తాకిన నేల శుభాలు పండించే పొలం వంటిది.
అమ్మ కళ్ళలోని కాంతులు లోకానికి సుఖాన్ని, శాంతిని ఇస్తాయి. అమ్మే నా ధైర్యం, బలం, గర్వం, సర్వస్వం.



**ఇవి చేయండి**

**ఉపాధ్యాయుడు చెప్పిన కింది పదాలను (ఉక్తలేఖనం) రాయండి.**

చదువు, వికాసం, భాషణం, సుఖశాంతులు, యోగం, అమ్మ, బుద్ధులు, ధైర్యం, గర్వం, కన్నులకాంతులు, అనురాగం, ఒరవడి.



## అవగాహన - ప్రతిస్పందన



1. అమ్మ ఒడి గేయాన్ని భావంతో, రాగంతో పాడండి.
2. "అమ్మ ప్రేమ ఉత్తమమైనది". దీనిని సమర్థిస్తూ చర్చించండి.
3. **పాఠం ఆధారంగా కింది వాక్యాలను జతపరచండి**

| | | |
|---|---|---|
| 1. అమ్మ చెప్పే మంచిమాటలు | ( ) | అ) నిరంతరం సంతోషాన్నిస్తుంది. |
| 2. అమ్మ పెదవులపై చిరునవ్వు | ( ) | ఆ) అమ్మ చల్లని చేతులు |
| 3. దానధర్మాలకు నిలయాలు | ( ) | ఇ) ఎల్లప్పుడూ ప్రకాశించే తెలివితేటలు |

4. **కింది కవిత చదవండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.**

నాన్నంటే ?
సంద్రమంత గాంభీర్యం,
కొండంత ధైర్యం,
నా పాలిట కల్పవృక్షం !



(అ) కొండంత ధైర్యం ఇచ్చేది ఎవరు ?

జ. ..................................................................................

(ఆ) నాన్న గాంభీర్యం ఎలాంటిది ?

జ. ..................................................................................

(ఇ) కల్పవృక్షంతో నాన్నను ఎందుకు పోల్చారు ?

జ. ..................................................................................

(ఈ) ఈ కవితకు తగిన 'శీర్షిక' రాయండి.

జ. ..................................................................................



## వ్యక్తీకరణ - సృజనాత్మకత

**అ) కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాలలో జవాబులు రాయండి.**

1. 'అమ్మ ఒడి' గేయం కవి గురించి రాయండి
2. 'అమ్మ ఒడి - చదువుల బడి' అని కవి ఎందుకన్నారు ?
3. అమ్మ మాటలు పిల్లలకు ఎలా ఉపకరిస్తాయి?

**ఆ) కింది ప్రశ్నలకు 8 నుండి 10 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. అమ్మ గొప్పతనాన్ని పాఠం ఆధారంగా సొంతమాటల్లో రాయండి.
2. అమ్మ ఒడి గేయం ద్వారా అమ్మ గొప్పతనం తెలుసుకున్నారుకదా! నాన్న / సంరక్షకుని గొప్పతనం రాయండి.
3. మీ పాఠశాల గొప్పతనం తెలిసేలా కింది గేయాన్ని పొడిగించండి.

అందమైనది మా బడి
తెలివి నేర్పే మా గుడి

..............................
..............................
..............................
..............................
..............................
..............................
..............................
..............................





## భాషాంశాలు

**అ) 1. కింది పదాలను చదవండి రాయండి. పదాలలోని అక్షరాలను వర్ణమాలలో '◯' చుట్టి గుర్తించండి.**

అ ఆ ఇ ఈ ఉ ఊ ఋ ౠ ఌ ౡ
ఎ ఏ ఐ ఒ ఓ ఔ ం ః
క ఖ గ ఘ ఙ
చ ౘ ఛ జ ౙ ఝ ఞ
ట ఠ డ ఢ ణ
త థ ద ధ న
ప ఫ బ భ మ
య ర ల వ శ ష స హ ళ క్ష ఱ

| | |
|---|---|
| 1. ఆశ | 7. ఐర |
| 2. కళ | 8. ఊయల |
| 3. ఈక | 9. ఘనత |
| 4. ఓడ | 10. అచట |
| 5. ఉమ | 11. సహజ |
| 6. ఎర | 12. ఔషధం |

**2. కింది వానిలో సరైన అక్షరాలను ఖాళీలలో ఉంచి పదాలను రాయండి.**

అ, బ, శ, ఫ, ఠ, భ, ధ, ఖ, థ, డ

| | |
|---|---|
| 1. ___ లపం | 6. ఇం ___ నం |
| 2. కం ___ ం | 7. ___ తకం |
| 3. ___ రక | 8. స ___ లం |
| 4. ఆ ___ రణం | 9. శం ___ ం |
| 5. ప ___ కం | 10. ___ మరుకం |

**3. వర్ణమాలలోని అక్షరాలతో మరికొన్ని పదాలను రాయండి.**
**ఉపాధ్యాయులు చెప్పిన పదాలను ఉక్తలేఖనం రాయండి.**



**ఆ) 1. కింది పదాలను చదవండి. తేడాను గమనించండి. సున్న (ం) ఉపయోగించి మరికొన్ని పదాలు రాయండి. చదవండి. ఉక్తలేఖనం రాయండి.**

| | | |
|---|---|---|
| 1. కల - కలం | 4. జట - జంట | 7. జగం - జంగం |
| 2. పడగ - పండగ | 5. కడ - కండ | 8. గడ - గండం |
| 3. జల - జలం | 6. జయ - జయం | 9. వందన - వందనం |

**2. కింది అక్షరాలకు అవసరమైన చోట 'ం' ను చేర్చి సరైన పదాలు రాయండి. చదవండి.**

ఉదా: అద : అందం

| | | | |
|---|---|---|---|
| 1. దత : ................... | | 6. జయ : ................... | |
| 2. రగ : ................... | | 7. ఆనద : ................... | |
| 3. సగ : ................... | | 8. ఇధన : ................... | |
| 4. జగ : ................... | | 9. అగన : ................... | |
| 5. అహ : ................... | | 10. చదన : ................... | |

**3. కింది అక్షరాలలో 'ం' ను సరైనచోట ఉంచి పదాలు రాయండి. చదవండి.**

ఉదా: వంర : వరం

| | |
|---|---|
| 1. దడం : ................... | 6. గంమన : ................... |
| 2. రంణ : ................... | 7. పంయన : ................... |
| 3. జంన : ................... | 8. మడంపం : ................... |

**4. కింది పదాలలో అక్షరాలలోని తేడాను గమనించి చదవండి. రాయండి. అర్థాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోండి. ఉక్తలేఖనం రాయండి.**

| | |
|---|---|
| 1. కరం : ................... | 6. గజం : ................... |
| ఖరం : ................... | ఘనం : ................... |
| 2. చలం : ................... | 7. జనం : ................... |
| ఛలం : ................... | ఝషం : ................... |
| 3. పతకం : ................... | 8. డంబం : ................... |
| పథకం : ................... | ఢంక : ................... |
| 4. లత : ................... | 9. దళం : ................... |
| కథ : ................... | ధనం : ................... |
| 5. పరం : ................... | 10. బలపం : ................... |
| ఫలం : ................... | భరతం : ................... |

5. **కింది అక్షరాలను క్రమపరచి సరైన పదాలుగా రాయండి. చదవండి.**

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| ఉదా॥ | రఅక | : | అరక | 6. | రంగత | : | .................. |
| 2. | లబత | : | .................. | 7. | ఆదంనం | : | .................. |
| 3. | దవప | : | .................. | 8. | కంతసం | : | .................. |
| 4. | జనవ | : | .................. | 9. | దరంకం | : | .................. |
| 5. | రంగన | : | .................. | 10. | పండమం | : | .................. |

6. **కింది పట్టికలలోని పదాలను చదవండి. రెండేసి పదాలను కలిపి అర్థవంతమైన పదబంధం లేదా వాక్యంగా చదవండి. రాయండి. ఉక్తలేఖనం రాయండి.**

| | |
|---|---|
| అమల | పంట |
| శనగ | పలక |
| మర | గంప |
| శంఖం | పడవ |
| హంస | వంశం |
| పడవ | మండపం |
| దశరథ | ఊదగలం |
| శనగల | పయనం |
| ఘనతగల | నడక |
| మంగళకర | తనయ |

ఉదా॥ శంఖం ఊదగలం.

...............................................

...............................................

...............................................

...............................................

...............................................

...............................................

...................................

...................................

...................................

...................................





## నేనివి చేయగలనా?



1. వర్ణమాలను చదవగలను, రాయగలను. ఔను / కాదు
2. సరళపదాలు, వాక్యాలు చదవగలను, రాయగలను. ఔను / కాదు
3. అమ్మఒడి గేయం భావంతో, రాగంతో పాడగలను. ఔను / కాదు
4. అమ్మ, నాన్న / సంరక్షకుల సేవలను సొంతమాటల్లో చెప్పగలను, రాయగలను. ఔను / కాదు

# మాతృదేవో భవ, పితృదేవో భవ

పిల్లలూ! 'మాతృదేవో భవ', 'పితృదేవో భవ' అంటారు - పెద్దలు. అంటే మొట్టమొదట పూజించ దగినవాళ్లు తల్లిదండ్రులు. ఇందుకు సంబంధించిన చిన్నచిన్న కథలు పురాణాల్లో ఉన్నాయి. తల్లిదండ్రుల్ని పూజించడం ఎంతముఖ్యమో, దానిద్వారా ఎంతటి ఫలితం కలుగుతుందో వివరిస్తాను - శ్రద్ధగా వినండి.

మనం ప్రతి సంవత్సరం వినాయకచవితిపూజ చేసుకుంటాం. ఆ సందర్భంగా వినాయకవ్రత కథను వింటూఉంటాం. భూమండలాన్ని ముందుగా చుట్టివచ్చిన వాళ్ళకు గణాధిపత్యం ఇస్తానని పరమశివుడు ప్రకటిస్తాడు. వెంటనే కుమారస్వామి నెమలివాహనంపై భూమండల ప్రదక్షిణానికి బయలుదేరుతాడు. వినాయకుడు పెద్దబొజ్జగలవాడు కనుక అంత వేగంగా కదలలేడు. ఈ పరీక్షలో ఎలా నెగ్గాలా? అని ఆలోచిస్తూ కూర్చొని ఉన్నాడు. అంతలో అక్కడికి నారదుడు వచ్చి తల్లిదండ్రులకు ప్రదక్షిణం చేస్తే భూమండల యాత్ర చేసినట్లేనని చెపుతాడు. ఈ విషయం గ్రహించి, వినాయకుడు తల్లిదండ్రులైన పార్వతీపరమేశ్వరులకు ప్రదక్షిణలు చేసి, నమస్కరించాడు. మాతాపితరులకు ప్రదక్షిణలు చేయడం అంటే భూమండలాన్ని చుట్టిరావడమే. తన కంటే వినాయకుడే ముందు భూప్రదక్షిణ పూర్తిచేసినట్లు గుర్తించి కుమారస్వామి తన ఓటమిని అంగీకరిస్తాడు. వినాయకుడికి గణాధిపత్యం దక్కుతుంది.

చూశారా పిల్లలూ! వినాయకుడి కథవల్ల మీరు తెలుసుకోవల్సిందేమిటంటే - తల్లిదండ్రుల్ని మించిన దైవాలు లేరు. ఈ కథను వినాయకచవితి పండుగ సందర్భంగా మనం ప్రతి సంవత్సరం చెప్పుకొంటున్నామంటే తల్లిదండ్రుల్ని సేవించడం వల్ల కలిగే పుణ్యాన్ని స్మరించుకొంటున్నామని గ్రహించాలి. అంతేగాక సోదరుల మధ్య కూడా ఎలాంటి విరోధభావాలు ఉండకూడదు - అనే విషయము, వినాయక కుమారస్వాముల సోదరత్వం ద్వారా గ్రహించాలి.




P7X3H3

# 2. తృప్తి

E6W7Y3

**వినడం - ఆలోచించి మాట్లాడడం**



1. చిత్రంలో ఎవరెవరు ఉన్నారు? ఏం చేస్తున్నారు?
2. పిల్లలు ఏం మాట్లాడుకుంటున్నారు?
3. మీకు ఎప్పుడెప్పుడు సంతోషం కలుగుతుంది?

**ఉద్దేశం:** సాటి మనుషుల తృప్తి, సంతోషం కోసం పనిచేయడంలోనే నిజమైన సంతోషం, తృప్తి ఉన్నాయని కథ ద్వారా తెలియజేయడం ఈ పాఠం ఉద్దేశం.

**కవి పరిచయం**

## సత్యం శంకరమంచి (3.3.1937 - 21.5.1987)




గుంటూరు జిల్లా అమరావతిలో జన్మించారు. 'అమరావతి కథలు', 'కార్తిక దీపాలు' కథా సంపుటాలు, 'రేపటిదారి', 'సీత స్వగతాలు', 'ఆఖరి ప్రేమలేఖ', 'ఎడారిలో కలువపూలు' మొదలైన నవలలు, హరహరమహాదేవ నాటకం, దిన, వార పత్రికలలో అనేక వ్యాసాలు రాశారు. 1979లో 'అమరావతి కథల'కు రాష్ట్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్నారు. ఈ పాఠం సత్యం శంకరమంచి రాసిన అమరావతి కథలు లోనిది.

# తృప్తి

పూర్ణయ్యని బావగాడంటారు అందరూ!

బావగాడు లేకపోతే సరదాలేదు, సంబరము లేదు. పెళ్ళిగాని, పేరంటంగాని వంట హంగంతా బావగాడే. వంటవాళ్ళని కూర్చోనిచ్చేవాడు కాదు. నించోనిచ్చేవాడు కాదు. పరుగులు పెట్టించేవాడు. ఇక తినేవాళ్ళకి భోజనం మీద తప్ప వేరే ధ్యాస రానిచ్చేవాడు కాదు.

ఒకసారి వనసంతర్పణ పెట్టుకున్నారు. జనం అంతా మామిడి తోపులో చేరారు. చాపలు పరచి పిచ్చాపాటి మాట్లాడుకునేవారు కొందరు. గాడిపొయ్యి తవ్వించాడో లేదో బావగాడు జనం మధ్యకు పరుగెత్తుకొచ్చాడు. "అందరూ వినండ్రా" అని పెద్దగా గావుకేక పెట్టి మాటలు మానిపించాడు. "వంటకాలు ఇలా తయారు చేయిస్తున్నాను" అంటూ లిస్టు చదివాడు.



"వంకాయ మెంతికారం పెట్టిన కూర
అరటికాయ నిమ్మకాయ పిండిన కూర
పెసరపప్పుతో చుక్కకూర
వాక్కాయ కొబ్బరి పచ్చడి
పొట్లకాయ పెరుగుపచ్చడి
అల్లం, ధనియాల చారు
మసాలా పప్పుచారు
జీడిపప్పు, పచ్చకర్పూరాలతో పాయసం
మామిడికోరుతో పులిహోర
గుమ్మడి వడియాలు, వూరమిరపకాయలు
అందరికీ సమ్మతమేనా" అని అరిచాడు.

సమ్మతమేమిటి నా మొహం – అప్పటికప్పుడు అందరి నోళ్ళలో నీరూరించి ఇంకా వంటలు కాకముందే భోజనం మీద అందరికీ మమకారం పెంచాడు. జిహ్వ గిలగిలలాడుతుండగా అందరి కడుపుల్లో ఆకలి అగ్నిలా లేచింది.

అంతటితో ఆగాడు కాదు బావగాడు. మరో అరగంటలో వంకాయలు కడిగించి బుట్టలో వేయించి అందరి దగ్గరకూ ప్రదర్శనకు పట్టుకొచ్చాడు. "చూశారా! లేత వంకాయలు... నవనవలాడుతున్నాయి... మెంతికారం పెట్టి కూర వండిస్తున్నాను... దగ్గరుండి కోయించుకువచ్చాను..." అని అందరికీ చూపించి వెళ్ళిపోయాడు. ఆతరువాత జనానికి వేరే ఆలోచనలు పోయేవికావు. వంకాయ గురించే చర్చలు. వంకాయ ఎన్ని రకాలుగా కూరలు చేయొచ్చు? కాయ కాయపళంగా వండితే రుచా? తరిగి వండితే రుచా? అసలు రుచి వంకాయలో వుందా? వంకాయ తొడిమలో వుందా? ఇలా చర్చలు సాగాయి.

మరో అరగంటకి...

నిగనిగలాడే వాక్కాయల బుట్టతో, లేతచుక్కకూర మోపుతో వచ్చి అందర్నీ పలకరించాడు. "వాక్కాయ దివ్యమైన పులుపు చూడండి" అని తలా ఓ కాయ పంచాడు. "చుక్కకూర కందిపప్పుతో కంటే పెసరపప్పుతో మహా చక్కగా మేళవిస్తుంది" అని అందరికీ మళ్ళీ జ్ఞాపకం చేశాడు. మళ్ళీ జనం అంతా వంట కబుర్లలో

పడేవారు. బావగాడు ఇలా ప్రదర్శనలిస్తుంటే ఆకలి రెపరెప పెరుగుతోంది.

ఇక అక్కడ గాడిపొయ్యిదగ్గర వంటవాళ్ళని పరుగులు తీయిస్తున్నాడు. పాయసంలో ఎత్తుకు ఎత్తు జీడిపప్పు వెయ్యమని పురమాయిస్తున్నాడు.

ఓ పక్క పులిహోర తిరగమోత వెయ్యగానే రయ్యిన జనం దగ్గరకు పరుగెత్తుకు వొచ్చి "ఆ వాసన చూశారా పులిహోర తిరగమోత... సన్నబియ్యంతో చేయిస్తున్నాను" అని మళ్ళీ మాయమయ్యేవాడు.

మళ్ళీ జనానికి ఆకలి ఉవ్వెత్తున లేచింది. ఆకలి నిలువెత్తయింది. తాటి ప్రమాణమైంది. శరీరం అంతా ఆకలే అయి కూర్చుంది. జనం అంతా ఎప్పుడు వడ్డిస్తారా అని ఆవురావురు మంటున్నారు. ఎట్టకేలకు గంట కొట్టాడు బావగాడు. "లేత అరిటాకులు శుభ్రంగా కడుక్కోండి" అని వరుసల మధ్యకొచ్చి హెచ్చరించాడు.

"సుబ్బయ్యన్నయ్యకు ఒక ఆకు వేస్తావేం? రెండు ఆకులు కలిపి వేయించు" అంటున్నాడు.


వడ్డనలు మొదలయ్యాయి. నేతి జారీ పుచ్చుకొని పేరు పేరునా అందర్నీ అడిగి వడ్డిస్తున్నాడు. "వంకాయ వదిలేయకూడదు. నిమ్మకాయ పిండిన అరటికాయ కూరలో కరివేపాకు రుచి తమకు తెలియనిది కాదు" అంటూ మళ్ళీ కూర వడ్డింపించి ఆకలి పెంచుతున్నాడు. జనం ఆబగా తింటున్నారు.

"చుక్కకూర పప్పులో వూరమిరపకాయలు మిళాయించండి."

"పప్పుచారులో గుమ్మడి వడియాలు కలిపి చూడండి."

"వాక్కాయ పచ్చడిలో పెరుగు పచ్చడి నంజుకోవచ్చు. తప్పులేదు."

"ఇంకా విస్తట్లో మిగిల్చావేం. పూర్తిచేసి పాయసానికి ఖాళీగా వుంచుకో..."



"అప్పుడే మంచినీళ్ళు తాగెయ్యకు. మీగడ పెరుగుంది..." ఇలా ఎగసన తోస్తుంటే ఎవరాగగలరు? జనం కలబడి భోంచేశారు. జన్మలో ఇంత దివ్యమైన వంట ఎరగమన్నారు. విస్తళ్ళముందునుంచి పైకి లేవడమే కష్టమైంది. అందరికీ తాంబూలాలు ఇచ్చిన తరువాత వంటవాళ్ళని కూర్చోబెట్టాడు బావగాడు. "కష్టపడి వండారు తినకపోతే ఎలా?" అని కొసరి కొసరి వడ్డించాడు. వాళ్ళ భోజనాలు కూడా అయిన తరువాత అందరికంటే ఆఖరున గాడిపొయ్యి పక్కన ఓ చిన్న ఆకు వేసుకుని తను కూర్చున్నాడు.

అప్పటికి కూరలు మిగల్లేదు.

ఓ గంటె పప్పు, కాస్తంత పచ్చడి, గుప్పెడు పులిహోర, మిగిలితే అవే వడ్డింపించుకుని వంటరుచిని మళ్ళీ మళ్ళీ మెచ్చుకుంటూ అందరి భోజనం తనే చేస్తున్నాను అన్నంత హాయిగా భోంచేశాడు. తనకేం మిగల్లేదనే బాధలేదు. నలుగురూ హాయిగా, తృప్తిగా, రుచిగా తిన్నారనే సంతోషమే ఆ బావగాడి తాంబూలపు పెదాలపైని చిరునవ్వు.

## అవగాహన - ప్రతిస్పందన

1. 'తృప్తి' కథలో మీకు నచ్చిన అంశాల గురించి చెప్పండి.
2. పూర్ణయ్య పాత్ర ద్వారా నిజమైన తృప్తిని తెలియజేసిన రచయిత గురించి రాయండి.
3. వనసంతర్పణలో జనాలకు ఆకలి ఎందుకు పెరిగిపోయింది ?
4. **కింది టికెట్టులోని విషయాలను చదివి, కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**

టి.నెం. 671216
దివ్యాంగుల సహాయార్థం
టి-20 క్రికెట్ పోటీ
సి.ఆర్.ఆర్. × డి.ఎస్.ఆర్.
జింఖానా మైదానం,
విజయవాడ.
తేది : 3-12-2020

టి.నెం. 671216
దివ్యాంగుల సహాయార్థం
**టి-20 క్రికెట్ పోటీ**
**సి.ఆర్.ఆర్. × డి.ఎస్.ఆర్.**
వెల : రూ. 50/-
**జింఖానా మైదానం, విజయవాడ.**
**తేది : 3-12-2020 సమయం : ఉ॥ 10 గం॥లకు**
నిర్వహణ : మదర్‌థెరిస్సా సేవాసంస్థ, విజయవాడ

అ) పై టికెట్టు ఏ ఆటకు సంబంధించింది ? టికెట్టు వెల ఎంత ?

జ. ..........................................................................................

ఆ) క్రికెట్ పోటీ ఎక్కడ జరుగుతుంది ?

జ. ..........................................................................................

ఇ) పై పోటీ ఎందుకు నిర్వహిస్తున్నారు ?

జ. ..........................................................................................

ఈ) పై టికెట్టు ఆధారంగా ఒక ప్రశ్న రాయండి

జ. ..........................................................................................

## వ్యక్తీకరణ - సృజనాత్మకత

**అ) కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాలలో జవాబులు రాయండి.**

1. వనసంతర్పణలో వంటల కోసం పూర్ణయ్య ఎటువంటి ఏర్పాట్లు చేశాడు ?
2. వంకాయ గురించి జనాలు ఏమని చర్చించారు ?
3. వనసంతర్పణలో పూర్ణయ్య తృప్తికి కారణం ఏమిటి ?

**ఆ) కింది ప్రశ్నలకు 8 నుండి 10 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. 'తృప్తి' కథలో పూర్ణయ్య పాత్ర ద్వారా మీరు తెలుసుకున్న విషయాలు ఏమిటి ?
2. ఇతరుల మేలు కోసం మీరెప్పుడైనా ఏదైనా చేసి తృప్తిచెందిన సందర్భం చెప్పండి.
3. పూర్ణయ్యలాంటి వ్యక్తులు మీకు తెలిసిన వారుంటే వారిని ప్రశంసిస్తూ రాయండి.



## భాషాంశాలు

**(అ) 1. కింది గుణింతాక్షరాలను చదవండి. ఇచ్చిన అక్షరాలకు గుణింతాలు రాయండి.**

**గుణింతాల పునశ్చరణ**

| హల్లు | అ | ఆ | ఇ | ఈ | ఉ | ఊ | ఋ | ౠ |
|---|---|---|---|---|---|---|---|---|
| | ✓ | ా | ి | ీ | ు | ూ | ృ | ౄ |
| క్ | క | కా | కి | కీ | కు | కూ | కృ | కౄ |
| చ్ | చ | | | | | | | |
| ట్ | ట | | | | | | | |
| త్ | త | | | | | | | |
| ప్ | ప | | | | | | | |

**2. కింది గుణింతాక్షరాలను చదవండి. ఇచ్చిన అక్షరాలకు గుణింతాలు రాయండి.**

| పొల్లు | అ | ఆ | ఇ | ఈ | ఉ | ఊ | ఋ | ౠ |
|---|---|---|---|---|---|---|---|---|
| | ✓ | ా | ి | ీ | ు | ూ | ృ | ౄ |
| గ్ | గ | గా | గి | గీ | గు | గూ | గృ | గౄ |
| జ్ | జ | | | | | | | |
| డ్ | డ | | | | | | | |
| ద్ | ద | | | | | | | |
| బ్ | బ | | | | | | | |

**3. కింది గుణింతాక్షరాలను చదవండి. మిగతా గుణింతాలను పూరించండి.**

| హల్లు | ఎ | ఏ | ఐ | ఒ | ఓ | ఔ | అం | అః |
|---|---|---|---|---|---|---|---|---|
| | ె | ే | ై | ొ | ో | ౌ | ం | ః |
| క్ | కె | కే | కై | కొ | కో | కౌ | కం | కః |
| చ్ | చె | | | | | | | |
| ట్ | | | టై | | | | | |
| త్ | | | | | తో | | | |
| ప్ | | పే | | | | | | |
| గ్ | | | | గొ | | | | |
| జ్ | | | | | | జౌ | | |
| డ్ | | | | | | | డం | |
| ద్ | దె | | | | | | | |
| బ్ | | | | | | | | బః |

**4. గుణింతాక్షరాలలో తేడాను గమనిస్తూ కింది పదాలు చదవండి. ఉక్తలేఖనం రాయండి. అర్థాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోండి.**

1. కలం – కాలం
2. చలి – చావిడి
3. టముకు – టామీ
4. తడి – తాడి
5. పదం – పాదం
6. కిటికి – కీటకం
7. చిరాకు – చీర
8. టింకు – టీకా
9. తిను – తీరు
10. పిత – పీత
11. కుదురు – కూతురు
12. చురుకు – చూరు
13. టుంగు – టూరు
14. తుల – తూము
15. పురి – పూరీ

**5. కింది పదాలలో గుణింతాక్షరాలలో తేడాను గమనిస్తూ చదవండి. అర్థాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోండి. ఉక్తలేఖనం రాయండి.**

1. గది – గాది
2. జలం – జాలం
3. డబడబ – డాబా
4. దడి – దాడి
5. బడి – బాడి
6. గిరి – గీత
7. జిలుగు – జీలుగు
8. డింకి – డీలా
9. దిన – దీన
10. బిరబిర – బీర
11. గుడి – గూడు
12. జులుం – జూలు
13. బుడుగు – గూడూరు
14. దుడుకు – దూకుడు
15. బురద – బూర

గృహం
విజృంభణ
కృపాణం
దృఢం
బృందం

**6.** **కింది పదాలలో గుణింతాక్షరాలలో తేడాను గమనిస్తూ చదవండి. అర్థాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోండి. ఉక్తలేఖనం రాయండి.**

| ె | ే | ై | ొ | ో | ౌ |
|---|---|---|---|---|---|
| కెరటం | కేతనం | కైక | కొడుకు | కోడలు | కౌలు |
| చెద | చేను | చైను | చొరవ | చోటు | చౌక |
| టెంక | టేకు | టైరు | టొంకు | టోపి | టౌను |
| తెర | తేరు | తైలం | తొన | తోట | తౌడు |
| పెరుగు | పేరు | పైరు | పొర | పోరు | పౌడరు |
| గెల | గేదె | గైడు | గొడవ | గోడ | గౌను |
| జెముడు | జేబు | జైలు | జొంపు | జోల | జౌకు |
| డెందం | డేగ | డైరీ | డొంక | డోలు | డౌను |
| దెస | దేశం | దైవం | దొర | దోమ | దౌడు |
| బెడద | బేరం | బైబిలు | బొరుసు | బోరు | బౌలరు |

## ద్విత్వాక్షరాల పదాల పునశ్చరణ

**అ)** **1.** **ఒక హల్లుకు దాని ఒత్తు చేరితే దాన్ని 'ద్విత్వాక్షరం' అంటారు. కింది ద్విత్వాక్షరాలను పదాలను చదవండి. కొత్త పదాలు రాయండి.**

| హల్లు | ఒత్తు | ద్విత్వాక్షరం | ద్విత్వాక్షర పదాలు | మీరో రెండు పదాలు సొంతంగా రాయండి |
|---|---|---|---|---|
| క | ్క | క్క | అక్క, లక్క | |
| చ | ్చ | చ్చ | మచ్చ, లచ్చి | |
| ట | ్ట | ట్ట | అట్ట, బుట్ట | |
| త | ్త | త్త | అత్త, నత్త | |
| ప | ్ప | ప్ప | కప్ప, గొప్ప | |

**2.** **ఉపాధ్యాయుడు ఇచ్చిన అక్షరాలకు ఒత్తులు చేర్చి గుణింతాలు రాయండి. చెప్పిన పదాలను ఉక్తలేఖనం రాయండి.**

**3. కింది ద్విత్వాక్షరాలను, పదాలను చదవండి, కొత్త పదాలు రాయండి.**

| హల్లు | ఒత్తు | ద్విత్వాక్షరం | ద్విత్వాక్షర పదాలు | మరో రెండు పదాలు సొంతంగా రాయండి |
|---|---|---|---|---|
| గ | ్గ | గ్గ | మొగ్గ, బుగ్గ | |
| జ | ్జ | జ్జ | ఒజ్జ, మజ్జ | |
| డ | ్డ | డ్డ | బిడ్డ, గడ్డం | |
| ద | ్ద | ద్ద | ముద్ద, అద్దం | |
| బ | ్బ | బ్బ | దెబ్బ, రెబ్బ | |

**4. కింది అక్షరాల ఒత్తులు గమనించండి, మరల రాయండి.**

| హల్లు | ఖ | ఛ | ఠ | థ | ఫ | ఘ | ఝ | ఢ | ధ | భ |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| ఒత్తు | ్ఖ | ్ఛ | ్ఠ | ్థ | ్ఫ | ్ఘ | ్ఝ | ్ఢ | ్ధ | ్భ |
| | | | | | | | | | | |

**5. కింది వానిలో గీత గీసిన అక్షరాలకు ఒత్తులు చేర్చి ద్విత్వాక్షర పదాలతో వాక్యాలు రాయండి.**

**ఉదా :** కొయబొమ నచింది = కొయ్యబొమ్మ నచ్చింది.

1. అవ బువ తింటునది = ________________
2. అత సుదులు చెపింది = ________________
3. అక సనగా నవింది = ________________
4. బసు మెలగా వచింది = ________________
5. అమ అనం ముదలు పెటింది = ________________

## సంయుక్తాక్షరాల పదాల పునశ్చరణ

**1. ఒక హల్లుకు వేరొక హల్లు ఒత్తు చేరితే దాన్ని సంయుక్తాక్షరం అంటారు. కింది పదాలను చదవండి. సంయుక్తాక్షరాలను '◯' చుట్టి గుర్తించండి.**

1. పగ్గము 2. పుణ్యము 3. అల్లం 4. చంద్రుడు 5. కీర్తి

**2. కింద ఇవ్వబడిన అక్షరాలను కలిపి సంయుక్తాక్షరంగా మార్చి పదాలను రాయండి.**

ఉదా॥ 1. వ జ్ + ర్ + అ ము = వజ్రము

2. ఉ ల్ + క్ + అ లు = ________
3. ఖ ర్ + చ్ + ఉ = ________
4. కు ర్ + చ్ + ఈ = ________
5. బా ల్ + య్ + అ ము = ________
6. చె ట్ + ల్ + ఉ = ________

**3. కింది పదాలను చదవండి. ఒక హల్లుకు రెండు ఒత్తులున్న పదాలను '◯' చుట్టి గుర్తించండి. మొదట పలికే హల్లుకు మిగిలిన ఒత్తులు చేర్చి పలికే, రాసే క్రమాన్ని గమనించండి. ఉదాహరణ చూసి ఇచ్చిన పదాలలోని అక్షరాలను విడివిడిగా రాయండి.**

| | రెండు ఒత్తుల పదం | రెండు ఒత్తుల అక్షర క్రమం | మొదట పలికే, రాసే అక్షరం మిగిలిన ఒత్తులు | రెండు ఒత్తులున్న అక్షరం |
|---|---|---|---|---|
| ఉదా॥ | వస్త్రము | స్ + త్ + ర్ + అ | స + ్త + ్ర | స్త్ర |
| | లక్ష్మీ | క్ + ష్ + మ్ + ఈ | కీ + ్ష + ్మ | క్ష్మీ |
| | అగస్త్యుడు | స్ + త్ + య్ + ఉ | | |
| | కక్ష్య | | | |
| | రాష్ట్రము | | | |
| | ప్రాశస్త్యం | | | |

**4. పాఠంలోని కింది పదాలను చదవండి. కింది పట్టికను పూరించండి.**

చాపలు కూర వంకాయ పెసరపప్పు అన్నం మెంతికారం పొట్లకాయ గరిటె పులిహోర చారు బుట్ట అరటికాయ వడియాలు మసాలా పసుపు వాక్కాయ గంట విస్తరి పాయసం ధనియాలు మామిడికాయ పొయ్యి మిరపకాయ పచ్చడి పచ్చకర్పూరం జారీ జీడిపప్పు నిమ్మకాయ

| వంటకాలు | కూరగాయలు | కిరాణా సరుకులు | వస్తువులు |
|---|---|---|---|
| | | | |
| | | | |
| | | | |
| | | | |
| | | | |
| | | | |
| | | | |

## ప్రాజెక్టుపని **(మొదటి నిర్మాణాత్మక మూల్యాంకనం కోసం)**

ఇతరుల కోసం త్యాగం చేసిన మహాపురుషుల కథలు మూడింటిని గ్రంథాలయం నుంచి సేకరించి ప్రదర్శించండి. (ఉదా॥ శిబిచక్రవర్తి, రంతిదేవుడు మొ॥నవి)



## నేనివి చేయగలనా?




| | | |
|---|---|---|
| 1. | 'తృప్తి' కథను సొంతమాటల్లో చెప్పగలను, రాయగలను. | ఔను / కాదు |
| 2. | గుణింతాక్షర పదాలు, వాక్యాలు చదవగలను, రాయగలను. | ఔను / కాదు |
| 3. | ద్విత్వాక్షర పదాలు చదవగలను, రాయగలను. | ఔను / కాదు |
| 4. | సంయుక్తాక్షర పదాలు చదవగలను, రాయగలను. | ఔను / కాదు |

చదవండి - ఆనందించండి

# కుచేలోపాఖ్యానం

Q1X9D5

కుచేలుడు అనే పేరు విన్నారా మీరెప్పుడైనా? - విన్నాం గురువుగారూ! శ్రీకృష్ణుడి స్నేహితుడు కదా! అంటూ పిల్లలంతా ఉత్సాహంగా అన్నారు.



అందరికీ బాగా తెలిసిందే అంటూ కథ ప్రారంభించారు గురువుగారు. కుచేలుడు చాలా పేదవాడు. చినిగిపోయిన వస్త్రాలు కట్టుకొని తిరిగేవాడు. కుటుంబం గడవటం కష్టంగా ఉండేది. ఒకనాడు కుచేలుడితో ఆయన భార్య "నాథా! ఇన్ని కష్టాలు పడుతున్నాంకదా! చిన్ననాటి మీ స్నేహితుడు శ్రీకృష్ణుడున్నాడు గదా! ఆయునను సహాయం అడగండి" అని చెప్పింది.

సరే! అన్నాడు కుచేలుడు. కుచేలుడు చిన్ననాటి స్నేహితుడికి ఏదైనా తీసుకొని వెళ్లాలని అనుకొన్నాడు. తీసుకొనిపోవడానికి ఇంట్లో ఏమీ లేవు. భార్య తన పంచెకొంగున కట్టిన పిడికెడు అటుకులు తీసుకొని శ్రీకృష్ణుడి వద్దకు బయలుదేరాడు కుచేలుడు.

కుచేలుణ్ణి చూచి శ్రీకృష్ణుడు ఎంతో ఆనందపడ్డాడు, అక్కున చేర్చుకున్నాడు, సకలోపచారాలూ చేశాడు. కుచేలుడు తెచ్చిన అటుకులు ఎంతో మక్కువతో ఆరగించాడు. రుక్మిణీ కృష్ణులు కుచేలునికి పరిచర్యలు చేశారు. కుచేలుడు శ్రీకృష్ణుడిని ఏమీ అడగలేదు. కుచేలుడు ఇంటికి తిరిగి వచ్చేసరికి అతని పాత కుటీరం స్థానంలో మహా భవనం వెలసింది. కుచేలుడు ఏమీ అడగక పోయినా శ్రీకృష్ణుడు అతన్ని ఐశ్వర్యవంతుడిని చేశాడు. ఈ సన్నివేశం మిత్ర ప్రేమకు దృష్టాంతం.

# 3. మాకొద్దీ తెల్ల దొరతనం

Y4L2V2

**వినడం - ఆలోచించి మాట్లాడడం**



1. చిత్రం చూడండి. చిత్రం గురించి మాట్లాడండి.

**ఉద్దేశం:** ఆంగ్లేయుల ప్రభుత్వంలో భారతీయులు ఎన్నో శారీరక, మానసిక బాధల్ని అనుభవించారు. స్వేచ్ఛను, స్వాతంత్ర్యాన్ని కోల్పోయారు. స్వాతంత్ర్యంకోసం ఆనాటి ప్రజలు పడిన కష్టాల్ని, ఆంగ్లేయుల అధికారానికి వ్యతిరేకంగా చేసిన ఉద్యమాన్ని తెలియజేయడమే ఈ పాఠం ఉద్దేశం.

**కవి పరిచయం**

## గరిమెళ్ల సత్యనారాయణ

(14.7.1893 -18.12.1952)



శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట తాలూకా గోనెపాడులో జన్మించారు. స్వాతంత్ర్య సమరయోధులు, కవి, రచయిత. 1921లో 'స్వరాజ్య గీతములు', 1923లో 'హరిజనుల పాటలు', 1926లో ఖండ కావ్యాలు, భక్తి గీతాలు, బాల గీతాలు రాశారు. "దండాలండోయి మేముండలేమండోయ్ బాబు", 'మాకొద్దీ తెల్లదొరతనము' అనే గేయాలతో సామాన్య ప్రజల్లో సైతం స్వాతంత్ర్య ఉద్యమ ఉత్తేజాన్ని, చైతన్యాన్ని కలిగించిన జాతీయ కవి. దేశభక్తి కవితలు రాసి జైలు శిక్ష అనుభవించిన వారిలో మొదటివారు గరిమెళ్ల.

# మాకొద్దీ తెల్ల దొరతనము

1. మాకొద్దీ తెల్ల దొరతనము, దేవ
మాకొద్దీ తెల్ల దొరతనము
మా ప్రాణాలపై పొంచి
మానాలు హరియించె
॥మాకొద్దీ॥


2. పన్నెండు దేశాలు పండుచున్నాగాని
పట్టెడన్నమె లోపమండీ
ఉప్పుముట్టుకుంటే దోషమండీ
నోట మట్టిగొట్టి పోతాడండీ
అయ్యో! కుక్కలతో పోరాడి కూడూ తినమంటాడు
॥మాకొద్దీ॥

3. ధనము కోసము వాడు దారి చేసికోని
కల్లు సారాయమ్ముతాడు
మాదు మూటాముల్లెలు దోచినాడు
ఆలి మెళ్లో పుస్తెలు తెంచుతాడు
మాదు కళ్లల్లో దుమ్మేసి కాటికి దరిచేసాడు
॥మాకొద్దీ॥

4. గాంధీ టోపీ పెట్టి పాఠశాలకు బోవ
రావద్దు రావద్దంటాడు
రాట్నం బడిలో పెట్టవద్దంటాడు
టోపి తీసి వీపులు బాదుతాడు
అయ్యో! రాజద్రోహమంత రాట్నంలో ఉన్నదంట
॥మాకొద్దీ॥

5. నూటనలుబదినాల్గు నోటికి తగిలించి
మాటలాడ వద్దంటాడు
మమ్ము పాట పాడ వద్దంటాడు
తనను దాటి వెళ్లవద్దంటాడు
అయ్యో! చేటు తెచ్చుక మమ్ము చెడిపోవమంటాడు
॥మాకొద్దీ॥

6. వాడి తాతగారి ముల్లె దాచిపెట్టినట్లు
ధాటీ చేస్తాడీ దేశమున
పోరాటమాడుతాడు పైన
మోమాటము పడడు సుంతైన
వాడి పాటు పాడైపోను మాటచెపితె వినడు
॥మాకొద్దీ॥



## సారాంశం



1. ఓ దేవా! భారతీయులమైన మా మానప్రాణాలను తీయడానికై అదనుకోసం చూసే తెల్లవారి (ఆంగ్లేయుల) ప్రభుత్వం మాకు వద్దే వద్దు.
2. పలు దేశాలలో పంటలు పండుతున్నాయి. కాని పట్టెడన్నానికి నోచుకోలేకపోతున్నాం. ఉప్పును ముట్టుకుంటే పరిహారం విధించి మా నోట్లో మట్టిగొడుతున్నారు. కుక్కలకు వేసే అన్నం కోసం వాటితో పోరాడి ఆకలి తీర్చుకోమంటున్నారు.
3. ధన సంపాదన కోసం కల్లు, సారాయి అమ్ముతున్నారు. ఆ నెపంతో దాచుకున్న డబ్బును దోచుకుంటున్నారు. భార్యల మెడలలో తాళిబొట్లు ఉండనీయడం లేదు. మా కళ్లుగప్పి ప్రాణాలకే ముప్పు తెస్తున్నారు.
4. గాంధీ టోపీ పెట్టుకొని పాఠశాలకు రావద్దంటున్నారు. బడిలో రాట్నం పెట్టవద్దంటున్నారు. తలపై టోపీ తీసివేసి వీపులపై బాదుతున్నారు. రాట్నం ఉపయోగించిన వారిని రాజద్రోహులుగా జమకడుతున్నారు.
5. నూట నలభై నాలుగవ సెక్షన్ చీటీని నోటికి తగిలించి మాట్లాడవద్దంటున్నారు. స్వాతంత్ర్యోద్యమ గీతాలు పాడవద్దంటున్నారు. వారి అనుమతి లేకుండా ముందుకు వెళ్లవద్దంటున్నారు. భారతీయులను బానిసలుగానే బతకమంటున్నారు.
6. వారి తాతలు సంపాదించిన ధనం మూట ఈ దేశంలో దాచిపెట్టినట్లు ఆంగ్లేయులు స్వదేశీయులమైన మామీద దాడి చేస్తున్నారు. అనవసరమైన జగడాలు పెట్టుకుంటున్నారు. ఏమాత్రం జంకు లేకుండా ఉన్నారు. మా మాట వినకుండా ఏకపక్షంగా అధికారం చెలాయించే వీరి అఘాయిత్యాలు ఆగిపోవాలి.

**ఇవి చేయండి**

**ఉపాధ్యాయుడు చెప్పిన కింది పదాలను (ఉక్తలేఖనం) రాయండి.**

ప్రాణం, హరియించు, పట్టెడన్నం, మూటాముల్లే, పుస్తెలు, పాఠశాల, ద్రోహం, రాట్నం, ధాటి, దేశం, పోరాటం, మోమాటం, సుంతైన.



## అవగాహన - ప్రతిస్పందన

1. ఈ గేయాన్ని రాగయుక్తంగా పాడండి, అభినయించండి.
2. కింది వాక్యాలను చదవండి. వీటికి సంబంధించిన పంక్తులు గేయంలో ఎక్కడ ఉన్నాయో గుర్తించండి, రాయండి.

అ) మా ధనం మూటలు దోచుకున్నాడు.

ఆ) కీడుతో మమ్మల్ని చెడిపోమంటున్నాడు.

ఇ) ఈ దేశం మీద దాడి చేస్తున్నాడు.

ఈ) ఉప్పు తాకితే తప్పంట.

3. కింది ఖాళీలను సరైన గేయ భాగంతో పూరించండి.

గాంధీ టోపీ పెట్టి ..................................

రావద్దు ..................................

రాట్నం బడిలో ..................................

.................................. వీపులు బాదుతాడు.

అయ్యో! .................................. రాట్నంలో ఉన్నదంట.

4. ఈ కింది కవితను చదవండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.

ఏమి మహిమంబు గలదొ నీనామమందు
'బాపు' అనిపేరు వీనులబడిన యంత
నిలువునను నాదు మేనెల్ల పులకరించు
జల్లుమని నాదు హృదయంబు జలదరించు
సర్వసారస్వత ప్రపంచంబు నందు
గాంధి యనియెడి వర్ణయుగంబు తోడ
సాటి వచ్చెడు వేరొక్కమాట గలదె
– నాళం కృష్ణారావు



(అ) ఎవరి నామం వినడం వలన మేను పులకరిస్తుందని కవి అంటున్నారు?

(ఆ) ఈ కవిత ఎవరిని గురించి తెలుపుతుంది?

(ఇ) ఈ కవితలో "అక్షరాల జంట" అని అర్థం వచ్చే పదబంధం ఏది?

(ఈ) పై కవిత ఆధారంగా ఒక ప్రశ్న తయారుచేయండి.



## వ్యక్తీకరణ – సృజనాత్మకత

**అ) కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాల్లో జవాబులు రాయండి.**

1. భారతీయులు పట్టెడన్నం కోసం ఎటువంటి పాట్లు పడ్డారు ?
2. ఆంగ్లేయులు భారతీయులపై దాడి చేయడం అమానుషమని ఎలా చెప్పగలరు ?
3. బడిలో చదువుకున్న ఆనాటి పిల్లల పరిస్థితి ఎలా ఉండేది ? ఈనాటి పరిస్థితి ఎలా ఉంది? మీరు గమనించిన తేడాలు ఏమిటి ?

**ఆ) కింది ప్రశ్నలకు 8 నుండి 10 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. ఆంగ్లేయుల ప్రభుత్వాన్ని భారతీయులు వద్దనడానికి గల కారణాలను గేయం ఆధారంగా వివరించండి.
2. బానిసతనం అంటే ఎవరూ ఇష్టపడరు. అందరూ స్వేచ్ఛనే కోరుకుంటారు. ఎందుకు?
3. ఆంగ్లేయుల ప్రభుత్వంలో మగ్గిన సగటు భారతీయుని ఆవేదనను ఏకపాత్రగా రాయండి. ప్రదర్శించండి.

## భాషాంశాలు

**అ) కింది వాక్యాల్లో గీత గీసిన పదాలకు అర్థాలు రాయండి. వాటితో సొంత వాక్యాలు రాయండి.**

ఉదా॥ విదేశీయుల దొరతనం లో స్వేచ్ఛ ఉండదు.

దొరతనం = ప్రభుత్వం

ప్రజల శాంతి భద్రతలను ప్రభుత్వం పట్టించుకోవాలి.

1. కూడు లేని పేదలను ఆదరించాలి.

   ..........................................................................................

2. సొంత లాభం సుంతైన మానుకొని పొరుగువారికి తోడుపడాలి.

   ..........................................................................................

3. ముల్లె సంపాదించినంత మాత్రాన గొప్పవాళ్లం కాము.

   ..........................................................................................

**ఆ) కింది వాక్యాలలో సమానార్థక పదాలు (పర్యాయపదాలు) గుర్తించి రాయండి.**

1. చేటు కలిగించే పనులు చేయకూడదు. అవి జీవితానికి ఎంతో కీడు చేస్తాయి.
2. విజయనగర రాజు కృష్ణదేవరాయలు. ఆ ప్రభువు తెలుగుభాషను ఎంతగానో ఆదరించాడు.
3. అధికారం కోసం పోరాటం, ఆస్తుల కోసం యుద్ధం చేయడం మంచిది కాదు.

**ఇ) కింది పదాలను సరైన వ్యతిరేకార్థక పదాలతో జతపరచండి.**

| | | | | |
|---|---|---|---|---|
| 1. | కావాలి | (   ) | అ) | చెడు |
| 2. | మంచి | (   ) | ఆ) | వినడు |
| 3. | వింటాడు | (   ) | ఇ) | వద్దు |



## వ్యాకరణాంశాలు

### అక్షర విభాగం

**అ) తెలుగు భాషలో 56 అక్షరాలున్నాయి. ఇవి అచ్చులు, హల్లులు, ఉభయాక్షరాలని మూడు విధాలు.**

అ, ఆ, ఇ, ఈ, ఉ, ఊ, ఋ, ౠ, ఌ, ౡ, ఎ, ఏ, ఐ, ఒ, ఓ, ఔ = (16) అచ్చులు.

క, ఖ, గ, ఘ, ఙ, చ, ౘ, ఛ, జ, ౙ, ఝ, ఞ, ట, ఠ, డ, ఢ, ణ, త, థ, ద, ధ, న, ప, ఫ, బ, భ, మ, య, ర, ఱ, ల, ళ, వ, శ, ష, స, హ = (37) హల్లులు.

ం (సున్న), ఁ (అరసున్న), ః (విసర్గ) = (3) ఉభయాక్షరాలు

## ఆ) అచ్చులు - విభాగం

1. ఒక మాత్ర కాలంలో ఉచ్చరించే అక్షరాలు - అ, ఇ, ఉ, ఋ, ఌ, ఎ, ఒ - **హ్రస్వాలు.**
2. రెండు మాత్రల కాలంలో ఉచ్చరించే అక్షరాలు - ఆ, ఈ, ఊ, ౠ, ౡ, ఏ, ఐ, ఓ, ఔ - **దీర్ఘాలు.**

## ఇ) హల్లులు - విభాగం

'క' నుండి 'మ' వరకు గల అక్షరాలను అయిదు వర్గాలుగా విభజించవచ్చు. అవి :

| | | |
|---|---|---|
| క - ఖ - గ - ఘ - ఙ | - | 'క' వర్గం. |
| చ - ఛ - జ - ఝ - ఞ | - | 'చ' వర్గం. |
| ట - ఠ - డ - ఢ - ణ | - | 'ట' వర్గం. |
| త - థ - ద - ధ - న | - | 'త' వర్గం. |
| ప - ఫ - బ - భ - మ | - | 'ప' వర్గం. |



1. కఠినంగా పలికే అక్షరాలు - క, చ, ట, త, ప - **పరుషాలు.**
2. తేలికగా పలికే అక్షరాలు - గ, జ, డ, ద, బ - **సరళాలు.**
3. వర్గములలో ఉండే ఒత్తు అక్షరాలు - ఖ, ఘ, ఛ, ఝ, ఠ, ఢ, థ, ధ, ఫ, భ - **వర్గయుక్కులు.**
4. ముక్కు సాయంతో పలికే అక్షరాలు - ఙ, ఞ, ణ, న, మ - **అనునాసికాలు.**
5. అంగిలి సాయంతో పలికే అక్షరాలు - య, ర, ఱ, ల, ళ, వ - **అంతస్థాలు.**
6. గాలిని బయటికి ఊదుతూ పలికే అక్షరాలు - శ, ష, స, హ - **ఊష్మాలు.**
7. పరుష, సరళాలు కాకుండా మిగిలిన హల్లులు - **స్థిరాలు.**
8. 'క' నుండి 'మ' వరకు గల హల్లులు - **స్పర్శాలు.**

## ఈ) వర్ణోత్పత్తి స్థానాలు

1. కంఠం నుండి పుట్టే అక్షరాలు - అ, ఆ, క, ఖ, గ, ఘ, ఙ, హ, ః - **కంఠ్యాలు.**
2. తాలువు (దౌడ) భాగంలో పుట్టే అక్షరాలు - ఇ, ఈ, చ, ఛ, జ, ఝ, ఞ, య, శ - **తాలవ్యాలు.**
3. మూర్ధస్థానం (శిరస్సు) నుండి పుట్టే అక్షరాలు - ఋ, ౠ, ట, ఠ, డ, ఢ, ణ, ర, ష - **మూర్ధన్యాలు.**
4. దంతాల సాయంతో పలికే అక్షరాలు - ఌ, ౡ, ౘ, ౙ, త, థ, ద, ధ, న, ల, స - **దంత్యాలు.**
5. పెదవి సాయంతో పలికే అక్షరాలు - ఉ, ఊ, ప, ఫ, బ, భ, మ - **ఓష్ఠ్యాలు.**
6. ఎ, ఏ, ఐ - **కంఠతాలవ్యాలు** ఒ, ఓ, ఔ - **కంఠోష్ఠ్యాలు** వ - **దంతోష్ఠ్యం**

ఉ) కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

1. కింది పదాలలో ఒక వర్గపు అక్షరాలు దాగిఉన్నాయి. వాటిని గుర్తించండి.
   వింత, పథం, వందనం, విధం, మనం
2. కింది వాక్యంలో పరుషాలను గుర్తించండి.
   కలిసి చరించనిట హితము తెలుప
3. కింది వాక్యంలో సరళాలను గుర్తించండి.
   తగవు జరుగు నెడల నాదరి నిలబడరాదు
4. కింది పదాల్లో ఊష్మాలు గుర్తించండి.
   దేశం, ఋషం, గ్రాసం, లోహం



**ప్రాజెక్టుపని** (ఇది రెండవ నిర్మాణాత్మక మూల్యాంకనం కోసం)

స్వాతంత్ర్యోద్యమ గీతాలను సేకరించండి. వాటిని చార్టుమీద రాసి ప్రదర్శించండి.


**చమత్కార పద్యం**

కరయుగంబు గలదు చరణంబు లా లేవు
కడుపు, నడుము వీపు మెడయుగలవు
శిరము లేదుగాని నరులబట్టుక ట్రింగి
సొగసు గూర్చు దీని సొగసు గనుడి



**నేనివి చేయగలనా?**

1. పాఠంలోని గేయాన్ని రాగయుక్తంగా, భావయుక్తంగా పాడగలను. ఔను / కాదు
2. గేయసారాంశాన్ని సొంత మాటలలో చెప్పగలను, రాయగలను. ఔను / కాదు
3. పాఠంలోని పదాలను సొంత వాక్యాలలో ఉపయోగించగలను. ఔను / కాదు
4. పాఠంలోని పదాలతో కొత్త గేయం రాయగలను. ఔను / కాదు



ఈ దేశం నాకేమిచ్చింది అని బాధపడడంకన్నా, దేశానికి నేనేమి చేయగలుగుతున్నాను అని ఆలోచించేవాడే నిజమైన దేశభక్తుడు.

– గాంధీ

# సమయపాలన

- జీవనవిద్య

సమావేశానికి గాంధీగారంతటి వ్యక్తి నిరాడంబరంగా, సరైన సమయానికి సైకిల్‌మీద రావడం చూసిన అందరూ ఆశ్చర్యపోయారు. ఆయన ఒక్క క్షణం కూడా ఆలస్యం కాకుండా సభాస్థలికి చేరుకున్నారు. గాంధీజీ విలువల్ని పాటించే వ్యక్తి. ప్రాణం పోయినా సమయ పాలనను విడిచిపెట్టేవారు కాదు. ఏ పనైనా అది ఏ సమయానికి జరగాలో ఆ సమయానికి ఆరు నూరైనా, నూరు ఆరైనా జరిపేవారు. ఆఖరుకి జైలులో ఉన్న సమయంలో కూడా కచ్చితమైన సమయపాలన చేసేవారు గాంధీజీ.

దక్షిణాఫ్రికాలో ఉన్నప్పుడు, ప్రతిరోజూ ఉదయం పళ్ళు తోముకునే సమయాన్ని వృథా చేయకుండా ఉండేందుకు, అంతకు ముందురోజే కొన్ని భగవద్గీత శ్లోకాలను కాగితం మీద రాసి గోడమీద అతికించుకుని, పళ్ళు తోముకునే సమయంలో వాటిని బట్టీపట్టేవారు. ఆవిధంగా భగవద్గీతలోని చాలా అధ్యాయాలను గాంధీగారు కంఠస్థం చేశారు. అంత చక్కగా సమయాన్ని వినియోగించుకునే వారు గాంధీజీ.



విలువైన గడియారం ధరించి సమయపాలన చేయకపోవడం కంటే, సమయపాలన కోసం గడియారాన్ని మరిచిపోయినా ఫరవాలేదు కదా! అదే మనమైతే నిజంగా సమయం ఉన్నా లేదని చెప్పి, టీవీ చూస్తూనో, కబుర్లు చెబుతూనో కాలక్షేపం చేసి ఎంతో సమయాన్ని పాడుచేస్తూ ఉంటాం. కానీ చేయాల్సిన పనిని మాత్రం సమయానికి పూర్తిచేయక, తర్వాత జరిగిన నష్టానికి మనమే బాధపడుతూ ఉంటాం.

అందుకే అందరూ బాల్యం నుండే సమయపాలన అలవాటు చేసుకోవాలి. ఎటువంటి పరిస్థితులలోనైనా సమయాన్ని తప్పకుండా, జాగ్రత్తగా ప్రణాళికాయుతంగా సద్వినియోగం చేసుకోవాలి.

మరి అందరం అదే బాటలో పయనిద్దామా!

I5A9Z2

# 4. సమయస్ఫూర్తి (గద్యభాగం)

E4J9I9

## వినడం - ఆలోచించి మాట్లాడడం









1. చిత్రాలు చూడండి. కథను ఊహించి చెప్పండి.
2. కోతి లేకపోతే కోడి ఎలా తప్పించుకునేదో ఊహించి చెప్పండి.

**ఉద్దేశం:** ప్రపంచ ప్రసిద్ధిచెందిన కథలు పంచతంత్ర కథలు. మొదట సంస్కృతభాషలో విష్ణుశర్మ అనే పండితుడు ఈ కథలను రచించారు. పరవస్తు చిన్నయసూరి తెలుగులోకి పంచతంత్రాన్ని 'నీతిచంద్రిక' పేరుతో అనువదించారు. ప్రతి వ్యక్తి సమయోచిత ప్రతిభని కనపరచి ఆపదల నుండి తప్పించుకోవాలనీ, మోసపు మాటల్ని నమ్మకూడదనీ తెలియజేయడమే ఈ పాఠం ఉద్దేశం.


### కవి పరిచయం

## కందుకూరి వీరేశలింగం

(16.4.1848 - 27.5.1919)



రాజమండ్రిలో జన్మించారు. 'రాజశేఖర చరిత్రము', 'సత్యరాజా పూర్వదేశ యాత్రలు', 'హాస్య సంజీవని', 'సతీహిత బోధిని', 'ఆంధ్రకవుల చరిత్ర', మొదలైనవి వీరి రచనలు. వీరు సంఘసంస్కర్త, నవయుగ వైతాళికులు, విద్యావేత్త. 'గద్యతిక్కన' ఆయన బిరుదు. ఈ పాఠానికి మూలం కందుకూరి వీరేశలింగం అనువదించిన పంచతంత్ర కథలలోని 'విగ్రహం' అనే భాగంలోని కథ.




# సమయస్ఫూర్తి

పంచవటం (ఐదు చెట్ల సమూహం) అనే ప్రాంతంలోని ఒక మర్రిచెట్టు తొర్రలో "రోమశుడు" అనే పిల్లి నివసిస్తోంది. ఆ చెట్టు క్రింది కన్నంలో "పలితుడు" అనే ఎలుక కాపురముంటోంది. ఒకనాటి రాత్రి వేటగాడు అక్కడికి వచ్చి, ఆ చెట్టు చుట్టూ వలపన్నాడు.

అది తెలియని రోమశుడు తెల్లవారుతూనే మసక చీకటిలో ఆహారాన్వేషణకు బయలుదేరి ఆ వలలో చిక్కుకున్నాడు. ఇది చూసిన పలితుడు "ఆహా! ఎంత అదృష్టము. నా శత్రువు వలలో చిక్కుకున్నాడు. ఈనాటితో వాడి పీడ..." అనుకున్నాడు.

ఇదే సమయంలో "చంద్రకుడు" అనే గుడ్లగూబ హాయిగా విహరిస్తున్న ఎలుకను చూసి అక్కడకు వచ్చింది. చంద్రకుని చూసి పలితుని గుండె గుభేలుమంది. అయిపోయింది నాపని అనుకున్నాడు. ప్రాణభీతితో గిజగిజలాడాడు. "ఏం చెయ్యనురా దేవుడా" అంటూ చెప్పుకోలేని దీనస్థితిలో మనసులో ఏడుస్తున్నాడు. అందుకనే కాబోలు "ఒకరి కష్టాన్ని చూసి సంతోషించి చంకలు కొట్టుకోరాదన్నది" అని మనసులో బాధపడ్డాడు. 'ఐనా బుద్ధిమంతులు ప్రమాదం ఎదురైనప్పుడు ధైర్యమొందుతారు కానీ అయ్యో నా ప్రాణం పోతుందని ఏడవరు' అని ధైర్యం తెచ్చుకున్నాడు. ఎంతయినా ఒకచోట బ్రతుకుతున్న వాళ్ళం కాబట్టి ఈ రోమశుని అర్థించి ప్రాణాలు నిలబెట్టుకుంటాను అని అనుకొని నెమ్మదిగా పిల్లివైపు అడుగులు వేశాడు...

"మిత్రమా! నమస్కారం. జాతివైరమున్నా శత్రు మిత్రులము. చాలా సంవత్సరాల నుండి ఈ చెట్టు వద్దనే బ్రతుకుతున్నాము. ఒకరికొకరు అపకారం చేసుకోలేదు. ప్రస్తుతం కష్టకాలం వచ్చింది. కావున శత్రువులం అనుకోకుండా పరస్పరం సహకరించుకొని ఈ ఆపద నుండి బయటపడదాం. కానీ తీరా నీ వలతాళ్ళు కొరికి నిన్ను రక్షిస్తే గుటుక్కున మింగేస్తావేమోనని భయంతో కాసేపు వెనకడుగు వేసి అనవసర ఆలోచన చేశాను. కానీ తెలియనిదాని నోట్లోపడి దిక్కులేని చావు చచ్చేకన్నా నీకు ఉపకారం చేసి ఇద్దరమూ స్నేహంగా ఉందామని, కాదంటే నీకాహారం అయిపోదామని తెగించి వచ్చాను. ప్రాణభీతితో కాదు, ప్రాణస్నేహం కోసం తహతహలాడుతూ..."





అంతా విన్న రోమశుడు ఆనందపరవశుడయ్యాడు. అతనికి భయం లేకపోవడానికీ, అతని ఆలోచనలకూ, సంతోషించాడు. ధర్మబుద్ధిని మెచ్చుకుంటూ ఇలా పలికాడు. "మిత్రమా! జీవితం చివరిదశలో ఉన్నాను. నీవు చెప్పినట్లే నడుచుకుందాము. నీవు త్యాగబుద్ధితో నన్ను రక్షించదలచావు, నీకు కృతజ్ఞతలు. నేను కూడా చాలా రోజులనుండి నీతో స్నేహంగా ఉండాలనే అనుకుంటున్నాను. నీ సదాలోచన నాలోని అజ్ఞానాన్ని పటాపంచలు చేసింది. ఆ గుడ్లగూబ నిన్నేమీ చేయలేదు. నీ ప్రాణాలకు నా ప్రాణం అడ్డువేస్తాను".

వారిద్దరూ అలా సఖ్యంగా మాట్లాడుకోవడం చూసిన చంద్రకుడు వారి మైత్రికి భయపడి, తన పథకం పారదని నిరాశతో తన దారిన తాను పోయాడు. వేటగాడు వలలో చిక్కుకున్న పిల్లి కోసం వేటకుక్కలతో వస్తున్నాడు. అది చూసిన రోమశుడు "మిత్రమా! పలితుడా! ఆ కిరాతుడు కాలయమునిలా వస్తున్నాడు. నన్ను తొందరగా రక్షించు" అన్నాడు. పలితుడు తెలివిగా వల కొరుకుతున్నట్లు నటిస్తూ, వేటగాడు దగ్గరికి వచ్చేసరికి పుటుక్కున వల కొరికి, రోమశుడు పోయే దారిచేసి తన కన్నంలోకి చటుక్కున పరుగెత్తాడు. రోమశుడు "బ్రతుకుజీవుడా" – అంటూ పుటుక్కున చెట్టెక్కాడు. వేటగాడు పిల్లి చేజారిపోయిందని విచారిస్తూ వెనుదిరిగాడు.

కొంతసేపటికి రోమశుడు మెల్లగా చెట్టుదిగాడు. స్వజాతిబుద్ధితో, కపటంతో పలితుని ఉద్దేశించి "మిత్రమా! బయటికిరా! మరో ఉద్దేశం లేదు. నన్ను నమ్ము, కలిసిమెలసి బతుకుదాం. ఆనందంగా ఉందాం" అని పిలిచాడు. తెలివైన పలితుడు కనిపించీ కనిపించకుండా కన్నంలోంచి తల బయటకు పెట్టాడు. తొందరపడి బయటకు రాకుండా ఇలా అన్నాడు. "మిత్రమా! చాలా సంతోషం. ఇందాకటి అవసరం ఇద్దరిదీ అయింది. ఆ ప్రాణభయం ఇద్దరిది. అందుచేత నిన్నాశ్రయించాను. ఇందులో మోసం, దగా, కుట్రా ఏదీ లేదు. అంతా సత్యమే. జరిగింది ఉభయులకూ లాభమే. ఎవరి ప్రాణాలు వారికి దక్కాయి. కాని నిజానికి జాతిలక్షణం కాదనలేని వైరలక్షణం. బయటకు వచ్చాననుకో నాకు ప్రాణగండం తప్పదని తెలుసు" అని పలికి కన్నంలోకి దూరి మాయమయ్యాడు. ఎలుక రాకపోయేసరికి రోమశుడు నిరాశపాలయ్యాడు.



కథ సుఖాంతమయ్యింది.

**ఇవి చేయండి**

**ఉపాధ్యాయుడు చెప్పిన కింది పదాలను (ఉక్తలేఖనం) రాయండి.**

ఆహారాన్వేషణ, అదృష్టం, చంద్రకుడు, విహరిస్తున్న, ప్రాణభీతి, దీనస్థితి, ధైర్యము, బ్రతుకుతున్న, ప్రాణాలు, ప్రస్తుతం, శత్రువులు, పరస్పరం, గుటుక్కున, కృతజ్ఞతలు, అజ్ఞానం, ఆశ్రయించాను.



## అవగాహన - ప్రతిస్పందన

1. ఈ కథను మీ సొంతమాటల్లో చెప్పండి.
2. గుడ్లగూబను చూచి భయపడిన ఎలుక తన మనస్సులో ఏమనుకొంది ?
3. ఎలుక, పిల్లినుండి ఎలా తప్పించుకుంది ?
4. కింది పేరా చదివి ప్రశ్నలకు జవాబులు రాయండి.



మనం మంచివారితో స్నేహం చేస్తే మంచి అలవాట్లు వస్తాయి. చెడ్డవారితో స్నేహం చేస్తే చెడు అలవాట్లు అబ్బుతాయి. అవి మన జీవితాన్ని మార్చేస్తాయి. అందుకనే స్నేహితులను ఎంచు కునేటప్పుడు చాలా జాగ్రత్తగా ఆచితూచి ఎంచుకోవాలి. చక్కగా చదువుకొని బుద్ధిగా ఉండే పిల్లలతో స్నేహం చేయడం వలన వారుకూడా జీవితంలో మంచి స్థానం సంపాదించు కుంటారు. చదువుమీద శ్రద్ధలేని, బాధ్యతలేని పిల్లలతో స్నేహం చేయడం వల్ల చదువూ, సంధ్యా లేకుండా సోమరుల్లా మిగిలిపోతూ ఉంటారు. మనం తిరిగే, మాట్లాడే స్నేహితులవల్ల మన స్వభావం గుణగణాలు ఎదుటివారికి తెలుస్తాయి. కష్టసమయాల్లో మంచి స్నేహితులు మనకు తోడుగా ఉంటారు.

(అ) మనం ఎటువంటి వారితో స్నేహం చేయాలి ?

జ. ..........................................................................................

(ఆ) మంచి స్నేహితులను ఎలా ఎంచుకోవాలి ?

జ. ..........................................................................................

(ఇ) బాధ్యతలేని పిల్లలతో స్నేహం చేయడం వల్ల ఏం జరుగుతుంది ?

జ. ..........................................................................................

(ఈ) కష్ట సమయాల్లో మనకు తోడుగా వచ్చేవారు ఎవరు ?

జ. ..........................................................................................

(ఉ) పై పేరా దేనిగురించి చెప్తుంది ?

జ. ..........................................................................................

## వ్యక్తీకరణ - సృజనాత్మకత



**అ) కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాలలో జవాబులు రాయండి.**

1. పిల్లి స్వభావం ఎలాంటిది ?
2. ఆపద కలిగినపుడు మనం ఎలా ఆలోచించాలి ?
3. ఈ కథలో నీవు తెలుసుకున్న నీతి ఏమిటి?

**ఆ) కింది ప్రశ్నలకు 8 నుండి 10 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. సమయస్ఫూర్తి కథను సొంత మాటలలో రాయండి.
2. ఎలుక తెలివితేటలను గురించి మీరేమనుకుంటున్నారో రాయండి.
3. ఎలుక - పిల్లి మాటలను సంభాషణ రూపంలో రాయండి. (సృజనాత్మక ప్రశ్న)

## భాషాంశాలు

**అ) గీతగీసిన పదాలకు అర్థాలు రాయండి.**

ఉదా॥ ఎలుక ఆహారం <u>అన్వేషించడానికి</u> బయలుదేరింది. = ...........వెతకడానికి...........

1. చిలుక <u>ప్రాణభీతితో</u> గిజగిజలాడింది. = ..........................................
2. చిరకాల <u>వైరం</u> మంచిది కాదు. = ..............................................
3. మంచివారితో <u>మైత్రి</u> గొప్ప జీవితానికి మార్గం చూపుతుంది. = ......................
4. <u>సదాలోచనలు</u> చేయాలి. = ...............................................................

**ఆ) కింది పదాలకు వ్యతిరేకార్థక పదాలు రాయండి.**

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1. అదృష్టం | × | ____________ | 4. అపకారం | × | ____________ |
| 2. మంచి | × | ____________ | 5. ధర్మం | × | ____________ |
| 3. వెలుగు | × | ____________ | 6. సత్యం | × | ____________ |

**సూచన :** ప్రకృతి - వికృతి అంటే ఏమిటో ఉపాధ్యాయులు పిల్లలకు చెప్పండి.

ఇ) కింది ప్రకృతి వికృతులను జతచేయండి.

| | | | | |
|---|---|---|---|---|
| 1. | ఆహారం | (    ) | (అ) | పానం |
| 2. | ధర్మం | (    ) | (ఆ) | సంతసం |
| 3. | ప్రాణం | (    ) | (ఇ) | కత |
| 4. | కథ | (    ) | (ఈ) | దమ్మం |
| 5. | సంతోషం | (    ) | (ఉ) | ఓగిరం |

## వ్యాకరణాంశాలు



పిల్లలందరూ మైదానంలో ఆడుతున్నారు.

పై వాక్యంలో పిల్లలందరూ అనే పదం పిల్లలు + అందరూ అనే రెండు పదాల కలయిక వల్ల ఏర్పడింది. దీనినే సంధి అంటారు.

పిల్లలు అన్న పదం చివర 'ఉ' ఉంది. అందరూ అన్న పదం మొదట 'అ' ఉంది. రెండు పదాలూ కలిసినపుడు ఉ + అ అన్న రెండు అచ్చులకు బదులు 'అ' ఒక్కటే వచ్చింది.

ఇటువంటి మార్పును సంధి అంటారు. సంధి జరిగే సమయంలో మొదటి పదం చివరి అచ్చు పోతుంది. రెండవ పదంలో మొదటి అచ్చు మిగులుతుంది.

రెండు తెలుగు పదాల మధ్య జరిగే ఈ సంధులను తెలుగు సంధులు అంటారు.

ఉదా : రాముడు + అతడు - రాముడతడు.

ఇందులో రాముడు మొదటి పదం. అతడు రెండవ పదం. మొదటి పదమైన రాముడు లోని చివరి ఉ కారం పోయి రెండవ పదంలోని అకారం మిగిలింది.

రాముడు + అతడు = రాముడతడు అనే రూపం ఏర్పడింది.

అ) కింది పదాలను విడదీయండి :

1. వాడెక్కడ ____________________
2. మనమందరం ____________________
3. ఎవరిక్కడ ____________________
4. వారందరూ ____________________
5. మహనీయులెందరో ____________________

**ఆ) కింది పదాలను కలిపి రాయండి. మార్పును చర్చించండి.**

ఉదా : ముసలివాళ్లు + అందరు = (ళ్ల్+) ఉ + అ = ళ్ల – ముసలివాళ్లందరు.

1. వీళ్లు + అందరూ
2. ఇల్లు + ఉంది
3. ప్రజలు + అందరూ
4. డొక్కలు + ఎండిపోయిన
5. ముసలివారు + అంటే
6. పాఠాలు + ఎన్ని

**ఉపాధ్యాయులకు గమనిక :** వ్యాకరణ పరంగా ఉత్వసంధి రాని సందర్భాలు (ప్రథమేతర విభక్తి శత్రర్థక చువర్ణములందున్న ఉకారమునకు సంధి వైకల్పికముగా వస్తుంది) అక్కడక్కడ ఉన్నాయి. ఇవి గ్రాంథిక భాషకు పరిమితమైన విషయాలు కాబట్టి ఉపాధ్యాయునికి అవగాహన ఉంటే చాలు. పిల్లలకు ఈ స్థాయిలో వివరించాల్సిన అవసరం లేదు.

★ ఈ పాఠంలోని ఉత్వసంధికి సంబంధించిన సంధిపదాలను వెతికి రాయండి.

**ఇ) పారిభాషిక పదాల అభ్యాసాలు :**

అడుగులో అడుగు వేశాము. – ఆటలు పాటలు పాడాము.
ఇరుగు పొరుగు కలిశాము. – ఈలలు వేస్తూ గెంతాము.
ఉరుకులు పరుగులు తీశాము. – ఊరిని శుభ్రం చేశాము.

పై గేయంలో అచ్చుల కింద గీత గీసి గుర్తించండి. హ్రస్వాచ్చులను దీర్ఘాచ్చులను విడివిడిగా రాయండి.

| హ్రస్వాచ్చులు | దీర్ఘాచ్చులు |
|---|---|
| 1. | 1. |
| 2. | 2. |
| 3. | 3. |

**ఈ) కింది వాక్యాలలో పరుషాక్షరాలను గుర్తించండి, గీత గీయండి.**

1. కన్నవారిని కొలుద్దాం.
2. చదువులు బాగా చదువుదాం.
3. చిటపట చినుకులు పడ్డాయి.
4. తపాలవాడు వచ్చాడు, తనతో జాబులు తెచ్చాడు.
5. పరిమళమంటే మాకిష్టం.

**ఉ) కింది వాక్యాలలో సరళాక్షరాలు గుర్తించండి.**

1. చలికి గజగజ వణికారు వారు.
2. ఆ అమ్మాయి జడకుచ్చులు పెట్టుకుంది.
3. డబ్బు పొదుపు చేయడం మంచిది.
4. దసరా పండగ వచ్చింది; సరదాలెన్నో తెచ్చింది.
5. పలకా బలపం మా ఆస్తి.

**ఊ) కింది అక్షరాలు పరిశీలించండి. స్థిరాక్షరాల చుట్టూ 'సున్న' చుట్టండి.**

| | | | | |
|---|---|---|---|---|
| క | ఖ | గ | ఘ | ఙ |
| చ | ఛ | జ | ఝ | ఞ |
| ట | ఠ | డ | ఢ | ణ |
| త | థ | ద | ధ | న |

| | | | | |
|---|---|---|---|---|
| ప | ఫ | బ | భ | మ |
| | య | ర | ల | వ |
| | శ | ష | స | హ |
| | | ళ | క్ష | ఱ |

**ఎ) కింది వాక్యాలలోని స్పర్శాక్షరాలకు 'సున్న' చుట్టండి.**

ఈ సంవత్సరం మీరు సెలవులకు ఎక్కడికి వెళుతున్నారు ?

కిందటి సంవత్సరం సంపూర్ణ ప్రపంచయాత్ర చేశాం.

ఈ ఏడాది ఇంకెటయినా వెళ్లాలి.

**ఏ) కింది వాక్యాలు పరిశీలించండి. వర్గయుక్కులు గుర్తుపట్టండి.**

ఆయనకు కరమునకు ఖరమునకు తేడా తెలీదుట.

ఘనతకు మూలం వినయం.

భయపడితే జీవితంలో ముందుకు పోలేం.

**ఐ) కింది వాక్యంలో అనునాసికాక్షరాలు గుర్తించండి.**

కరుణ నమస్కారం పెట్టింది.

**ఒ) కింది మాటలలో అంతస్థాలను గుర్తించండి.**

యమున, కారం, పాలు, వంకర, వేళ

| | | | | |
|---|---|---|---|---|
| న | క | ల | ఠ | ణ |
| మ | ట | త | గ | ఢ |
| ర | చ | బ | డ | క్ష |

**ఓ) కింది వాక్యంలో ఊష్మాలను గుర్తించండి.**

భాషను మాట్లాడే సహజ శక్తి మనుషులందరికీ ఉంటుంది.

**ఔ) కింది వాక్యాలలో తాలవ్యాక్షరాలను గుర్తించండి.**

ఈ ఇలలో చక్కగా చదువుకున్నవారే సుఖపడతారు.

**అం) కింది గడిలో మూర్ధన్యాక్షరాలను గుర్తించండి.**

★ తాతకు దగ్గులు నేర్పడం సతీష్‌కు సాధ్యమా.

ఈ వాక్యంలో ఉన్న దంత్యాక్షరాల కింద గీత గీయండి.

★ మహాత్మాగాంధీ పోర్‌బందర్‌లో జన్మించాడు.

ఈ వాక్యంలో ఓష్ఠ్యాక్షరాలు గుర్తించండి.



## భాషాభాగాలు

కింది భాషాభాగాలను జతపరచండి.

| | | | |
|---|---|---|---|
| 1. విశేషణం | ( ) | 1. | చదివాను |
| 2. నామవాచకం | ( ) | 2. | కాని |

| | | | |
|---|---|---|---|
| 3. క్రియ | (    ) | 3. | ఆమె |
| 4. అవ్యయం | (    ) | 4. | ఎర్రని |
| 5. సర్వనామం | (    ) | 5. | వనజ |

### ఖాళీలను పూరించండి

1. నామవాచకానికి లేదా సర్వనామానికి ఉన్న గుణాన్ని తెలిపేది ....................
2. పేరుకు బదులుగా వాడేది .......................
3. పనిని తెలిపే మాట ..............................
4. లింగ వచన విభక్తులు లేనిది ...................
5. పేరును తెలిపే పదం ...........................





### చమత్కార పద్యం

"ఎలుకలు తమ కలుగులోనికి ఏనుగునీడ్చెను" అని కవికి ఒక సమస్యను ఇచ్చారు. కవి దానిని ఎలా పూరించాడో చూడండి.

ఇలలో నిద్దరు రాజులు
మలయుచుఁ జదరంగమాడి మాపటివేళన్
బలమెత్తికట్ట మరచిన
నెలుకలు తమ కలుగులోనికేనుగునీడ్చెన్.

ఇలలో ఇద్దరు రాజులు పట్టుదలతో చదరంగమాడుతున్నారు. రాత్రి అయింది చదరంగం మీద బలాన్ని (పావులను) ఎలా ఉన్నవి అలానే వదిలేసి వెళ్ళారు. రాత్రికి ఎలుకలు వచ్చి ఏనుగు (పావు) ను తమ రంధ్రంలోకి ఈడ్చుకొని పోయాయి.



### నేనివి చేయగలనా?

| | |
|---|---|
| 1. పాఠాన్ని ధారాళంగా చదవగలను. అర్థంచేసుకొని సొంతమాటలలో చెప్పగలను. | ఔను / కాదు |
| 2. పాఠంలోని మాండలిక పదాలను, పదబంధాలను వాక్యాలలో ఉపయోగించగలను. | ఔను / కాదు |
| 3. ఇటువంటి కథను మరొకటి చెప్పగలను. | ఔను / కాదు |
| 4. పాఠంలోని ప్రశ్నలకు జవాబులు సొంతమాటలలో రాయగలను. | ఔను / కాదు |

**విద్వాన్ సర్వత్ర పూజ్యతే**
(విద్యావంతుడు అన్నిచోట్ల పూజింపబడతాడు)

# స్ఫూర్తి

చాలా కాలం క్రితం మగధను విక్రమసేనుడు అనే రాజు పరిపాలించేవాడు. ఎంతో ధైర్య సాహసాలు కల విక్రమసేనుడు తన ప్రజలను కన్న బిడ్డల్లా చూసుకునేవాడు. ఆయన రాజ్యంలో ధర్మం నాలుగు పాదాల మీద నడవడమే కాకుండా రాజ్యంలో కన్నుల పండువుగా సంపద తులతూగుతూ ఉండేది.

మగధ ఐశ్వర్యం చూసి ఓర్వలేని పొరుగు దేశం రాజు పెద్ద సైన్యాన్ని వెంటబెట్టుకుని మగధపై దాడి చేశాడు. విక్రమసేనుడి వద్ద ఎక్కువ మంది సైనికులు లేరు. యుద్ధంలో పరాజయం పొందిన విక్రమసేనుడు ప్రాణాలు రక్షించుకునేందుకు అడవిలోకి పారిపోయి ఒక కొండగుహలో దాక్కున్నాడు.

ఒంటరితనం, పరాజయం, బాధ, అలసట.. అన్నీ ఒక్కసారిగా విక్రమసేనుణ్ణి ఆవరించాయి.

"నా కన్న బిడ్డల్లాంటి ప్రజల్ని, రాజ్యాన్ని కోల్పోయిన నేను ఇక బ్రతకటం అనవసరం. నిస్సహాయుడిగా ఎంత కాలమిలా దాక్కోవాలి?" అని ఆలోచించిన విక్రమసేనుడు చావే శరణ్యమని అనుకున్నాడు. ప్రాణాలు ఎలా తీసుకోవాలా అని ఆలోచిస్తున్న సమయంలో అతనికి ఒక దృశ్యం కంటపడింది.

ఒక చిన్న సాలీడు గుహ పైభాగంలో గూడు అల్లుకోవడానికి ప్రయత్నం చేస్తోంది. సాలీడు పైకి పాకే కొద్దీ దాని నుండి వచ్చే దారం తెగి అది క్రిందికి జారిపోతూ ఉంది. అయినా సాలీడు తన ప్రయత్నాన్ని కొనసాగిస్తూనే ఉంది. ఎన్నోమార్లు ప్రయత్నించగా చివరికి సాలీడు విజయవంతంగా పైకి ఎగబాకి గూడును అల్లటం పూర్తి చేయగలిగింది.

అది చూసిన విక్రమసేనుడిలో ఒక కొత్త ఆలోచన కలిగింది. 'ఒక చిన్న సాలీడు అపజయాన్ని అంగీకరింపక మళ్ళీ మళ్ళీ ప్రయత్నించి అనుకున్న పని సాధించగలిగింది. నేను మాత్రం ఎందుకు ప్రయత్నించకూడదు? నేను మనిషిని, అవయవాలతో పాటు భగవంతుడు ఆలోచించడానికి, ఎత్తుకు పైఎత్తు వేయడానికి అదనంగా మెదడును కూడా ఇచ్చాడు. వైఫల్యం వస్తూ గెలవడానికి ఒక నిచ్చెనను మోసుకు వస్తుంది'. ఇలా ఆలోచించిన విక్రమసేనుడిలో నిరాశా, నిస్పృహలు పటాపంచలై పోయాయి. కొత్త స్ఫూర్తి కొండంత బలాన్ని చేకూర్చింది.

విక్రమసేనుడు ఆ అడవి నుండి బయటపడి, చెల్లా చెదురైన తన సైన్యాన్ని సమీకరించుకున్నాడు. అనేక పర్యాయాలు విడవకుండా శత్రువుపై దాడి చేసి చివరకు తన రాజ్యాన్ని పొందాడు.



H4H4U6

# 5. మన మహనీయులు (ఉపవాచకం)

H4H4U6

- రచయితల బృందం

తెలుగు ప్రజల హితం కోసం తపించి నిరంతరం శ్రమించిన "ఎందరో మహానుభావులు అందరికీ వందనములు". ప్రాణత్యాగానికి వెనుదీయక తెలుగు జాతి ఆత్మాభిమానాన్ని నిలబెట్టినవారు, తమ ప్రతిభా పాటవాలతో భారత జాతీయ కీర్తిపతాకం ఎగురవేసినవారు, జాతీయ సమైక్యతకై ప్రతినపూని, తమ పాండిత్యంతో తెలుగు భాషను, సంస్కృతిని గుబాళింప జేసినవారు - ఇలా ఎందరో మహనీయులు మన తెలుగుజాతి ఆణిముత్యాలుగా ఉన్నారు.

ఆ మహనీయుల జీవితం భావితరాలకు స్ఫూర్తిదాయకం. వారి త్యాగం అమూల్యం. వారి కృషి జాతికి పథనిర్దేశం. వారి ప్రతిభ జాతిగౌరవ పరిమళం. వారిని స్మరించుకోవడం మన బాధ్యత.

## అమరజీవి పొట్టి శ్రీరాములు




1952 డిసెంబరు 16 మంగళవారం. తూర్పున సూర్యుడు ఉదయించే సరికి ఆకాశవాణి వార్త అశనిపాతంలా నలుదిశలా ధ్వనించింది. ఆ వార్తకు తెలుగు నేల ద్రవించింది. తెలుగు ప్రజలు గుండె కోతను తట్టుకోలేక విలవిల లాడిపోయారు. "గత రాత్రి గం|| 11.30 ని||లకు పొట్టి శ్రీరాములు ప్రాణ వాయువులు అనంతాకాశంలో కలిసిపోయాయి" అన్నది ఆ వార్త. ఎవరా పొట్టి శ్రీరాములు? ఎందుకు ఆంధ్రుల ఆర్తనాదాలు?

పొట్టి శ్రీరాములు పూర్వీకులు ఒకప్పటి నెల్లూరు జిల్లా కనిగిరి (ప్రస్తుతం ప్రకాశంజిల్లా) ప్రాంతీయులు. వ్యాపారరీత్యా మద్రాసు (చెన్నై) లో స్థిరపడ్డారు. శ్రీరాములుగారు గురవయ్య, మహాలక్ష్మమ్మ దంపతులకు మద్రాసులో 16-3-1901 న జన్మించారు. మద్రాసు, బొంబాయి నగరాలలో విద్యాభ్యాసం చేశారు. తన మేనమామ కుమార్తె సీతమ్మను వివాహం చేసుకొన్నారు. బొంబాయిలో అసిస్టెంటు ప్లంబర్‌గా ఉద్యోగంలో చేరి అక్కడే నివాసం ఉన్నారు. విశ్రాంతివేళల్లో అక్కడ పనిచేస్తున్న కార్మికుల యోగక్షేమాలు విచారించేవారు. పేదవారి కష్టాల్లో పాలుపంచుకొనేవారు. ఇతరుల కోసం ఏదోఒకటి చేయాలని తపించేవారు. గాంధీజీ బోధనలకు శ్రీరాములు ఆకర్షితుడయ్యారు. ఆ బోధనలే వీరిని భారత స్వాతంత్ర్యోద్యమంవైపు నడిపించాయి.

ఆయన చేస్తున్న ఉద్యోగం వదలి సబర్మతీ ఆశ్రమంలో చేరారు. రాజ్‌కోట్ సత్యాగ్రహంలో పాల్గొని ఆరు నెలలు గాంధీతోపాటు జైలుశిక్ష అనుభవించారు. ఉద్యమంలో భాగంగా ఖాదీప్రచారం, మద్యపాన నిషేధ ప్రచారం, నిమ్నజాతులకు దేవాలయ ప్రవేశం వంటి సాంఘికసేవా కార్యక్రమాలను చేపట్టారు. ఆంధ్రులు, తమిళులకు కలిపి ఒకే రాష్ట్రం ఉండటం వల్ల తెలుగువారు అనేక ఇబ్బందులు పడటం వీరు గమనించారు. ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కోసం 1911 నుండి ఎన్నో సభలూ, సమావేశాలూ, తీర్మానాలూ జరుగుతున్నాయి. కానీ ఆంధ్రరాష్ట్రం ఏర్పడలేదు. ఆంధ్రరాష్ట్ర అవతరణకు ఒక అమూల్య త్యాగం అవసరమని దృఢంగా నిశ్చయించుకున్నారు. నెల్లూరులో ఆత్మీయులకు సూచనప్రాయంగా తన సంకల్పాన్ని చెప్పి మద్రాసు బయలుదేరారు.

"ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటుచేస్తూ ప్రకటించేవరకూ నా దీక్ష ఆమరణాంతం కొనసాగిస్తాను" అని ప్రకటించి 19-10-1952 న ఆదివారం శ్రీరాములు ఆమరణ నిరాహారదీక్ష ప్రారంభించారు.





ఆంధ్ర ప్రాంతమంతా సభలూ, సమావేశాలు నిత్యం జరుగుతూనే ఉన్నాయి. ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర ఉద్యమం ఊపందుకుంది. రోజులు గడిచేకొద్దీ వారి ఆరోగ్య పరిస్థితి అంతకంతకూ దిగజారింది. సత్యాగ్రహి లేవలేక మాట్లాడలేని స్థితికి వచ్చారు. అయినా ఢిల్లీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తిన చందంగా కూర్చుంది. 15-12-1952 తేది రాత్రి 11.30 ని॥లకు శ్రీరాములు హృదయస్పందన ఆగిపోయింది. వీరి ప్రాణత్యాగం ఒక దావానలంగా ఆంధ్రప్రాంతం అంతటా వ్యాపించింది. ప్రతి ఆంధ్రుడు ఒక అగ్నికీలగా మండ సాగాడు. ఆంధ్ర ప్రాంతమంతటా హర్తాళ్ళు, ఆందోళనలతో అట్టుడికి పోయింది. ఈ మహాఝంఝామారుతం మూడురోజులపాటు సాగింది. "ఆంధ్రరాష్ట్రం ఇస్తున్నాం" అని నెహ్రూ ప్రకటించేవరకూ సాగింది. శ్రీరాములుగారు ఆంధ్రుల చిరకాల స్వప్నం కోసం తన ప్రాణాన్ని తృణప్రాయంగా వదిలేసిన చిరస్మరణీయుడు.

1-10-1953 న కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్రం ఏర్పాటైంది. శ్రీరాములుగారు మన ఆంధ్రులకు అమరజీవి అయ్యారు.

## జాతీయ జెండా రూపశిల్పి - పింగళి వెంకయ్య

రివ్వు రివ్వున సాగిపోవు - రంగురంగుల జెండా
మన మూడు రంగుల జెండా
రండి ఓ బాలలార - బండి బయలుదేర
ఇక జెండా ఎగురవేయ



అని జెండాపాటలు పాడతాంకదా! ఆ పతాకం జాతి ఆత్మాభిమానానికి దేశ సార్వభౌమాధికారానికి చిహ్నం. ఆకాశవీధిలో జెండా రెపరెపలాడుతూ ఉంటే ప్రతి భారతీయుడి గుండె దేశభక్తితో ఉప్పొంగుతుంది.


ఎందరో వీరుల త్యాగం జ్ఞప్తికి వస్తుంది. అంతటి మహనీయత కలిగిన మన జాతీయపతాక రూపశిల్పి పింగళి వెంకయ్య.

జెండా వెంకయ్యగా ప్రసిద్ధుడైన పింగళి వెంకయ్య 1878 ఆగష్టు 2వ తేదీన కృష్ణాజిల్లా భట్ల పెనుమర్రులో జన్మించారు. వీరు హైస్కూలు చదువు పూర్తిచేసిన తరువాత దేశభక్తితో 19 ఏళ్ళ వయసులోనే సైన్యంలో చేరారు. మన దేశానికి స్వాతంత్ర్యం కోసం ఉద్యమజ్వాలలు ఎగిసి పడుతున్న తరుణం అది. గాంధీగారితో వీరి పరిచయం స్వాతంత్ర్య ఉద్యమానికి బాట పట్టించింది.

1906వ సంవత్సరంలో కలకత్తాలో జరిగిన జాతీయ కాంగ్రెస్ మహాసభలకు పింగళి వెంకయ్య హాజరయ్యారు. అక్కడ బ్రిటీషు జెండా ఎగుర వేయడం వీరికి నచ్చలేదు. బ్రిటీషువారి సార్వభౌమాధికారం తెలిపే వారి జెండా మనకు జాతీయపతాకం ఎలా అవుతుందన్న ప్రశ్న వెంకయ్యగారికి తలెత్తింది. జాతీయ జెండా రూపకల్పనకు వెంకయ్యగారిని పురికొల్పింది.

1921వ సంవత్సరంలో విజయవాడలో జరిగిన అఖిల భారతీయ కాంగ్రెస్ సమావేశంలో గాంధీజీ పింగళి వెంకయ్యను జాతీయ పతాకం చిత్రించి ఇవ్వమని అడిగారు. మూడుగంటల వ్యవధిలో జెండాను రూపొందించి ఇచ్చారు. జెండాలో కాషాయంరంగు త్యాగానికి, దేశభక్తికి ప్రతీకగా, తెలుపురంగు శాంతికి సత్యానికి చిహ్నంగా, ఆకుపచ్చరంగు సమృద్ధికి, నమ్మకానికి గుర్తుగా వీరు త్రివర్ణ పతాకాన్ని రూపొందించారు. ఈ పతాకం మధ్యలో మొదట రాట్నం ఉండేది. తరువాత దాని స్థానంలో అశోక ధర్మచక్రం చేర్చారు.

భారతీయులందరికీ ఉద్యమ స్ఫూర్తినికలిగించి స్వాతంత్ర్యోద్యమం కొరకు ఏకతాటిపై తేగలిగింది మన జెండాయే! మన జాతీయజెండా రూపకర్త మన ఆంధ్రుడవ్వడం మనకు గర్వకారణం. నిరాడంబర జీవితం, నిస్వార్థ సేవాతత్పరతే ధ్యేయంగా బ్రతికిన వీరు 04-07-1963న స్వర్గస్థులయ్యారు. వారు మన మధ్య లేకపోయినా వారు రూపొందించిన జాతీయపతాకం ప్రతి భారతీయుని గుండె ఉప్పొంగేలా, జాతి సగర్వంగా తలయెత్తుకొనేలా ఆచంద్రతారార్కం రెపరెపలాడుతూనే ఉంటుంది.



## "జాతీయ ప్రతిజ్ఞ" నిర్మాత పైడిమర్రి వెంకట సుబ్బారావు



బడిపిల్లలంతా బడి ఆవరణంలో ఉదయం జరిగే ప్రార్థనా సమావేశంలో "భారతదేశం నా మాతృభూమి" అంటూ చేసే ప్రతిజ్ఞ అచంచలమైన దేశభక్తిని, అంతులేని జాతీయతా భావచైతన్యాన్ని, ఎనలేని సోదరభావాన్ని కలుగజేస్తుంది. అందుకే ఈ ప్రతిజ్ఞ దేశవ్యాప్తంగా ఉన్న అన్ని భారతీయ భాషల పాఠ్యపుస్తకాలలో ముద్రించ బడింది. ఈ ప్రతిజ్ఞ రాసిన మహనీయుడు పైడిమర్రి వెంకటసుబ్బారావు మరొక తెలుగుజాతి ఆణిముత్యం.

1962 లో భారత్-చైనా యుద్ధం ముగిసిన తరువాత మనదేశ విద్యార్థులలో ప్రాథమిక దశనుండే దేశభక్తి కలిగించాలనే భావం సుబ్బారావుగారికి కలిగింది. "భారతదేశం నా మాతృభూమి" అనే ప్రతిజ్ఞ రాశారు. తెన్నేటి విశ్వనాథంగారితో చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళారు. ప్రతిజ్ఞ విలువను, అవసరాన్ని వివరించి ప్రతిని అందజేశారు. 1964 లో బెంగుళూరులో ప్రముఖ న్యాయనిపుణుడు మహ్మద్ కరీంచాగ్లా అధ్యక్షతన కేంద్రీయ విద్యా సలహామండలి సమావేశంలో జాతీయ ప్రతిజ్ఞగా దీన్ని స్వీకరించారు. ఆ ప్రతిజ్ఞ 1965 జనవరి 26 నుంచి భారతదేశమంతటా అన్ని భాషల పాఠ్యపుస్తకాలలో చేర్పించారు.

పైడిమర్రి వెంకట సుబ్బారావు నల్గొండ జిల్లాలో అన్నెపర్తి గ్రామంలో 1916 జూన్ 10వ తేదీన వెంకటరామయ్య, రాంబాయమ్మలకు జన్మించారు. బాల్యంలోనే తన తల్లి రామాయణ, మహాభారతాలు చెప్పేది. బాల్యంలోనే దేశభక్తి బీజాలు పడ్డాయి. 1962 లో విశాఖపట్టణంలో ట్రెజరి అధికారిగా పనిచేశారు. పుస్తక సేకరణ, పఠనం, కవితా వ్యాసంగం, వేద అధ్యయనం చేసేవారు. ఆయన భూస్వామ్య



పద్ధతిలోని వెట్టిచాకిరిని నిరసిస్తూ ఎన్నో కథలు రాశారు. దేవదత్తుడు, తులసీదాసు, త్యాగరాజు మొదలైన పద్యకావ్యాలు రాసారు. గృహస్థ జీవితం, స్త్రీధర్మము, తార, శ్రీమతి అనే నాటకాలు రాసారు. బాలరామాయణం, వెంకటేశ స్తుతులు మొదలైన రచనలు చేశారు.

భారతదేశ వారసత్వ సంపదగా వస్తున్న సాంస్కృతిక, సామాజిక విలువలను కాపాడటం భావి భారతపౌరుల ప్రథమ కర్తవ్యం. ఇందుకోసం బాలలను సమాయత్తం చేస్తుందీ ప్రతిజ్ఞ. దేశభాషలన్నింటిలోనికి అనువదించబడి, దేశమంతా ప్రతినిత్యం ప్రతిధ్వనిస్తూ, జాతీయ గీతాల సరసన వెలుగుతుంది. ఈ ప్రతిజ్ఞ ధ్వనించినంతకాలం "పైడిమర్రి" వారు దేశ పౌరుల హృదయాలలో కలకాలం నిలిచే ఉంటారు.

## సుందరకవి - శంకరంబాడి సుందరాచారి



బెనారస్ విశ్వవిద్యాలయంలో సాయంత్రం నాలుగు గంటలకు తెలుగు విద్యార్థులందరూ సమావేశమై వస్తానన్న అతిథికోసం ఎదురుచూస్తున్నారు. చెప్పిన సమయం నాలుగు దాటిపోయింది. నాలుగున్నర... ఐదు... ఐదున్నర... మనిషి అంతులేడు. విద్యార్థులు అసహనంతో ఊగిపోతున్నారు. నిర్వాహకుల గుండెల్లో రైళ్ళు పరుగెడుతున్నాయి. అందరిచూపు గేటు వైపే.

ఆరు గంటలకు... అతిసామాన్యమైన నేతబట్టలు ధరించి, చేతిలో సంచితో నడుచుకుంటూ వేదిక వైపు వచ్చాడాయన. ఊపిరి పీల్చుకున్నారు నిర్వాహకులు. ఇంతలో బరంపురానికి చెందిన కుర్రాడు కాస్త గడుసుగా "ఇప్పుడొచ్చాడయ్యా! ఇప్పుడు మొదలుపెడితే ఎప్పటికి వదులుతాడో" అన్నాడు. ఆయన వినలేదనుకున్నారందరూ. "ఒరేయ్ అబ్బాయ్! నువ్వు లే!" అన్నాడు ఆ కుర్రాడిని వేలు చూపిస్తూ. "ఇప్పుడు మొదలుపెడితే ఎప్పటికి వదులుతాడో అన్నది నువ్వే కదా! నేను మాట్లాడటం ప్రారంభించి ఆపేలోపు నీ అంతట నువ్వే లేచి వెళ్ళగలిగితే వెళ్ళిపో! సవాల్!" అన్నాడాయన. ఆలస్యంగా వచ్చి, అగ్నిలో ఆజ్యం పోసినట్లు ఈ సవాల్ ఏమిటో అర్థంగాక తలలు పట్టుకున్నారు నిర్వాహకులు.



"మీరంతా తెలుగువాళ్ళుకదా! మీకసలు తెలుగు సరిగ్గా మాట్లాడటం వచ్చా? తెలుగు ఎలా ఉంటుందో చూపిస్తా చూడండి" అంటూ చిత్రంగా అక్కడి వాతావరణాన్ని పూర్తిగా మార్చేస్తూ ప్రసంగం ప్రారంభించారు. తెలుగు గ్రామీణ జీవనంలో తెల్లవారుజామున కోడి కూసింది మొదలు జీవితాలు ఎలా ప్రారంభమవుతాయి? అనే వాటిని గురించి వివరించారు. పల్లెపడుచుల కూనిరాగాలూ, పశువుల అరుపులూ, పిట్టల కూతలూ, ముగ్గులు వేస్తూ ఇల్లాలు పాడే తెలుగు జానపద గీతాలూ, పల్లెసుద్దులూ, అమ్మ పాడే భక్తిపాటలూ, పిల్లల ఆటలూ, పాటల గురించి వర్ణించారు. గంగిరెద్దుల చప్పుళ్ళూ, హరిదాసు నృత్యాలూ, రచ్చబండ వద్ద పెద్దల ఊతపదాలూ - ఒకటేమిటి ? యావత్ తెలుగు ప్రజల సజీవ భాషా భాగవతమంతా ఆటా, పాటా మాటల రూపంలో గంటన్నరపాటు ప్రవాహంలా ఆడుతూ, పాడుతూ కళ్ళకు కట్టినట్టు చూపించారు. మంత్రముగ్ధులై అంతా నిశ్శబ్దంగా కూర్చుండిపోయారు. "ఏమోయ్ కుర్రోడా! గంటన్నర అయ్యింది.



లేచి వెళ్ళలేదే? పో!" అన్నారాయన. "నన్ను వదిలేయండి స్వామీ" అన్నాడు ఆ కుర్రాడు.

'ఇక ఆపేస్తున్నా' అన్నారాయన. లేదు లేదు ఇంకా మాట్లాడండి అందరూ కేకలు. మరొక అరగంట అదే ప్రవాహం.

బెనారస్ విశ్వవిద్యాలయంలో తెలుగు విద్యార్థులకు ఉపన్యాసంగా...

మా తెలుగు తల్లికి మల్లెపూదండ
మా కన్నతల్లికి మంగళారతులు

– అంటూ తెలుగు రాష్ట్ర గేయంగా తెలుగుభాషను, సంస్కృతిని తెలుగు ప్రజలందరి నాలుకలపై నర్తింపచేసిన ఘనాపాఠి ఎవరోకాదు సుందరకవి శంకరంబాడి సుందరాచారి.

సుందరాచారి చిత్తూరుజిల్లా, తిరుపతిలో 1914 ఆగష్టు 10న జన్మించారు. తిరుపతి దేవస్థానం పాఠశాలలో, మదనపల్లి బీసెంట్ థియోసాఫికల్ సొసైటీలో విద్యాభ్యాసం చేశారు. ఉపాధ్యాయునిగా, ఆంధ్రపత్రికకు సంపాదకుడిగా, పాఠశాలల పర్యవేక్షకునిగా పనిచేశారు. సుందర రామాయణం, సుందర భాగవతం, బలిదానం, అపవాదు, పేదకవి, నాస్వామి, నేటికవిత్వం, కావేటి నగరరాజ నీరాజనం, శ్రీనివాస శతకం, బుద్ధగీత వంటి ఎన్నో రచనలు చేశారు. సినిమా పాటలు రాశారు. తెలుగుభాష, సంస్కృతులపై అమితమైన అభిమానంతో జీవించినంతకాలం వాటి పరిమళాలను తన కలంతో వెదజల్లిన సుందరాచారి 1977 ఏప్రియల్ 8న తిరుపతిలో కన్నుమూశారు.

2004 లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తిరుపతిలో ఆయన కాంస్య విగ్రహాన్ని నెలకొల్పింది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆయన జ్ఞాపకార్థం ఆ విగ్రహం దగ్గర మైకు ద్వారా "మా తెలుగు తల్లికి మల్లెపూదండ" గేయం నిరంతరం ధ్వనించే ఏర్పాటుచేసింది. తెలుగుజాతి ఉన్నంతవరకూ శంకరంబాడి సుందరాచారి తెలుగు ప్రజల గుండెల్లో నిలిచే ఉంటారు.

జాతిని జాగృతి చేసిన మహనీయుల సేవాతత్పరత, నిస్వార్థ ప్రవృత్తి, జాతి జనులకు వెలుగుబాట పరిచిన వ్యక్తుల చరిత్రలు భావిభారత పౌరులుగా తెలిసికొని ఆచరించడానికి ప్రయత్నించాలి. సమాజాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకోవడం మన కర్తవ్యం.

## అ) లఘు ప్రశ్నలు

1. పింగళి వెంకయ్యగారిని గురించి మీకు తెలిసిన విషయాలు రాయండి.
2. శంకరంబాడి గారి జ్ఞాపకార్థం తిరుపతిలో ఎటువంటి ఏర్పాటు జరిగింది.
3. ప్రతిజ్ఞ విద్యార్థులలో ఎటువంటి భావాలను కలిగిస్తుంది?

## ఆ) వ్యాసరూప ప్రశ్నలు

1. తెలుగు భాష, సంస్కృతులపై 'శంకరంబాడి సుందరాచారి' సాధికారతను తెలిపే సంఘటనను సొంత మాటల్లో రాయండి.
2. ఆంధ్రరాష్ట్ర అవతరణలో పొట్టి శ్రీరాములు త్యాగం గురించి సొంతమాటల్లో రాయండి.

X9T8U2

# 6. సుభాషితాలు (పద్యభాగం)

A8I5X4

## వినడం - ఆలోచించి మాట్లాడడం



కష్టపెట్టబోకు కన్నతల్లి మనస్సు
నష్టపెట్టబోకు నాన్న పనులు
తల్లిదండ్రులన్న దైవ సన్నిభులురా
లలిత సుగుణజాల తెలుగుబాల!

1. చిత్రంలో ఎవరున్నారు?
2. గురువుగారు శిష్యులకు ఎటువంటి పద్యాలు చెబుతున్నారు?
3. ఇలాంటి నీతి పద్యాలు మీకు తెలిసినవి చెప్పండి.

**ఉద్దేశం:** విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించడం, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడం ఈ పాఠ్యభాగ ఉద్దేశం.

| క్రమ సంఖ్య | కవి | కాలం | శతకం |
|---|---|---|---|
| 1. | నార్ల చిరంజీవి | 20వ శతాబ్దం | తెలుగుపూలు |
| 2. | వేమన | 17వ శతాబ్దం | వేమన శతకం |
| 3. | కరుణశ్రీ | 20వ శతాబ్దం | తెలుగుబాల శతకం |
| 4. | తిక్కన | 13వ శతాబ్దం | ఆంధ్రమహాభారతం |
| 5. | పక్కి అప్పల నరసింహం | 17వ శతాబ్దం | కుమార, కుమారీ శతకాలు |
| 6. | పోతులూరి వీరబ్రహ్మం | 17వ శతాబ్దం | కాళికాంబా సప్తశతి |
| 7. | మారద వెంకయ్య | 16వ శతాబ్దం | భాస్కర శతకం |
| 8. | కంచర్ల గోపన్న | 17వ శతాబ్దం | దాశరథి శతకం |

# సుభాషితాలు



ఆ.వె. కడచి పోయి నట్టి క్షణము తిరిగిరాదు
కాలమూర కెపుడు గడపఁబోకు
దీపమున్న యపుడె దిద్దుకోవలె నిల్లు
విలువ దెలిసి చదువు తెలుగుబిడ్డ! (1)



ఆ.వె. భూమి నాది యన్న భూమి పక్కున నవ్వు
దానహీనుఁజూచి ధనము నవ్వు
కదన భీతుఁజూచి కాలుండు నవ్వును
విశ్వదాభిరామ వినుర వేమ! (2)



ఆ.వె. దొరలు దోచలేరు, దొంగ లెత్తుక పోరు
భ్రాతృజనము వచ్చి పంచుకోరు
విశ్వవర్ధనంబు విద్యాధనంబురా
లలిత సుగుణజాల తెలుగుబాల! (3)



కం. తనువున విరిగిన యలుఁగుల
ననువునఁబుచ్చంగవచ్చు నతినిష్ఠురతన్
మనమున నాటిన మాటలు
వినుమెన్ని యుపాయములను వెడలునె యధిపా (4)



**కం.** రోషావేశము జనులకు
దోషము, తలపోయ విపుల దుఃఖకరము నౌ;
రోషము విడిచిన యెడ సం
తోషింతురు బుధులు హితము దోప కుమారా! (5)

**కం.** మఱవ వలెఁ గీడు, నెన్నఁడు
మఱవంగా రాదు మేలు, మర్యాదలతో
దిరుగవలె సర్వ జనముల
దరిఁబ్రేమ మెలంగవలయు ధరణి కుమారీ! (6)





**ఆ.వె.** పుస్తకములు చదువ పూర్ణత్వమబ్బదు
హృదయసంపుటముల చదువవలయు
పారిశుద్ధ్యమొకటె పరమాత్మ చేర్చును
కాళికాంబ! హంస! కాళికాంబ! (7)

**చ.** సిరిగలవాని కెయ్యెడలఁ జేసిన మేలది నిష్ఫలంబగున్
నెఱిగుఱిగాదు పేదలకు నేర్పునఁ జేసిన సత్ఫలంబగున్
వఱపున వచ్చి మేఘుఁడొక వర్షము వాడిన చేల మీఁదటం
గుఱిసినఁ గాక యంబుధులఁ గుర్వఁగ నేమి ఫలంబు భాస్కరా! (8)





**ఉ.** నోఁచిన తల్లిదండ్రికిఁ దనూభవుఁడొక్కఁడె చాలు మేటి చే
చాఁచనివాడు వేఱొకఁడు చాఁచిన లేదనకిచ్చువాఁడు నో
రాఁచి నిజంబకాని పలుకాడనివాఁడు రణంబులోన మేన్
దాఁచనివాడు భద్రగిరి దాశరథీ కరుణాపయోనిధీ! (9)

**శతకం:** శతకం అంటే నూరు పద్యాల రచన. శతక పద్యాల చివర 'మకుటం' ఉంటుంది. ఇందులో పద్యాలు 'ముక్తకాలు'గా ఉంటాయి. అంటే ఏ పద్యానికి ఆ పద్యం స్వతంత్రభావం కలిగి ఉంటుంది. మకుటం ఉండటం వలన శతకకవి ఏ పద్య ఛందస్సును ఎన్నుకుంటాడో అదే ఛందస్సులో అన్ని పద్యాలు రాయవలసి ఉంటుంది.

## సారాంశం

1. తెలుగుబిడ్డా! జరిగిపోయిన సమయం తిరిగిరాదు. కాబట్టి కాలాన్ని వృథాగా గడపకూడదు. అవకాశం ఉన్నప్పుడే పనులను చక్కగా చేసుకోవాలి. కాలం విలువ తెలుసుకొని చదువుకోవాలి.
2. ఓ వేమా! ఈ భూమి నాది అని అహంకారం ప్రదర్శించిన వాడిని చూసి భూమి పగలబడి నవ్వుతుంది. ఈ ధనం నాది అనే మమకారంతో దానం జోలికి పోనివాడిని చూసి ధనం నవ్వుతుంది. యుద్ధమంటే భయపడే పిరికివాడిని చూసి యముడు నవ్వుతాడు.
3. తెలుగుబాలా! విద్యాధనాన్ని దొరలు దోచుకోలేరు. దొంగలు ఎత్తుకు పోలేరు. అన్నదమ్ములు వచ్చి పంచుకోలేరు. ఈ విద్యా ధనమే ప్రపంచ అభివృద్ధికి మూలం.
4. ఓ రాజా శరీరంలో బాణాలు గుచ్చుకుంటే ఉపాయంలో వాటిని తొలగించుకోవచ్చు కాని అతి పరుషంగా మాట్లాడిన మాటలు మనస్సులో గుచ్చుకుంటే వాటిని తొలగించడానికి మనం ఎన్ని ఉ పాయాలు చేసినా లాభం లేదు అవి తొలగిపోవు
5. ఓ కుమారా! రోషావేశాలు మనుషులకు పాపాన్ని అంటగడతాయి. ఇవే దుఃఖానికి మూలం. అట్టి గుణాలను విడిచిపెట్టిన వారిని పండితులు సైతం మెచ్చుకుంటారు.
6. ఓ కుమారీ! ఒకరు చేసిన కీడు మరచిపోవాలి. కాని ఇతరులు మనకి చేసిన మేలును ఎన్నడూ మరచిపోకూడదు. అందరిపట్ల అనురాగంగా, మర్యాదతో ప్రవర్తించాలి.
7. ఓ కాళికాంబా! పుస్తకాలు చదివినందు వల్ల పూర్ణత్వం లభించదు, మనసులో ఉండే భావాలను చదవాలి. పరిశుభ్రత మనలను పరమేశ్వరుని వద్దకు చేరుస్తుంది. పుస్తక జ్ఞానం కంటే ఎదుటి వారి హృదయాలను చదవటం ముఖ్యం. మనిషి మనసు, వాక్కు, కర్మ పరిశుద్ధంగా ఉండాలని భావం
8. భాస్కరా! ధనవంతునికి మనం చేసే మేలు వ్యర్థం. పేదవారికి మేలు చేస్తే ప్రయోజనం కలుగుతుంది. వానలు లేక ఎండిపోతున్న చేల మీద మేఘుడు వర్షిస్తే ఫలితం ఉంటుంది కాని సముద్రం మీద కురిస్తే ప్రయోజనం ఉండదుకదా!
9. దయాసముద్రుడవైన ఓరామా! ఎవరి దగ్గరా చేయి చాపనివాడు, అడిగితే లేదనకుండా ఇచ్చేవాడు, నోరు తెరచి నిజం తప్ప అబద్ధం చెప్పనివాడు, యుద్ధంలో వెన్నుచూపనివాడు, అదృష్టవంతులైన తల్లిదండ్రులకు ఇటువంటి గొప్పవాడైన కొడుకొక్కడు చాలు.

**ఇవి చేయండి**

**ఉపాధ్యాయుడు చెప్పిన కింది పదాలను (ఉక్తలేఖనం) రాయండి.**

పక్కన నవ్వు – భ్రాతృజనం – విశ్వ వర్ధనం – విరసంబైన – రోషావేశాలు – దుఃఖకరం – మాతృపూజ – అన్యకాంత – నిష్ఫలం – నెఱిగుఱి – తనూభవుడు – భద్రగిరి – దాశరథి – కరుణాపయోనిధి – అంబుధి – సత్ఫలం – వీరబ్రహ్మం – కరుణశ్రీ



## అవగాహన – ప్రతిస్పందన

1. పాఠంలోని పద్యాలను రాగంతో, భావానికి తగినట్లుగా పాడండి.
2. 'కాలం చాలా విలువైంది' ఎందుకో చర్చించండి.
3. 'విద్య గొప్పతనం' నాలుగు వాక్యాల్లో రాయండి.
4. కింది పద్యాన్ని చదివి ప్రశ్నలకు జవాబులు రాయండి.

చెలిమి శిలాక్షర మెప్పుడు
అలుక జలాక్షరము సుజనులగు వారలకున్
చెలిమి జలాక్షర మెప్పుడు
అలుక శిలాక్షరము కుజనులగు వారలకున్



**ప్రశ్నలు:**

(అ) అలుక ఎవరికి జలాక్షరం?

..........................................................................................

(ఆ) 'చెరిగిపోనిది' అనే అర్థంలో కవి ఏ పదాన్ని వాడాడు?

..........................................................................................

(ఇ) ఈ పద్యంలో ఏ అక్షరం ఎక్కువ సార్లు వచ్చింది?

..........................................................................................

(ఈ) ఈ పద్యానికి శీర్షికను సూచించండి.

..........................................................................................



## వ్యక్తీకరణ – సృజనాత్మకత

**అ) కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాలలో జవాబులు రాయండి.**

1. నీ దృష్టిలో స్నేహం అంటే ఏమిటి?
2. "కోపంగాని, ఆవేశంగాని మంచివి కావు" ఎందుకో వివరించండి?
3. మనం స్త్రీలను ఎలా గౌరవించాలి?

**ఆ) కింది ప్రశ్నలకు 8 నుండి 10 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. ఎటువంటి వారికి సహాయం చేయాలి? ఈ విషయాన్ని కవి ఎలా తెలియజేశారు?
2. మంచి కుమారునికి ఉండవలసిన లక్షణాలేవి?
3. పాఠంలోని పద్యాల ఆధారంగా మీరు నేర్చుకున్న మంచి గుణాలు రాయండి.



## భాషాంశాలు

**అ) కింది గీతగీసిన పదాలకు అర్థాలు రాయండి. వాటితో సొంతవాక్యాలు రాయండి.**

ఉదా॥ సిరి కలిగి ఉండటం వలన గర్వించకూడదు.
సిరి = సంపద
సంపద ఎవరి వద్ద స్థిరంగా ఉండదు.

1. ఏ పనినైనా విచక్షణతో చేసేవారే బుధులు.

.......................................................................................

2. రైతులు ధరణిని నమ్ముకొని జీవిస్తారు.

.......................................................................................

3. అంబుధి లో నీరు తాగడానికి పనికిరాదు.

.......................................................................................

**ఆ) కింది వాక్యాలలో సమానార్థక పదాలను (పర్యాయపదాలు) గుర్తించి రాయండి.**

1. వృక్షాలు మనల్ని రక్షిస్తాయి. తరువుల రక్షణ మనందరి బాధ్యత.
2. భాస్కరుడు తూర్పున ఉదయిస్తాడు. లోకానికి వెలుగు నిచ్చేవాడు సూర్యుడు.
3. యుద్ధం వలన అనేక నష్టాలు ఉన్నాయి. కాబట్టి రణం లేకుండా కలిసిమెలిసి ఉండాలి.

**ఇ) కింది గీతగీసిన పదాలకు వ్యతిరేకార్థక పదాలు రాయండి.**

1. ఇతరుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలి.
2. సంతోషం సగం బలం.
3. ఈ ప్రదేశం సహజ సుందరంగా ఉంది.



**ఈ) కింది ప్రకృతి - వికృతి పదాలను జతపరచండి.**

| | | | |
|---|---|---|---|
| 1. | శ్రీ | (      ) | (అ) రోసం |
| 2. | దీపము | (      ) | (ఆ) సిరి |
| 3. | రోషం | (      ) | (ఇ) దివ్వె |

## వ్యాకరణాంశాలు

**అ) కింది పదాలను పరిశీలించండి.**

మాయమ్మ = మా + అమ్మ = మా + య్ + అమ్మ
మీయిల్లు = మీ + ఇల్లు = మీ + య్ + ఇల్లు

పై పదాల మధ్య 'య్' అదనంగా వచ్చి చేరింది. అలా చేరడాన్ని 'యడాగమం' అంటారు.

**కింది పదాలను విడదీయండి.**

ఉదా :

| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| మేనయత్త | = | మేన | + | అత్త | = | మేన | + | య్ | + | అత్త |
| ఉన్నయూరు | = | .......... | + | .......... | = | .......... | + | .......... | + | .......... |
| సరియైన | = | .......... | + | .......... | = | .......... | + | .......... | + | .......... |
| నాదియన్న | = | .......... | + | .......... | = | .......... | + | .......... | + | .......... |

**(ఆ) కింది పదాలను విడదీయండి.**

ఏమంటివి = ఏమి + అంటివి (మ్ + ఇ + అ = మ) సంధి జరిగితే.
ఏమియంటివి = ఏమి + య్ + అంటివి (య్ + అ = య) సంధి జరగకపోతే.
పై పదాల వలె కింది పదాలను విడదీయండి.

వచ్చిరిపుడు = ................ + ............... (......................)
వచ్చిరియిప్పుడు = ................ + .......... + ............... (......................)

పై పదాలను విడదీసినప్పుడు మొదటిపదం చివరన 'ఇ' (ఇత్వం) ఉంది. రెండవపదం మొదట అ, ఇ వంటి అచ్చులు వచ్చాయి. ఇత్వంపై సంధి తప్పక జరగాలనే నియమం లేదు. జరగవచ్చు, జరగకపోవచ్చు. వ్యాకరణంలో ఈ పరిస్థితిని 'వైకల్పికం' అంటారు.

**కింది పదాలను విడదీసి రాయండి.**

ఉదా॥ నాదన్న = నాది + అన్న
నాదియన్న = నాది + య్ + అన్న
అదొకటి = ............... + .............
అదియొకటి = ............... + .......... + ................
లేకున్న = ............... + .............
లేకయున్న = ............... + .......... + ................

**కింది పదాలను కలిపి రాయండి.**

ఉదా॥ మఱి + ఏమి = మఱేమి = మఱియేమి
ఇది + అంత = ............ = ......................
రానిది + అని = ............ = ......................
అది + ఎట్లు = ............ = ......................

**ఇ) కింద ఇచ్చిన పదాలను విడదీసి సంధిపేరు రాయండి.**

కాలమూరక = ................. + ................. (....................)
దీపమున్న = ................. + ................. (....................)
నేరములెన్నడు = ................. + ............. (....................)

**కింది పదాలను కలిపి సంధిపేరు రాయండి.**

జనములు + అందరు = ......................... (.........................)

మేలు + అది = ......................... (.........................)

మేఘుడు + ఒక = ......................... (.........................)

**ఈ) సమాసం:** అర్థవంతమైన రెండు పదాలు కలిసి, ఒకే పదంగా ఏర్పడటాన్నే సమాసం అంటారు. సమాసంలోని మొదటి పదాన్ని పూర్వపదమని, రెండవ పదాన్ని ఉత్తరపదమని అంటారు.

**ఉదా :** సరస్వతీమందిరం – సరస్వతి యొక్క మందిరం


పై ఉదాహరణలో సరస్వతి పూర్వపదం, మందిరం ఉత్తరపదం ఇలా సమాసాలు ఏర్పడతాయి.

**ఉ) ద్వంద్వసమాసం :** సమాసంలో ఉన్న రెండు పదాలు సమాన ప్రాధాన్యం కలిగిఉంటే అది ద్వంద్వసమాసం.

**ఉదా:** సూర్యచంద్రులు = సూర్యుడును, చంద్రుడును

తల్లిదండ్రులు = తల్లియు, తండ్రియు

రామలక్ష్మణులు = రాముడును, లక్ష్మణుడును



**"ఉభయ పదార్థ ప్రధానంబు ద్వంద్వంబు"** అని సూత్రం

**కింది పదాలకు విగ్రహవాక్యాలు రాయండి.**

రాత్రింబవళ్ళు = ....................................

బంధుమిత్రులు = ....................................

బాలబాలికలు = ....................................

**కింది విగ్రహవాక్యాలను సమాసపదాలుగా మార్చి రాయండి.**

రోషమును, ఆవేశమును = ....................................

అన్నయు, తమ్ముడును = ....................................

కూరయు, కాయయు = ....................................

**ఊ) కింది వాక్యాలను గమనించండి.**

1. స్నేహం ఉన్నప్పుడు తప్పులు కనబడవు
2. మాధవి పూజ కొరకు పూలను కోసుకొచ్చింది.
3. జీవితంలో జయాపజయాలు ఉంటాయి.
4. రవితో రహీం బడికి వెళ్ళాడు.

పై వాక్యాల్లో గీతగీసిన అక్షరాన్ని లేదా పదాన్ని తొలగించి చదవండి. అర్థవంతంగా లేవుకదా!

ఉదా: చెట్లు ఫలాల బరువెక్కాయి.

ఈ వాక్యంలో పదాల మధ్య సంబంధం సరిగా లేనట్లుగా అనిపిస్తుంది. ఇప్పుడు 'చేత' అనే ప్రత్యయం ఉపయోగించి చదవండి. చెట్లు ఫలాల చేత బరువెక్కాయి. ఇలా పదాల మధ్య అర్థసంబంధాన్ని ఏర్పరచడానికి ఉపయోగించే వాటిని విభక్తులు అంటారు.

కింది ప్రత్యయాలను విభక్తులను తెలుసుకోండి.

| ప్రత్యయాలు | విభక్తులు |
|---|---|
| డు, ము, వు, లు | ప్రథమా విభక్తి |
| ని(న్), ను(న్), ల(న్), కూర్చి, గురించి | ద్వితీయా విభక్తి |
| చేత(న్), చే(న్), తోడ(న్), తో(న్) | తృతీయా విభక్తి |
| కొఱకు(న్), కై (కోసం) | చతుర్థీ విభక్తి |
| వలన(న్), కంటె(న్), పట్టి | పంచమీ విభక్తి |
| కి(న్), కు(న్), యొక్క, లో(న్), లోపల(న్) | షష్ఠీ విభక్తి |
| అందు(న్), న(న్) | సప్తమీ విభక్తి |
| ఓ, ఓయి, ఓరి, ఓసి | సంబోధన ప్రథమా విభక్తి |



## చమత్కార పద్యం

హరి కుమారుడై యొప్పెడునాతడు హరి
హరికి దక్షిణనేత్రమౌ నాతడు హరి
హరికి శిరముతోడ వరలు నాతడు హరి
హరికి వామాక్షమౌ యొప్పునాతడు హరి

### నానార్థాలు :

హరి= కోతి, సూర్యుడు, సింహము, చంద్రుడు

1. సూర్యుని కొడుకు సుగ్రీవుడు
2. శ్రీహరి కుడికన్ను సూర్యుడు.
3. సింహపు తలతో ఒప్పువాడు శ్రీహరి.
4. శ్రీహరికి ఎడమ కన్ను చంద్రుడు అని ఇలా చెప్పుకోవాలి.





## నేనివి చేయగలనా?




1. పాఠంలోని పద్యాలను రాగయుక్తంగా, భావయుక్తంగా పాడగలను. ఔను / కాదు
2. పద్యభావాలను సొంత మాటలలో చెప్పగలను, రాయగలను. ఔను / కాదు
3. పాఠంలోని పదాలను సొంత వాక్యాలలో ఉపయోగించగలను. ఔను / కాదు
4. పాఠంలోని ప్రశ్నలకు జవాబులు సొంతమాటలలో రాయగలను. ఔను / కాదు

చదవండి - ఆనందించండి

# టోపీల వ్యాపారి

L2V6V5



ఒక ఊరిలో కాశీనాథుడు అనే ఒక టోపీలు అమ్మేవాడు ఉండేవాడు. అతడు చాలా నీతిమంతుడు. టోపీలను కొద్ది లాభానికే అమ్మేవాడు. అతడు దేశ విదేశాల నుండి తెప్పించిన రంగు రంగుల టోపీలను సరసమైన ధరలకే అమ్మడంతో జనం విరగబడి అతని దగ్గర టోపీలు కొనేవారు. అంగడిలో ఉన్నప్పుడు ఆ రోజు వ్యాపారంలో వచ్చిన డబ్బును అతడు ఓ టోపీలో దాచుకునేవాడు.

ఓ రోజు పూరి జగన్నాథుని రథ మహోత్సవం ఉండడంతో అతడు రథము లాగబడే వీథిలో ఒక చిన్న దుకాణం పెట్టుకున్నాడు. మొదటి రోజే చాలా టోపీలు అమ్మాడు. ఎప్పటిలాగే అతను డబ్బును ఒక టోపీలో దాచాడు. చీకటి పడ్డాక తన సంపాదన ఎంతో లెక్కపెడదామని, తన డబ్బు దాచుకునే టోపీ కొరకు వెతికాడు. టోపీ దొరకలేదు. అతనికి గుండె ఆగినంత పనైంది. "అమ్మో! నేను బాగా నష్టపోయానే. పొరపాటున డబ్బు దాచుకునే టోపీని అమ్మేసినట్టున్నాను" అని బాధతో కుమిలిపోతూ, రాత్రంతా నిదుర పోలేదు.

మరునాడు ఉదయాన్నే తన దుకాణానికి వెళ్లి 'ఎవరికైనా తన డబ్బు దాచిన టోపీ దొరికిందా' అని అడుగసాగాడు.

"ఎవరికైనా నువ్వు డబ్బు దాచిన టోపీ దొరికితే నీకు ఇస్తారా! నీ మూర్ఖత్వం కాకపోతే ఏంటి" అని జనం ఎగతాళిగా నవ్వారు.

కొంచెం సేపు అయ్యాక, ఒక ముసలాయన దిగులుగా కూర్చున్న కాశీనాథ్ దగ్గరకు వచ్చి "నాయనా! నువ్వు ఇచ్చిన టోపీ చాలా బరువుగా ఉంది. ఇది తీసుకొని నాకు తేలికగా ఉన్న టోపీని ఇవ్వు" అని అన్నాడు.


కాశీనాథుడు ఆ టోపీని తీసుకొని తేలికైన టోపీని ఇచ్చి ఆ ముసలాయనను పంపేశాడు. టోపీ ఎందుకు బరువుగా ఉంది అని చూడగా, అతనికి అందులో దాచిన డబ్బు కనిపించింది.

'హమ్మయ్యా!' అని ఊపిరి పీల్చుకుంటూ, 'నిజాయతిగా బతికే వారిని దేవుడు ఎప్పుడూ మోసం చేయడని రుజువైంది' అని తన మనసులో అనుకున్నాడు కాశీనాథుడు.

# 7. మమకారం

## వినడం - ఆలోచించి మాట్లాడడం

Y1K3Y7



1. చిత్రంలో ఎవరెవరు ఉన్నారు?
2. చిత్రంలోని అమ్మాయి అమ్మకు తన స్నేహితురాలిని ఎలా పరిచయం చేస్తోంది?
3. మీ స్నేహితులు మీ అమ్మానాన్నలను ఏమని పిలుస్తారు?

**ఉద్దేశం:** అవసరం కోసం ఆంగ్లభాషను నేర్చుకుంటాం. కానీ దానిమీద వ్యామోహంతో మాతృభాషను నిరాదరించడం సరికాదు. వాడగలిగిన ప్రతిచోటా మాతృభాషనే వాడదాం అని చెప్పడం ఈ పాఠం ఉద్దేశం.

### కవి పరిచయం

### చిలుకూరి దేవపుత్ర


(24.4.1952 - 18.10.2016)



అనంతపురం జిల్లా కాల్వపల్లెలో జన్మించారు. 'ఏకాకి నౌక చప్పుడు', 'చివరి మనుషులు', 'బందీ', 'వంకర టింకర', 'ఆరు గ్లాసులు' మొదలైన కథా సంపుటాలు వెలువరించారు. 'అద్దంలో చందమామ', 'పంచమం' ఆయన రాసిన నవలలు. 1996లో 'పంచమం' నవలకు ఆటా (అమెరికా తెలుగు అసోషియేషన్) వారి నవలల పోటీలో తృతీయ బహుమతి, 2000 సంవత్సరంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారి ధర్మనిధి పురస్కారం, 2001లో చా.సో. స్ఫూర్తి సాహితీ సత్కారం, ఆంధ్రప్రదేశ్ గుర్రం జాషువా పురస్కారం లభించింది. ఈ పాఠం చిలుకూరి దేవపుత్ర రచించిన 'ఆరుగ్లాసులు' అనే కథాసంపుటిలోనిది.

# మమకారం

ఎండకాలం సెలవులకని సీత పిల్లలిద్దరితోపాటూ బళ్ళారిలోని వాళ్ళ పుట్టింటికి పోయింది. రెవిన్యూ వాడిని కాబట్టి సెలవులన్న అదృష్టం ఎట్లానూ లేదని చెప్పి, ఒక ఆదివారం ఉదయమే బళ్ళారి చేరుకున్నాను. అక్కడి ఇంటి వాతావరణం చూస్తూ ఉంటే భలే ముచ్చటగా ఉంది. సీత చెల్లెళ్లూ, వాళ్ళ భర్తలూ, పిల్లలూ, సీత తమ్ముళ్ళిద్దరూ, వాళ్ళ భార్యలూ, పిల్లలూ అంతా ఒకచోట చేరి ఉండటంతో కనులపండుగగా ఉంది.



పిల్లల కేరింతలూ, ఆటలూ, వాళ్ళ మధ్య చిట్టిపొట్టి తగవులూ, కొట్లాటలూ, ఏడుపులూ ఒకవైపూ...

వదిన మరదళ్ళ సరసాలూ, విరసాలూ, బావ బావమరదుల వెక్కిరింతలూ, జాంతణాలూ మరొకవైపూ...

అక్కా చెల్లెళ్లూ, తమ్ముళ్ళూ వాళ్ళ ఒద్దికలూ, ప్రేమలూ, ఆప్యాయతానురాగాలు ఎక్కడయితే ఉంటాయో! అక్కడ స్వర్గతుల్యమే అనడానికి పెద్ద ఉదాహరణ మా అత్తగారి ఇల్లే!

అప్పటికి ఇంకా టైం ఒంటిగంటకాలేదు. ఎందుకో అక్కడున్న పిల్లల్లో ఒక కొత్త వాతావరణం కనిపిస్తూ ఉన్నది. అదేమిటా అని కొంచెం పరిశీలించితే నాకు అర్థమయింది. ఇంతకు మునుపుమాదిరి వాళ్ళ సంబోధనలు లేవని తేలింది. ఎట్లాగంటే – చిన్నాయన, పిన్నీ, మామ, అత్త, పిలుపులను ఆంటీ, అంకుల్‌లతో సరిపెడుతున్నారు. అట్లా మమ్మల్నందర్నీ పిలుస్తున్నది ఎవరో కాదు సుగుణ, రాధల పిల్లలు. ఎందుకో కానీ, కాసేపటికే నేను భరించలేకపోయాను.

మన భాష అన్నది మన సంస్కృతికీ, మన జీవన విధానానికీ ప్రతీక అని నా నిశ్చితాభిప్రాయం. మేము పిల్లల్తో 'అమ్మానాన్న'లనే పిలిపించుకుంటున్నాం. అది నా సంస్కృతిగా, నా జీవన విధానంగా భావిస్తాను. నా తండ్రిని నేను 'నాన్నా' అంటూ పిలిచినపుడు; ఆయనకు కలిగిన ఆనందం, వాత్సల్యం – ఈ పొద్దు నా పిల్లలు నన్ను 'నాన్నా' అని పిలిచినపుడు నాకు కలగాలి. చదువుకోసం, ఉద్యోగం కోసం ఇంగ్లీషు అవసరమైతే నేర్చుకుంటాం, అంతేకానీ వాళ్ళ ఆచార వ్యవహారాలూ, వాళ్ళ జీవనశైలీ మనకు అనవసరం అన్నది నా వాదన.



ఆ సాయంత్రమే అందరం వరండాలో కూచుని కాఫీలు తాగుతున్న సమయాన – "ఏమ్మా! రాధా! సుగుణా! మీ పిల్లలు పిలుస్తున్న వరసలు గమనించారా – తెలుగు వరసలు పిలిపించండి పిల్లల్తో" అంటూ గట్టిగానే చెప్పాను. వాళ్ళయితే మొగాలు మాడ్చుకున్నట్టు అనిపించింది.

అనంతపురానికి వచ్చినాక సీత నాకు క్లాసు పీకింది. సుగుణ, రాధలు ఎంత బాధపడినదీ చెప్పింది – "బావతో మాట్లాడాలంటే మరదళ్ళు భయపడే పరిస్థితి తెచ్చిపెట్టినారు... ఇంకెప్పుడూ వాళ్ళను ఏమనకండి" అంటూ వార్నింగ్ లాంటిది పరోక్షంగా ఇచ్చింది.

* * *

ఆ మరుసటి రోజు ఉదయమే నేను 'మడకశిర'కు బయల్దేరి వెళ్ళాను, మా కొలీగ్‌తో పాటూ –

మండల ఆఫీసుకు చేరుకున్నాక అక్కడినించి సత్యానికి ఫోన్ చేశాను. అతను పదేళ్ళుగా నాకు మంచి మిత్రుడు. ఆ ఊర్లోనే ఒక స్వచ్ఛంద సంస్థను నడుపుతున్నాడు. తన ఇంటిఅడ్రసు చెప్పి రమ్మన్నాడు. అతని కుటుంబం గురించి కొంత వివరమడిగాను. అతనికి ఇద్దరు మగపిల్లలనీ, వాళ్ళ అల్లరే తనకు ఎంతో సంతోషాన్నిస్తుందని తెలిపాడు.

ఎందుకో గాని సత్యం గుర్తుకురాగానే వెంటనే ఇంగ్లీషే జ్ఞాపకానికి వస్తుంది. అతను గుంటూరు, ఆంధ్ర క్రిష్టియన్ కాలేజీలో బి.ఏ., చదివాడు. దాంతో అనర్గళంగా ఇంగ్లీషు మాట్లాడ్డం అలవడింది. ఇంక అతను పెళ్ళి చేసుకున్న అమ్మాయి బెంగుళూరులో ఇంగ్లీషు దొరసానుల పెంపకంలో చదువుకున్న మలయాళ స్త్రీ. ఇంక ఆ ఇంట్లో తెలుగు పలుకుకు చోటు ఎక్కుడుంటుంది? ఆంధ్రదేశంలో ఇంగ్లీషు మాట్లాడే కుటుంబాన్ని చూడాలన్న ఉబలాటం బయల్దేరింది నాలో.

* * *

ఆఫీసు ఇన్‌స్పెక్షను నోట్స్ రాయడం కొంతవరకూ అయింది. మరుసటి రోజుకు కానీ పూర్తవదు.... ఆ పూటకి విశ్రాంతే... తర్వాత కలుస్తానని మా కొలీగ్‌కి చెప్పేసి, సత్యం ఇల్లు వెతుక్కుంటూ బయల్దేరాను. సులభంగానే అతని ఇంటిని కనుక్కోగలిగాను. వీధి మొగదలలో ఉన్న అంగట్లో రెండు బిస్కెట్ పాకెట్లు కొన్నాను సత్యం పిల్లల కోసం.

చిన్న కాంపౌండులో అధునాతనంగానే ఉంది ఆ ఇల్లు. బయట ఎవరూ కనిపించలేదు. వరండా బయటే నిలుచుని సత్యాన్ని పిలిచాను. నీలం టీ షర్ట్, అదే రంగు పేంటుతో ఉన్న ఆరేళ్ళ పిల్లోడు వచ్చాడు.

సత్యం కొడుకే అనిపించేంతగా ఉన్నాడు. వాడి వెనకాలే మరో బుడతడు, వాడికంటే వీడు ఒక సంవత్సరం చిన్నవాడయి ఉంటాడు. వీడూ అదే రంగు బట్టలు వేసుకుని ఉన్నాడు.

"మీ డాడీ లేడా?" అడిగాను. నాకు తెలీకనే ఇంగ్లీషు వాతావరణం నాలో ప్రవేశించినట్టుంది. అందుకే 'మీ నాన్నలేడా?' అని అనలేకపోతున్నాను. "ఊహూ!" అంటూ కాస్త ముందుకు వచ్చి "నువ్వు మామవి కదూ!" అన్నాడు పెద్దాడు.

నేను 'ఊ' అనాలో, 'ఊహూ' అనాలో తెలీకుండా ఉంది. అసలు నన్ను ఎవరనుకుంటున్నాడో వీడు.

"నా పేరు రాజు. మీ డాడీ ఫ్రెండుని, అంకుల్"ని అన్నాను నవ్వుతూ. నువ్వనుకుంటున్నట్టు మామను కాదు అని తేటతెల్లం చేశాను వాడికి.

"నాకు తెలుసు నువ్వు రాజు మామవని.. పొద్దున్న నాన్న ఆల్బంలో నీ ఫోటో చూపించి, నువ్వు అనంతపురంనించి ఇక్కడికి వచ్చినావని చెప్పినాడు" అన్నాడు నవ్వు మొగంతో. తొణుకూ బెణుకూ లేకుండా వాడు అట్లా మాట్లాడుతూ ఉంటే నాకు ఒకటే ఆశ్చర్యం. అంతకన్నా ఆశ్చర్యం, కేవలం మిత్రుడిని మాత్రమే అయిన నన్ను 'మామ' ను చేయడం. వాళ్ళపేర్లు అడిగాను చెరో బిస్కెట్టు పేకెట్ అందిస్తూ. పెద్దోడు బుజ్జీ అనీ, చిన్నోడు చిన్న అనీ చెప్పారు.

'లోపలికి వచ్చి కూచో మామా! నాన్న ఇప్పుడొస్తాడులే' అంటూ పెద్దోడు చెబుతున్నట్టే నా వెనుక మోటార్‌బైక్ ఆగిన శబ్దం.

'అద్దో నాన్న' అంటూ వాడు అంటూంటే తిరిగి చూశాను.

సత్యం హెల్మెట్‌ని తలనుంచి వేరుచేస్తూ నవ్వుతూ నాతో కరచాలనం చేశాడు.

ఇంట్లోకి వెళ్ళి కూచున్నాం.

"మీ మిసెస్ ఎక్కడ సత్యం?" అడిగాను.

"ఇంక కాసేపట్లో వస్తుందిలే... పక్కన ఉన్న పల్లెకు పోయింది. మాకు పల్లె ప్రజలతోనే కదా పని" అన్నాడు సత్యం.



సత్యం వాళ్ళ పనిఅమ్మాయి కాఫీ ఇచ్చింది.. మేమిద్దరం మాటల్లో పడిపోయాం. పిల్లలిద్దరూ వాళ్ళ నాన్నని రకరకాలయిన ప్రశ్నలు అడుగుతూనే ఉన్నారు. ఏ మాత్రం విసుగులేకుండా హాయిగా సమాధానమిస్తూ ఉన్నాడు – ఒకవైపు నాతో మాట్లాడుతూనే.

"ఆంధ్రదేశంలో ఉన్న ఆంగ్ల కుటుంబాన్ని చూడాలని వస్తే అచ్చ తెలుగు కుటుంబం కనిపిస్తా ఉంది సత్యం... పిల్లలిద్దరూ నిన్ను డాడీ అనకుండా నాన్నా అని పిలవడం భలే ఉంది. నా ఊహల్ని తలకిందులుగా చేసినావు. అంతేకాదు పిల్లలిద్దరూ 'మామా' అంటూ నన్ను పలకరిస్తూ ఉంటే ఏదో తెలియని మమకారం కలిగింది నాకు" అన్నాను.


నవ్వుతూ – "ఇంగ్లీషు భాష మనకు అవసరమే.... అంతవరకే దాన్ని వాడుకుంటాం. మన భాషనీ, సంస్కృతినీ ఎందుకు వదిలేసుకుంటాం? ఇంకా మా ఆవిడ తెలుగుని వింటే ఆశ్చర్యపోతావు. ఆవిడ మలయాళీ కదా – ఇంగ్లీషు వాళ్ళ పెంపకంలో ఇంగ్లీషు తప్ప మరొక భాష తెలీదు. ఇక్కడి ప్రజల్లో పని చేయాలంటే ఇంగ్లీషు పనికి రాదు. చాలా తొందరగా తెలుగు నేర్చుకుంది" అన్నాడు. అక్కడి నించీ బయల్దేరుతూ "ఈసారి అనంతపురానికి వస్తే తప్పకుండా మా ఇంటికి పిల్లల్తో పాటూ రావల్ల" అన్నాను.

పిల్లలిద్దరూ నవ్వుతూ దగ్గరకొచ్చి "టాటా మామా! టాటా మామా!" అంటూ వీడుకోలు పలుకుతుంటే, ఇద్దర్నీ ముద్దాడాను. ఎందుకో నా కళ్ళల్లో నీటి పొర.... (సంక్షిప్తం)

**ఇవి చేయండి**

**ఉపాధ్యాయుడు చెప్పిన కింది పదాలను (ఉక్తలేఖనం) రాయండి.**

తుల్యం, ప్రతీక, నిశ్చితాభిప్రాయం, వాత్సల్యం, జీవనశైలి, అనర్గళంగా, తేటతెల్లం, తీవ్రత, నువ్వనుకున్నావు, ఎవరనుకున్నావు.



## అవగాహన – ప్రతిస్పందన

1. మీ భాష అంటే మీకు ఎందుకు ఇష్టమో చెప్పండి ?
2. ఏది స్వర్గంతో సమానమైనదని రచయిత అన్నాడో రాయండి ?
3. బంధువుల ఇంట్లో రచయితకు కనిపించిన కొత్త వాతావరణం ఏమిటో రాయండి ?
4. కింది కరపత్రాన్ని చదివి ప్రశ్నలకు జవాబులు రాయండి.

### ఆలయ పరిరక్షణ అందరి బాధ్యత

భక్తులారా!

ఆంధ్ర మహావిష్ణువు తెలుగువారి ఆరాధ్య దైవం. కృష్ణాజిల్లా శ్రీకాకుళంలో ఆంధ్ర విష్ణుదేవాలయం ఉంది. శ్రీకృష్ణదేవరాయలు ఈ దేవుణ్ణి దర్శించుకొని స్వామి ఆదేశం మేరకు తాను ఆముక్తమాల్యద గ్రంథం రాసినట్లు చెప్పాడు. నేను తెలుగు వల్లభుణ్ణి. నా భాష తెలుగు భాష. అది అన్ని భాషలకన్నా గొప్పది అని స్వామి స్వయంగా తనకు చెప్పినట్లు కూడా పేర్కొన్నారు. అటువంటి అరుదైన ఆంధ్ర విష్ణు దేవాలయాన్ని పరిరక్షించుకుందాం. మరింత అభివృద్ధి చేద్దాం. ఇది మనందరి బాధ్యత.

ఇట్లు
**అఖిలాంధ్ర ఆలయ పరిరక్షణ సంఘం,**
అమరావతి.

అ) ఆంధ్ర విష్ణుదేవాలయం ఎక్కడ ఉంది ?
ఆ) ఈ కరపత్రం ప్రచురించింది ఎవరు ?
ఇ) నా భాష తెలుగుభాష – అని చెప్పింది ఎవరు ?
ఈ) ఆముక్తమాల్యద గ్రంథం రాసింది ఎవరు?



## వ్యక్తీకరణ - సృజనాత్మకత

**అ) కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాలలో జవాబులు రాయండి.**

1. అత్త-మామ; పిన్ని-బాబాయి; బావ-బావమరిది... ఇలా మీకు తెలిసిన బంధువాచక పదాలు పది రాయండి.
2. 'సత్యం' కుటుంబాన్ని చూసి రచయితకు 'మమకారం' ఎందుకు కలిగింది?
3. ఈ కథ "ఎందుకో నా కళ్లల్లో నీటిపొర..." అని ముగుస్తుంది. ఆనందంతో వచ్చే కన్నీటిని ఏమంటాం? అవి ఎప్పుడు వస్తాయి?

**ఆ) కింది ప్రశ్నలకు 8 నుండి 10 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. భాష విషయంలో రచయిత అభిప్రాయాలను వివరించండి.
2. "ఇంగ్లీష్ భాష మనకు అవసరమే! అంతవరకే దాన్ని వాడుకుంటాం. మన భాషనీ సంస్కృతినీ ఎందుకు వదిలేసుకుంటాం?" - దీనిపై మీ అభిప్రాయం రాయండి.
3. మీరు బంధువుల ఇంటికి వెళ్లినప్పుడు పిల్లలంతా ఒకచోట చేరి ఉండటంతో కనుల పండుగగా ఉంటుంది కదా! ఆ పిల్లల కేరింతలు, ఆటలు, వాళ్ల మధ్య చిన్న చిన్న తగాదాలు... వీటిని గురించి మిత్రునికి లేఖ రాయండి.



## భాషాంశాలు

**అ) కింది సూచనల ఆధారంగా 'కారం' తో అంతమయ్యే పదాలు రాయండి.**

1. ఈ పాఠం పేరు మమకారం.
2. ఎదుటివారికి మేలు చేయడం ............కారం.
3. ఎదుటివారిని గేలి చేయడం ............కారం.
4. దట్టమైన చీకటి .............కారం.
5. గర్వం, అహంభావం .............కారం.

**ఆ) కింది వాక్యాలను చదవండి. గీతగీసిన పదాల అర్థాలు తెలుసుకొని సొంతవాక్యాలు రాయండి.**

ఉదా॥ విహారయాత్రకు వెళ్లాలన్న మా <u>ఉబలాటం</u> చూసి మా ఉపాధ్యాయులు ముచ్చటపడ్డారు.

ఉబలాటం = కోరిక

మా మిత్రులందరూ సినిమాకు వెళ్ళాలని ఉబలాటపడుతున్నారు.

1. బాపు, రమణలు ఒద్దిక గా ఉండి జీవితాంతం స్నేహితులుగా ఉన్నారు.

2. మదర్ థెరిసా చూపే వాత్సల్యం చాలామంది జీవితాల్లో వెలుగులు నింపింది.

3. ఆ నగరంలోని అధునాతన కట్టడాలు నాకు ఆశ్చర్యాన్ని కలిగించాయి.

**ఇ) కింది వాక్యాలలో సమానార్థక పదాలు ఉన్నాయి. గుర్తించి గీత గీయండి.**

1. వచ్చీరాని మాటలతో ఆ బుడతడు చేసే అల్లరి అందరికీ ఆనందాన్నిస్తోంది. ఆ పిల్లవాడు అందరి దృష్టినీ ఆకర్షించాడు.

2. మనిషికి అసలైన ధనం విద్యాధనమే! అని తేటతెల్లం చేశారు పూర్వీకులు. దీంతో మనం సంపాదించుకోవాల్సింది ఏమిటో స్పష్టమైందికదా!

3. మహాత్ముల జీవనశైలి నన్ను ఆకర్షిస్తుంది. వారు బతికే పద్ధతి నిరాడంబరంగా ఉంటుంది.

**ఈ) కింది వ్యతిరేక పదాలను జతపరచండి.**

| | | | | |
|---|---|---|---|---|
| 1. | పండితుడు | (అ) | దురదృష్టం | (    ) |
| 2. | సరసం | (ఆ) | పామరుడు | (    ) |
| 3. | అదృష్టం | (ఇ) | విరసం | (    ) |

**ఉ) కింది ప్రకృతి వికృతులను జతపరచండి.**

| | | | | |
|---|---|---|---|---|
| 1. | ఆశ్చర్యం | (అ) | వుయిలు | (    ) |
| 2. | భయం | (ఆ) | ఇంతి | (    ) |
| 3. | స్త్రీ | (ఇ) | అచ్చెరువు | (    ) |

## వ్యాకరణాంశాలు

**సామాన్యవాక్యం :** అసమాపక క్రియలు లేకుండా ఒక 'సమాపక క్రియ' తో ముగిసే వాక్యాన్ని సామాన్యవాక్యమంటారు.

ఉదా : సురేష్ గుడికి వెళ్ళాడు.

మేరీ పుస్తకం తీసింది.

చందు కలం పట్టుకున్నాడు.

**సంశ్లిష్టవాక్యం :** ఒకటి కాని అంతకంటే ఎక్కువ అసమాపక క్రియలు ఉండి, చివరకు ఒక సమాపక క్రియతో ముగిసిన వాక్యాన్ని సంశ్లిష్టవాక్యమంటారు.

ఉదా : పద్మ నిద్రలేచింది. (సామాన్యవాక్యం)

పద్మ స్నానం చేసింది. (సామాన్యవాక్యం)

పద్మ బడికి వెళ్ళింది. (సామాన్యవాక్యం)

ఈ మూడు వాక్యాలనూ కలిపితే....

పద్మ నిద్రలేచి స్నానం చేసి బడికి వెళ్ళింది. (సంశ్లిష్టవాక్యం)

అసమాపక అసమాపక సమాపక

అలా రెండు వాక్యాలను కూడా కలపవచ్చు.

★ రమేష్ సైకిల్ తొక్కుతున్నాడు. రమేష్ బడికి వెళ్తున్నాడు.

రమేష్ సైకిల్ తొక్కుతూ బడికి వెళ్తున్నాడు.
అసమాపక సమాపక

**ఆ) కింది సామాన్య వాక్యాలను సంశ్లిష్టవాక్యాలుగా మార్చి రాయండి.**

1. గురువుగారు పాఠం చెబుతున్నారు. గురువుగారు నవ్వుతున్నారు.

జ. ....................................................................................................

2. అమ్మ బుజ్జగించింది. అమ్మ అన్నం పెట్టింది.

జ. ....................................................................................................

3. ఎలుక అక్కడకు వచ్చింది. ఎలుక గుడ్లగూబను చూసింది.

జ. ....................................................................................................

## ప్రాజెక్టుపని (మూడవ నిర్మాణాత్మక మూల్యాంకనం కోసం)

పది పొడుపు కథలు సేకరించి ప్రదర్శించండి.

## చమత్కార పద్యం

ఒడలినిండ కన్నులుండు నింద్రుడుకాడు
కంఠమందు నలుపు కాడు శివుడు
ఫణులబట్టి చంపు పక్షీంద్రుడా? కాదు
దీనిభావమేమి తెలుసుకొనుడు



## నేనివి చేయగలనా?

1. పాఠాన్ని ధారాళంగా చదవగలను. అర్థంచేసుకొని సొంతమాటలలో చెప్పగలను. ఔను / కాదు
2. పాఠంలోని మాండలిక పదాలను, పదబంధాలను వాక్యాలలో ఉపయోగించగలను. ఔను / కాదు
3. తెలుగు భాషపై రచయితకున్న మమకారాన్ని చెప్పగలను. ఔను / కాదు
4. పాఠంలోని ప్రశ్నలకు జవాబులు సొంతమాటలలో రాయగలను. ఔను / కాదు

# "అమ్మ ఉత్తరం"

**(ఉద్యోగాల పేరుతో సుదూర తీరాలకు వలసపక్షుల్లా ఎగిరిపోతున్న కన్నకొడుకులకు...)**

కన్నా!

ఎన్నాళ్ళయిందిరా నిన్ను చూసి. తలుచుకుంటే ఇప్పటికీ కళ్ళకు కట్టినట్లుగా ఉంటావు. అయిదేళ్ళనాడు రమ కూతురి పెళ్ళికి వచ్చావు. అంతే మళ్ళీ యిక రానేలేదు. కానక కన్న సంతానంలా నిన్ను నలుగురమ్మాయిల మధ్య కనుపాపలాగా చూసుకొని పెంచుకున్నాను. నిన్ను యిల్లు దాటి వెళ్ళనివ్వలేదు. ఆ చదువుల సరస్వతి నిన్ను వెంటేసుకుని వెళ్ళింది. అంతా చదువుకొన్నవాళ్ళేగా! నా కన్న చదువుకొనక పోతేనేం సంస్కారం వచ్చింది. చదవనూ రాయనూ నేర్చుకున్నాడు చాలు. వద్దు అన్నాను. వినలేదు. తరువాత ఉద్యోగలక్ష్మి ఊళ్ళేలిస్తోంది. ఎక్కడున్నా నువ్వు నా కొడుకువే. నీ సారస్వత సంఘాలూ, నీ సాంఘిక సేవలూ అన్నీ పేపర్ల ద్వారా, కోడలి ఉత్తరాల ద్వారా తెలుస్తూనే ఉన్నాయి. కానీ ఏం లాభంరా తండ్రీ!

నీవూ నీ పిల్లలూ యింట్లో కాలికి చేతికి అడ్డంగా తిరుగుతూ ఉంటే కోడలి చేత్తో చేయించి పెడుతూ ఉంటే సాగిపోయే జీవితం ఎలావుంటుంది? ఏమో? అది నాకు 'కల' అయిపోయిందిరా బాబూ. ఇంత యింట్లో ఒంటరిగా బతుకుతున్నాను. నాకెంత కావాలి? పిడికెడు ఉడకేసుకుంటే చాలు... వెళ్ళిపోతుంది కానీ, ఆసక్తి పోయింది. ఎలా తింటే కడుపు నిండదు! అలాగే నడుస్తోంది.

జీవితంలో పొద్దువాటారిపోతోంది. ఇంకెన్నాళ్ళు అనిపిస్తోంది! మీ నాన్నగారూ హఠాత్తుగా పోయారు. నీకు కడసారి చూపులు కూడా దక్కలేదు. అప్పుడాయన దగ్గర్లో నేనున్నాను. గొంతుకలో గరగర లాడుతున్నప్పుడు నేను ఇన్ని నీళ్ళు పోశాను. నా దిగులల్లా అలా నాకు జరిగితే ఈ గొంతులో ఇంత తులసి తీర్థం పోసేవాళ్ళు కూడా ఉండరే అని. నలుగురు కూతుళ్ళు ఒక కొడుకు, పంద్రెండుగురు మనుమలు, మనవరాళ్ళువున్నా నా గొంతు తడిపేవాళ్ళు ఉండరేమో అని దిగులుపడుతున్నాను.

నువ్వు నన్ను అక్కడికే రమ్మని అంటావు. నిజమే! వచ్చేయొచ్చు. కానీ రాలేను. రాను! ఈ యిల్లు, ఈ పొలాలు, ఈ గాలి, ఈ వాతావరణం వీటిని వదలి రాలేను. మీ నాన్నగారు ఇక్కడే పోయారు, నేను ఇక్కడే పిడికెడు బూడిదైపోవాలి. అదే నా ఆశ!

ఈ మట్టికీ, మనిషికీ ఉండే ఆత్మీయత అంతేనేమో! ఎంత చదివినా, ఎంత సాధించినా, ఏం చేసినా ఆఖరికి మనిషి ఈ మట్టిలో కలసిపోవాలి. అలానే ఆ మట్టి తనను కన్నవూరి మట్టి కావాలని ఆరాటపడతాడు మనిషి. ఇది నా ఊరు... ఇది నా ఇల్లు... ఇది నాది... ఈ మమతానుబంధాలు లేని రోజున మానవత్వమే నశిస్తుందేమో! అందుకే అనాదిగా ఈ మమకారాలు ఇలాగే నిలిచిపోయాయి. రాజులు పోయారు, రాజ్యాలు



పోయాయి, మహా మహా నిర్మాణాలు మట్టిచాటుకు పోయాయి. కానీ మానవత మాసిపోలేదురా బాబు! అందుకే ఈ ప్రపంచం ఇంకా సాగుతోంది!

నేను అంత దూరం రాలేను. ఈ ఊరు విడవలేను. ఈ ప్రాణం తట్టెడా! పుట్టెడా? ఎప్పుడో హరీ అంటుంది. నాకు తెలుసు. నాది ఎలాగు దిక్కులేని చావే అవుతుంది. ఎప్పుడయితే ఆయన పోయారో – అప్పుడే నేను ఒంటరిదాన్నై పోయాను. కానీ పోయేలోగా నువ్వు ఇక్కడికి వచ్చి నాలుగురోజులు గడిపి పో. కన్న తల్లిగా నేను అంతకంటే ఇంకేమీ కోరను. కోడలిని, పిల్లలని కూడా తీసుకురా! ఇక ఉంటాను ఆశీస్సులతో...

నీ తల్లి

కాంతమ్మ

**మాతా గురుతరా భూమేః**


(తల్లి భూమి కంటే గొప్పది)

V4N7J5

# 8. మేలుకొలుపు (పద్యభాగం)

S1Y9D1

**వినడం - ఆలోచించి మాట్లాడడం**



1. చిత్రం గురించి మాట్లాడండి.
2. రాజుల కాలం నాటికి, ఇప్పటికి మన దేశంలో వచ్చిన మార్పు ఏమిటి?

**ఉద్దేశం:** మన భారతదేశం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక. స్వాతంత్ర్యానికి ముందు నిమ్నజాతుల పరిస్థితిని, ఆనాటి వారి ఆకాంక్షను తెలియజేయడమే ఈ పాఠ్యాంశ ఉద్దేశం.

**కవి పరిచయం**

## కుసుమ ధర్మన్న
(17.3.1900 నుండి 1946)



రాజమహేంద్రవరంలోని లక్ష్మీవారపుపేటలో కుసుమ నాగమ్మ, వీరస్వామి దంపతులకు జన్మించారు. వైద్య విద్వాన్, సంస్కృతం, ఆంధ్రం, ఆంగ్లం, హిందీ, ఉర్దూలలో పాండిత్యం గలవారు. 'నిమ్నజాతి ముక్తి తరంగిణి', 'నల్లదొరతనం', 'హరిజన శతకం', 'మాకొద్దీ నల్లదొరతనం' వంటి రచనలు చేశారు. దళిత వర్గం నుంచి అతికష్టం మీద చదువుకుని పైకొచ్చి, తిరిగి ఆ చదువును తన జాతి మేలుకోసం వెచ్చించిన అతికొద్ది మంది దళిత విద్యావంతుల్లో ఒకరు. చదువుకున్న రోజుల్లోనే సంఘసంస్కరణ అభిలాష కలిగి కందుకూరి వీరేశలింగం చేత ప్రభావితం అయ్యారు. భారతరత్న డా. బాబా సాహెబ్ అంబేద్కర్ ద్వారా స్ఫూర్తి పొంది అంటరానితనాన్ని నిర్మూలించాలనే లక్ష్యంతో తపించిన తొలితరం తొలి దళిత కవి. కుసుమ ధర్మన్న రచించిన హరిజన శతకం అనుబంధం నుండి గ్రహింపబడినది.

# మేలుకొలుపు

1. సీ॥ కాళిదాసాది సత్కవి పుంగవుల గాంచి
   విద్యావతి యన నేవెలది యొప్పె?
   రణశూరులగు కృష్ణరాయాదులను గని
   వీరమాత యన నేనారి తనరె?
   నతుల కాశ్యాది పుణ్యక్షేత్రములు గల్గి
   పుణ్యవతియన నేపొలతి నెగడె?
   కొహినూరు మొదలగు మహిత మణులనీని
   రత్నగర్భయన నేరామ వెలసె?

   తే॥గీ॥ నట్టి సద్గుణసంఘాత యఘ విదూర
   సన్నుతివ్రాత విపుల తేజస్సమేత
   బహుళ విఖ్యాత యాచక పారిజాత
   భద్రముల మీకొసగుగాత భరతమాత.


2. సీ॥ దీన జాతుల దుర్గతిగని ఘోషిలు భార
   తాంబ దుర్భర దుఃఖమణగు వఱకు
   నిమ్నులు కురియు కన్నీటి మున్నీరు సం
   పూర్ణంబుగా నింకిపోవువఱకు
   అస్పృశ్యతాబాడబానల జ్వాల ది
   గంత భూములకు జల్లారువఱకు
   జాతిభేద చ్ఛిన్న సకలాంగకంబులు
   సంచితాకృతి ధరియించు వఱకు

   తే॥గీ॥ ధర్మమున కడ్డుపడెడు మదత్రయంబు
   హైందవుల డెందముల నాశమందు వఱకు
   ప్రథిత మంగళదత్త స్వరాజ్యరథము
   తెంపు సాగింతురే భారతీయ హితులు

3. తే॥గీ॥ మేలుకొనుమయ్య తరుణము మించకుండ
   జన్మహక్కులకై పోరుసల్పు మిపుడె
   హక్కుకై ప్రాణమిడుట ద్రోహంబు కాదు
   స్వర్గపదమని నమ్ముము స్వాంతమందు




4. తే॥గీ॥ పరుల ధన మాన ప్రాణ సంపదల ద్రుంచి
మనుచునుండుట పాతకంబని దలంచు
వారలెందున ధన్యులు వారికెల్ల
నంకితమొనర్తు దానినేనధికభక్తి
దేశమున శాంతి చేకూరి తేజరిలగ



## భావాలు

1. సకల సద్గుణరాశి మన భరతమాత. ఈమె అందరి పాపాలను దూరం చేసేది. చక్కని పొగడ్తలు గలది. గొప్ప తేజస్సు కలది. అనేక విధాలుగా కీర్తి కలది. కోరిన వరాలనిచ్చే పారిజాత వృక్షం వంటిది. కాళిదాసు మొదలైన గొప్ప కవులను కన్న విద్యావతి. కృష్ణదేవరాయలు వంటి వీరులను కన్న వీరమాత. కాశీ వంటి పుణ్యక్షేత్రాలు ఉన్న పుణ్యభూమి. కోహినూరు వజ్రం వంటి మణులను కన్న రత్నగర్భ మన భరతభూమి. అటువంటి భరతమాత మీకు భద్రతను కల్గిస్తోంది.
2. దీనులైన తన సంతానాన్ని చూసి బాధపడుతున్న భరతమాత బాధ తగ్గేవరకు శుభప్రదమైన స్వరాజ్య రథాన్ని ధైర్యంతో నడపాలి. అణగారిన ప్రజల కన్నీటి సముద్రం ఆరిపోయేదాకా నడపాలి. అంటరానితనం అనే బడబాగ్ని చల్లారేదాకా సాగించాలి. జాతిభేదాలు పోయి, భరతమాత శరీర అవయవాలన్నీ సరిగ్గా రూపుదిద్దుకొనేవరకు సాగాలి. ధర్మానికి అడ్డుపడే మదత్రయం (విద్యాగర్వం, ధనగర్వం, కులగర్వం) నాశనమయ్యేవరకు భారతీయుల మేలును కోరేవారు స్వరాజ్య రథాన్ని నడపాలి.
3. ఓ దీనజనుడా! మేలుకో! సమయం దాటిపోనివ్వకు. ఈదేశంలో పుట్టిన నీకు అన్నిటిపై అందరిలా హక్కులున్నాయి. ఆ హక్కుల కోసం పోరాడు. హక్కుల కోసం పోరాటంలో ప్రాణం పోయినా పరవాలేదు. అదే స్వర్గం. దీనిని హృదయంలో నమ్ము.
4. ఇతరుల ధనాన్ని, గౌరవాన్ని, ప్రాణాలు, ఐశ్వర్యాన్ని నాశనం చేసి బతకడం మహాపాపం అనుకొనేవారు ధన్యులు. మన దేశానికి శాంతి కలిగేలాగా నేనటువంటి వారికే నా కవిత్వం అంకితం చేస్తాను. కవి జీవించిన కాలంలో స్వాతంత్ర్యపోరాటం దేశమంతా తీవ్రంగా వ్యాపించింది. త్వరలోనే స్వాతంత్ర్యం వస్తుందని కవి నమ్మకం. అయితే ఈ పోరాట స్ఫూర్తి అధికారం మార్పుతో ఆగిపోకుండా దేశంలో వేళ్ళూనుకుని ఉన్న అసమానతలు అంతమయ్యేవరకు కొనసాగాలని కవి ఈవిధంగా కోరుకున్నాడు.



**ఇవి చేయండి**

**ఉపాధ్యాయుడు చెప్పిన కింది పదాలను (ఉక్తలేఖనం) రాయండి.**

సత్కవి, విద్యావతి, కృష్ణరాయలు, పుణ్యక్షేత్రం, పుణ్యవతి, కోహినూరు, రత్నగర్భ, సద్గుణం, సన్నుతివ్రాత, బహుళవిఖ్యాత, భద్రము, దుర్గతి, ఘోషించు, దుర్భర దుఃఖం, మున్నీరు, పూర్ణంబు, అస్పృశ్యత, జ్వాల, జాతిభేదము, ఛిన్నం, సంచితాకృతి, మదత్రయంబు, ప్రథితము, స్వరాజ్యం, రథము, జన్మహక్కు ప్రాణం, ద్రోహం, స్వర్గం, ధన్యులు, స్వాంతంబు

## అవగాహన – ప్రతిస్పందన

1. ఈ పాఠంలో మీకు నచ్చిన పద్యం గురించి చెప్పండి.
2. హక్కులకై పోరాడటం గురించి నాలుగు వాక్యాలలో రాయండి.
3. కుసుమ ధర్మన్న కవి గురించి రాయండి.
4. ఈ కింది అపరిచిత పద్యాన్ని చదవండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.

అన్నమయములైన వన్నిజీవమ్ములు
కూడులేక జీవకోటి లేదు;
కూడు తినెడికాడ కులభేదమేలకో!
కాళికాంబ! హంస! కాళికాంబ!



**ప్రశ్నలు**

అ) జీవులు దేనిమీద ఆధారపడి బ్రతుకుతాయి?

ఆ) కూడు లేకపోతే ఏమి లేదు?

ఇ) అన్నం తినేదగ్గర ఏ భేదం చూపించరాదని కవి అంటున్నాడు?

ఈ) పై పద్యం ఆధారంగా ఒక ప్రశ్న తయారుచేయండి.

## వ్యక్తీకరణ – సృజనాత్మకత

**అ) కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాలలో జవాబులు రాయండి.**

1. దీనజనుల హక్కులకోసం పోరాడటం నిజమైన స్వర్గమని పిలుపునిచ్చిన కవి గురించి రాయండి.
2. కవి, తన కవితను ఎవరికి అంకితమిస్తానన్నాడు ? ఎందుకు ?
3. భరతమాత దుఃఖానికి కారణం వివరించండి.



**ఆ) కింది ప్రశ్నలకు 8 నుండి 10 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. భరతమాత గొప్పతనాన్ని కవి ఏమని వర్ణించాడు ?
2. స్వరాజ్యరథం ఎప్పటిదాకా సాగాలని కవి భావించాడు ?
3. కింది కవితను పొడిగించండి.

భరతమాత మామాత

జగతినామె పరమ ........................ వైరము మాకు ...........................

గాంధీజీ మాకు .......................... ఆయన స్వాతంత్ర్యోద్యమ .................

మారుస్తాం దేశపు తల ..............................................................

## భాషాంశాలు

**అ) కింద గీతగీసిన పదాలకు అర్థాలు రాయండి. వాటితో సొంత వాక్యాలు రాయండి.**

ఉదా॥ మగవానితో సమానంగా <u>వెలది</u> ని గౌరవించాలి.

వెలది = స్త్రీ

స్త్రీలను గౌరవించడం మన సంప్రదాయం.

1. <u>రణం</u> నాశనానికి దారితీస్తుంది.

.....................................................................................

2. <u>అఘం</u> చేయకూడదు.

.....................................................................................

3. <u>సన్నుతి</u> విని పొంగిపోకు.

.....................................................................................

4. తలపోటు <u>దుర్భరంగా</u> ఉంటుంది.

.....................................................................................

**ఆ) కింద ఇచ్చిన పదానికి సమానార్థక పదాలు వాక్యాలలో ఉన్నాయి. వాటిని గుర్తించి రాయండి.**

1. జనని ప్రేమకు వెలకట్టలేము. బ్రహ్మయైనా మాతకు కొడుకే.
   తల్లి = .................., ..................
2. వెలదిని దేవతగా భావించి ఆ పొలతిని గౌరవించాలి.
   నారి = .................., ..................
3. తగిన సమయంలో తరుణమును అనుసరించి మాట్లాడాలి.
   కాలము = .................., ..................
4. పాతకం చేసేటపుడు ఆ దురితం వల్ల వచ్చే కష్టాలను ఊహించుకోవాలి.
   పాపము = .................., ..................

ఇ) కింది వానిలో ప్రకృతి, వికృతులను జతపర్చండి.

1) కవి ( ) (అ) విద్య
2) విద్దె ( ) (ఆ) కృష్ణుడు
3) కన్నడు ( ) (ఇ) కయి



ఈ) కింది పదాలకు వ్యతిరేకార్థక పదాలు రాయండి.

1) విద్య × ........................
2) పుణ్యం × ........................
3) సద్గుణం × ........................

## వ్యాకరణాంశాలు

అ) కింది ఖాళీలను పూరించండి.

| | సమాస పదం | | విగ్రహ వాక్యం | సమాసం పేరు |
|---|---|---|---|---|
| 1. | అక్కాచెల్లెళ్లు | = | ........................ | ద్వంద్వ సమాసం |
| 2. | ............... | = | తల్లియు తండ్రియు | ........................ |
| 3. | తండ్రీకొడుకులు | = | ........................ | ........................ |
| 4. | ............... | = | ధర్మమును, అధర్మమును | ద్వంద్వ సమాసం |
| 5. | పాపపుణ్యాలు | = | ........................ | ద్వంద్వ సమాసం |

ఆ) కింది వాక్యాలను సంశ్లిష్ట వాక్యాలుగా మార్చి రాయండి.

1. భరతమాత కవులను కన్నది. భరతమాత కవులను పెంచింది.

జ. ........................................................................................

2. హక్కులకై పోరాడాలి. హక్కులను సాధించాలి.

జ. ........................................................................................

3. దేశభక్తి కలిగిఉండాలి. దేశభక్తితో జీవించాలి.

జ. ........................................................................................

ఇ) సంధులు

రెండు పదాల మధ్య సంధి జరిగినపుడు మొదటి పదం చివర ఉండే అచ్చు పేరుతో ఆ సంధిని పిలుస్తాం. మొదటి పదం చివర 'ఉ' ఉంటే అది ఉత్వసంధి, 'అ' ఉంటే అత్వసంధి, 'ఇ' ఉంటే ఇత్వసంధి.

అత్వసంధి బహుళం కాబట్టి నాలుగు విధాలుగా సంధిరూపాలు ఏర్పడతాయి.

ఉదా: చూసినప్పుడు = చూసిన + అప్పుడు = న్ + అ + అ = అ

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1. | సీతమ్మ | = | సీత + అమ్మ | = | ........................ |
| 2. | చాలినంత | = | చాలిన + అంత | = | ........................ |
| 3. | వచ్చినందుకు | = | వచ్చిన + అందుకు | = | ........................ |
| 4. | సీత + అన్నది | = | సీతయన్నది (నిషేధరూపం) | | |
| 5. | మేనత్త | = | మేన + అత్త = మేనత్త (సంధి జరిగిన రూపం)<br>మేనయత్త (యడాగమ రూపం) | } వికల్పం | |
| 6. | ఒకానొక | = | ఒక + ఒక = (అన్యవిధముగా వచ్చిన రూపం) | | |

**ఈ) కింది అభ్యాసాలు పరిశీలించి రాయండి.**

1. తగినంత = ................. + .................
2. ............... = చూసిన + అప్పుడు
3. ఇచ్చినంత = ................. + అంత
4. చిన్నప్పుడు = చిన్న + .................



## చమత్కార పద్యం

పద్యం చదవగానే – వంగతోటలో, వరిమళ్ళలో, జొన్నచేలలో, తలుపు మూలలో, తలపైన ఉండేది ఏది? అనే ప్రశ్న ఉదయిస్తుంది. కానీ సమాధానం అక్కడే ఉంది. వంగ – తోటలోనే ఉంటుంది. వరి – 'మళ్ళ' లోనే ఉంటుంది. జొన్న – 'చేల' లోనే ఉంటుంది. తలుపు – ఇంటికి 'మూల'నే ఉంటుంది. తల – శరీరానికి 'మీద' నే ఉంటుంది.

**వంగతోటనుండు వరిమళ్లలోనుండు**
**జొన్నచేలనుండు చోద్యముగను**
**తలుపుమూల నుండు తలమీదనుండును**
**దీని భావమేమి తిరుమలేశ!**



## నేనివి చేయగలనా?



1. పాఠంలోని పద్యాలను ధారాళంగా చదవగలను. అర్థంచేసుకొని సొంతమాటలలో చెప్పగలను. ఔను / కాదు
2. పాఠంలోని పదాలను వాక్యాలలో ఉపయోగించగలను. ఔను / కాదు
3. భరతమాత గొప్పతనాన్ని సొంత మాటలలో చెప్పగలను. ఔను / కాదు
4. పాఠంలోని ప్రశ్నలకు జవాబులు సొంతమాటలలో రాయగలను. ఔను / కాదు

చదవండి - ఆనందించండి

# ఎక్కడ మనస్సు నిర్భయంగా ఉంటుందో...



- చలం అనువాదం


ఎక్కడ మనసు నిర్భయంగా ఉంటుందో,
ఎక్కడ మనుషులు తలెత్తి తిరుగుతారో,
ఎక్కడ జ్ఞానం విరివిగా వెలుస్తుందో,
సంసారపు గోడల మధ్య ఎక్కడ భాగాల కింద
ప్రపంచం విడిపోలేదో,
ఎక్కడ సత్యాంతరాళంలోంచి పలుకులు బైలు
వెడలతాయో,
ఎక్కడ అలసట నెరగని శ్రమ తన బాహువుల్ని
పరిపూర్ణతవైపు జాస్తుందో,
ఎక్కడ నిర్జీవమైన ఆచారపు టెడారిలో స్వచ్ఛమైన
బుద్ధి ప్రవాహం ఇంకిపోకుండా ఉంటుందో,
ఎక్కడ మనసు నిరంతరం వికసించే భావాలలోకీ,
కార్యాలలోకీ నీచే నడపబడుతుందో,
ఆ స్వేచ్ఛా స్వర్గానికి, తండ్రీ, నా దేశాన్ని మేల్కొలుపు



## రవీంద్రనాథ్ ఠాగూర్

కవి పరిచయం

(07.05.1861 -07.08.1941)




విశ్వకవి, చిత్రకారుడు, సంగీతకర్త. విద్యావేత్త. బెంగాలీ, ఇంగ్లీషులో అన్ని సాహిత్య ప్రక్రియలలోనూ విస్తృతంగా రచనలు చేశారు. 1913లో ఆయన రచించిన గీతాంజలికి నోబెల్ సాహిత్య బహుమానం పొందారు. జాతీయోద్యమ కాలంలో దేశాన్ని మేలుకొలిపిన మహనీయుడు. పై కవిత గీతాంజలిలోనిది.

## గుడిపాటి వెంకట చలం

కవి పరిచయం

(18.5.1894 -04.05.1979)




కవి, కథా రచయిత, నవలాకారుడు, నాటక కర్త, వ్యాసకర్త. తెలుగు వచనాన్ని సానబట్టిన రచయిత. స్త్రీ స్వేచ్ఛ గురించి, సమానత్వాన్ని గురించి పరితపించారు. ఉపాధ్యాయుడిగా, పాఠశాలల పర్యవేక్షకుడిగా తాను గమనించిన అంశాలను దృష్టిలో పెట్టుకుని 'బిడ్డల శిక్షణ' అనే పుస్తకాన్ని రాశారు. విద్యను, పెంపకాన్ని మేళవించవలసిన అవసరాన్ని గుర్తించిన అరుదైన పిల్లల ప్రేమికుడు.

# 9. ధర్మ నిర్ణయం

T8E7W8


## వినడం – ఆలోచించి మాట్లాడడం




1. చిత్రాలను చూసి కథ చదవండి, మాట్లాడండి.

**ఉద్దేశం:** ధర్మం కోసం కన్నకొడుకుకే మరణశిక్ష విధించిన మేటిరాజు మాధవవర్మ. ఆయన ధర్మనిరతిని తెలియచేయడం ఈ పాఠం ఉద్దేశం.

విశ్వనాథ సత్యనారాయణ 'ఆంధ్రప్రశస్తి', 'శ్రీకనకదుర్గ ఆలయ స్థల మహాత్మ్యం' ఈ పాఠానికి ఆధారం.




# ధర్మ నిర్ణయం

అది విజయవాడ కోటవీథి. సాయంకాల సమయం. ఆ నగర వీథిలో రాజభటులు కోలాహలంగా తిరుగుతున్నారు. 'రాకుమారుడు విహారానికి వెళుతున్నాడు. దారి తొలగండి, దారి తొలగండి' అంటూ ప్రజలను హెచ్చరిస్తున్నారు.

రాకుమారుడు పదివేల సువర్ణ నాణేలనిచ్చి మేలుజాతి గుర్రాలను కొన్నాడు. అరేబియా దేశానికి చెందిన ఆ గుర్రాలు వేగంలో గాలితో పోటీపడతాయి.

ఆ అశ్వాలను పూన్చిన రథంపై విహారానికి బయలుదేరాడు రాకుమారుడు. పట్టాభిషేకం జరగబోతున్నదన్న ఉత్సాహంతో ఉరకలేస్తున్నాడు. మేఘగంభీర ధ్వనితో రథం దూసుకువచ్చింది.

వాటికి కట్టిన గుర్రాలు వాయువేగంతో పరుగిడుతున్నాయి. మెరుపు వేగంతో క్షణంలోనే ఆ ప్రదేశాన్ని దాటిపోయింది రథం. ఆ రథచక్రాల కిందపడి ఒక యువకుడు అసువులు బాశాడు. ప్రజలందరూ చుట్టూ చేరి తమ సానుభూతిని తెలియచేశారు. ఇంతలో అక్కడికి చేరుకుంది ఆ యువకుని తల్లి. కొడుకు ఆకస్మిక మరణానికి ఆ తల్లి గుండె పగిలింది. ఈలోపు సూర్యుడు అస్తమించాడు.



మరునాడు ఉదయం ఎప్పటిలాగే ప్రశాంత వదనంతో మూర్తీభవించిన ధర్మంలాగా కొలువుదీరాడు ప్రభువు మాధవవర్మ. అతడు ప్రజానురంజకుడు, ధర్మబుద్ధి, ఆశ్రితవత్సలుడు, ఆపన్నుల పాలిట కల్పవృక్షం.

ఆ సమయంలో శోకదేవతలాగా ఒక వృద్ధురాలు సభలోకి ప్రవేశించింది. నెత్తురు అట్టలుకట్టిన కుమారుని మృతదేహాన్ని రాజుముందుంచింది. "ఓరాజా! నాకు ఇతడొక్కడే కొడుకు. మా కుటుంబానికి ఇతడే ఆధారం. మీ కుమారుని రథచక్రాలకింద పడి మరణించాడు. ఏ దిక్కూలేని నాకు మీరే న్యాయం చేయాలి" అంటూ సొమ్మసిల్లిపోయింది. ఆమెకు సపర్యలు చేయమని


ఆజ్ఞాపించాడు రాజు. న్యాయాధికారులను, ప్రధానమంత్రిని ఉద్దేశించి ధర్మనిర్ణయం చేయమని ఆనతిచ్చాడు.

న్యాయమూర్తులు సుదీర్ఘంగా విచారించారు. నగరవీధిలో పసివారుంటారు, నిస్సహాయులెందరో ఉంటారు. మదించిన గుర్రాలను కట్టిన రథంపై రాకుమారుడు నగర వీథులలోకి పోకూడదు.

ప్రాణాపాయం కలుగుతుంది. యువరాజు ఎక్కిన రథం వేగానికి ఒక ప్రాణం బలిఅయింది. మరణశిక్ష తప్ప దీనికి మరో మార్గం లేదు. న్యాయశాసనాలకు రాజకుమారుడనికాని, సామాన్యుడనికాని భేదముండదు. ఇక్కడ బంధుప్రీతికి చోటు లేదు అని న్యాయమూర్తులు చెప్పారు. తీర్పు వింటున్నంతసేపూ మహారాజు ముఖం ప్రశాంతంగానే ఉంది. మధ్యాహ్న సమయం సూచిస్తూ గంట మోగింది. సభ చాలించాడు. సింహాసనం దిగాడు. సింహాసనంపై ఉన్నంతసేపూ గంభీరంగా ఉన్నాడు.

గద్దె దిగగానే పుత్రవాత్సల్యం పెల్లుబికింది. హృదయంలో బాధ కట్టలు తెంచుకుంది. దుఃఖవివశు డయ్యాడు. మంత్రులు రాజును అంతఃపురానికి చేర్చారు. అపుడు రాజుతో ఇలా అన్నారు. "న్యాయమూర్తుల తీర్పును ప్రభువు మార్చవచ్చు. దుఃఖించవద్దు" అని ఓదార్చారు.

వివేకి, ధర్మాత్ముడు అయిన మాధవవర్మ "నేను నా ఏకైక కుమారుని గురించి బాధపడుతున్నాను. కాని ధర్మనిర్ణయం గూర్చి విచారించడం లేదు" అని పలికాడు. తనకు ధర్మకార్యాచరణే తప్ప స్వపరభేదం లేదని కుమారునికి మరణశిక్ష విధించాడు.



ఆ సాయంకాలమే ఆ శిక్షను అమలు చేశారు. "ధర్మో రక్షతి రక్షితః" - ధర్మాన్ని మనం రక్షిస్తే అది మనల్ని రక్షిస్తుంది అన్న సూక్తికి నిదర్శనంగా దుర్గామాత తన భక్తుడైన మాధవవర్మ పట్ల ప్రసన్నురాలైంది. ప్రభువు ధర్మనిరతికి సంతోషపడింది. ఇంతలో హఠాత్తుగా కొండపై ఓ గర్జింపుతో వాన మొదలైంది.

జలజలా కురుస్తోంది.

గలగలా కురుస్తోంది. ఆశ్చర్యం!

గడియపాటు ఎడతెరిపి లేకుండా విజయవాడ నగరమంతా బంగారు కాసుల వాన కురిసింది. బిలబిలమంటూ ప్రజలు వీధులలోనికి పరుగెత్తారు. అలా కనకవర్షం కురిపించిన దుర్గాదేవిని ఆనాటినుంచి కనకదుర్గగా పిల్చుకుంటున్నారు ప్రజలు.

దుర్గాదేవి అనుగ్రహంతో రాకుమారుడు, యువకుడు సజీవులయ్యారు. మాధవవర్మ ధర్మనిర్ణయాన్ని ప్రజలందరూ మెచ్చుకున్నారు. రాకుమారుడు తరువాత యువరాజుగా పట్టాభిషిక్తుడయ్యాడు.

**ఇవి చేయండి**

**ఉపాధ్యాయుడు చెప్పిన కింది పదాలను (ఉక్తలేఖనం) రాయండి.**

అశ్వం, నిశ్చేష్టితం, అన్యాయం, ఆజ్ఞ, దీర్ఘం, ధ్వని, గంభీరం, ఉత్సాహం, గుర్రం, ప్రశాంతం, ప్రభువు, రథం, ఆశ్రితం, వత్సలుడు, ధర్మనిర్ణయం, సొమ్మసిల్లు, రక్షితః.



## అవగాహన - ప్రతిస్పందన

1. మాధవవర్మ వంటి ధర్మాత్ములు ఇప్పుడు మనల్ని పరిపాలిస్తే ఎలా ఉంటుంది? మాట్లాడండి, చెప్పండి.
2. రాజకుమారుడు చేసిన పొరపాటు ఏమిటి ?
3. దుర్గాదేవి ఎందుకు ప్రసన్నురాలైంది ?



**4) కింది సంభాషణ చదవండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.**

**కెజియా** : సుప్రజా! సెలవుల్లో ఎక్కడి కెళ్ళావ్?

**సుప్రజ** : నేనా! మా కుటుంబంతో యాగంటి క్షేత్రం చూడటానికి వెళ్ళాను.

**కెజియా** : ఓహో! అలాగా ఆ పుణ్యక్షేత్రం ప్రత్యేకత ఏమిటో!

**సుప్రజ** : ఒకటేమిటి? అనేక ప్రత్యేకతల నిలయమది.

**కెజియా** : నిజమా! అవేమిటో చెప్పు.

**సుప్రజ** : 'యాగంటి' కర్నూలు జిల్లా నల్లమల కొండల్లో ఉంది. అత్యంత రమణీయ ప్రదేశం. సాధారణంగా శివాలయాల్లో శివుడు లింగరూపంలో ఉంటాడు. కానీ ఇక్కడ పార్వతీ పరమేశ్వరులు విగ్రహరూపంలో దర్శనం ఇస్తారు.

**కెజియా** : అలాగా!

**సుప్రజ** : ఔను! ఆలయం వెలుపల 'అగస్త్య పుష్కరిణి' అనే కొలను ఉంది. అందులో నీళ్ళు ఎంతో స్వచ్ఛంగా ఉన్నాయి. అంతేకాదు అక్కడ ఉన్న నంది విగ్రహం రోజురోజుకూ పెరుగుతూ ఉండటం ముఖ్యమైన విశేషం. అక్కడ మూడు సహజసిద్ధంగా ఏర్పడిన గుహలున్నాయి. వీరబ్రహ్మంగారు ఆ గుహల్లోనే కూర్చుని కాలజ్ఞానం రాశారట!

**పర్వీన్** : ఏంటి? మీరిద్దరూ మాట్లాడుకుంటూ ఉండిపోయారు. పదండి. బడికి వెళ్దాం! (ముగ్గురూ నిష్క్రమిస్తారు)

**ప్రశ్నలు**

(అ) యాగంటిలోని ఉమామహేశ్వరాలయానికి, మిగిలిన శివాలయాలకు తేడా ఏమిటి?
(ఆ) అగస్త్య పుష్కరిణి ప్రత్యేకత ఏమిటి?
(ఇ) కాలజ్ఞానం ఎవరు రాశారు ?
(ఈ) పై సంభాషణ ఆధారంగా ఒక ప్రశ్న తయారు చేయండి.

## వ్యక్తీకరణ - సృజనాత్మకత



**అ) కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాల్లో సమాధానాలు రాయండి.**

1. దుర్గాదేవిని కనకదుర్గగా ప్రజలెందుకు పిలుస్తున్నారు ?
2. మాధవవర్మ దృష్టిలో అందరూ సమానులేనని ఎట్లా చెప్పగలవు ?
3. పుత్రవాత్సల్యం అంటే ఏమిటి ?

**ఆ) కింది ప్రశ్నలకు 8 నుండి 10 వాక్యాల్లో జవాబులు రాయండి.**

1. విజయవాడలో బంగారు వర్షం ఎందుకు కురిసిందో వివరంగా రాయండి.
2. ధర్మపరాయణుడైన మాధవవర్మ గురించి సొంత మాటల్లో రాయండి.
3. కింద ఇవ్వబడిన పదాల ఆధారంగా కథను రాయండి.

   శిబిచక్రవర్తి - కొలువు - పావురం-డేగ - ప్రవేశించడం - శరణు - అభయం - ఇవ్వడం - తక్కెడ - తేవడం - తూచడం - సరితూగకపోవడం - సిద్ధమవడం - త్యాగనిరతి - ప్రజలు - మెచ్చుకోవడం - అగ్ని-ఇంద్రుడు - ప్రత్యక్షమవడం - ప్రవేశించడం.

## భాషాంశాలు

**అ) కింద గీత గీసిన పదాలకు అర్థాలు రాయండి. వాటితో సొంత వాక్యాలు రాయండి.**

ఉదా॥ శ్రీకృష్ణుని చేతిలో కంసుడు అసువులు వదిలాడు.

అసువులు = ప్రాణాలు

సమయానికి సరైన వైద్యం అందడంచేత ఒక వ్యక్తి ప్రాణాలు నిలిచాయి.

1. గడియ మాత్రంలోనే సత్య వంటపని ముగించింది.

   ..........................................................................................

2. పర మతాన్ని గౌరవించడం ధర్మం.

   ..........................................................................................

3. పూర్వం అశ్వాన్ని వాహనంగా ఉపయోగించేవారు.

   ..........................................................................................

4. సువర్ణ భూషణాలంటే అందరికీ ప్రీతి.

   ..........................................................................................

**ఆ) కింది వాక్యాలలో సమానార్థక పదాలు (పర్యాయ పదాలు) వెతికి రాయండి.**

1. వాసు గుర్రం ఎక్కి ఊరు బయలుదేరాడు. ఆ అశ్వం వేగవంతమైంది. గంట లోపలే హయం వల్ల ఊరు చేరిపోయాడు.
   1) ...................... 2) ...................... 3) ......................
2. సూర్యుడు తూర్పున ఉదయిస్తాడు. ఆదిత్యుని రశ్మి సోకి ప్రకృతి నిదుర లేచింది. రవి తాపాన్ని భరించడం సాధ్యం కాదు.
   1) ...................... 2) ...................... 3) ......................
3. అద్రిశిఖరం నుండి సెలయేరు జాలువారుతోంది. కొండపైన నగరం విస్తరించింది. ఆ పర్వతం మీదనే దేవాలయం వెలసింది.
   1) ...................... 2) ...................... 3) ......................

**ఇ) కింది ప్రకృతులను వికృతులతో జతపర్చండి.**

| | | | | |
|---|---|---|---|---|
| (1) | రథం | (అ) | ఆన | (  ) |
| (2) | కుమారుడు | (ఆ) | అరదం | (  ) |
| (3) | ఆజ్ఞ | (ఇ) | కొమరుడు | (  ) |

**ఈ) కింది వ్యతిరేకార్థక పదాలతో ఖాళీలను పూరించండి.**

(న్యాయం    అసామాన్యం    అస్తమిస్తాడు    దుఃఖం)

1. సూర్యుడు తూర్పున ఉదయిస్తాడు. పడమరన .........................
2. నా కుమారునికి అన్యాయం జరిగిందని అనుకుంటే .................... జరిగింది.
3. సుఖం ................ కావడి కుండలు అంటారు.
4. ప్రతి సామాన్య విషయం ఒక్కోసారి ................ గా మారుతుంది.

## వ్యాకరణాంశాలు

**అ) కింది పదాలను గమనించండి.**

1) నాలుగు ముఖాలు    2) మూడు కన్నులు    3) పంచ పాండవులు
4) ముల్లోకాలు    5) ఏడుద్వారాలు

పై పదాలన్నీ సమాస పదాలే. వాటిలో పూర్వపదం సంఖ్యను సూచిస్తోంది. ఉత్తరపదం నామవాచకాన్ని సూచిస్తోంది. సంఖ్యాపదం పూర్వపదంగా ఉండే సమాసాలను ద్విగుసమాసాలంటారు.

కింది వాక్యాల్లో ద్విగుసమాస పదాలున్నాయి గుర్తించి రాయండి.

1. వ్యాసుడు వేదాలను చతుర్వేదాలుగా విభజించాడు. (  )
2. శంకుస్థాపనలో నవధాన్యాలు వాడతారు. (  )
3. ఇంద్రధనుస్సులో సప్తవర్ణాలు ఉంటాయి. (  )

**ఆ) ముందటి పాఠాలలో అత్వసంధి పదాలను తెలుసుకున్నారు కదా! కింద ఇచ్చిన అత్వసంధి పదాలను విడదీయండి.**

1. చిన్నప్పుడు  2. తిరగకేమి  3. రామయ్య  4. జరగకేమి
5. రామక్క  6. సీతమ్మ

**ఇ) ఈ కింది సంధి పదాలను కలిపి రాయండి.**

1. రవ్వ + అంత
2. చింత + ఆకు
3. వెంక + అప్ప

**ఈ) సంయుక్త వాక్యం :**

సమప్రాధాన్యం గల రెండుగాని, అంతకంటె ఎక్కువ వాక్యాలు కలిస్తే సంయుక్తవాక్యం ఏర్పడుతుంది. ఇందులో అన్నీ ప్రధానవాక్యాలే ఉంటాయి. కాబట్టి, కాని, మరియు వంటి పదాలు వాక్యాలను కలుపుతాయి.

కింద ఇచ్చిన వాక్యాలను గమనించండి. సంయుక్త వాక్యాలుగా మార్చండి.

ఉదా॥ మధు బడికి వెళ్లాడు. రహీమ్ బడికి వెళ్ళాడు. జాన్ బడికి వెళ్ళాడు.

మధు, రహీమ్, జాన్ బడికి వెళ్ళారు.



1. సీత అక్క. గీత చెల్లెలు.
2. శారద సంగీతం నేర్చుకుంది. శారద నాట్యం నేర్చుకుంది.
3. నగీన్ స్టేషన్‌కి వెళ్లింది. రైలు వెళ్ళిపోయింది.
4. మాధవి పరుగెత్తింది. బస్సు అందలేదు.
5. వర్షాలు వచ్చాయి. చెరువులు నిండలేదు.

## ప్రాజెక్టుపని **(నాలుగవ నిర్మాణాత్మక మూల్యాంకనం కోసం)**

మీ ప్రాంతంలోని దర్శనీయ స్థలాలను గూర్చిన వివరాలు సేకరించి రాయండి.



## నేనివి చేయగలనా?



| | |
|---|---|
| 1. పాఠాన్ని ధారాళంగా చదవగలను. అర్థంచేసుకొని సొంతమాటలలో చెప్పగలను. | ఔను / కాదు |
| 2. పాఠంలోని పదాలను వాక్యాలలో ఉపయోగించగలను. | ఔను / కాదు |
| 3. ఇటువంటి కథను మరొకటి చెప్పగలను. | ఔను / కాదు |
| 4. పాఠంలోని ప్రశ్నలకు జవాబులు సొంతమాటలలో రాయగలను. | ఔను / కాదు |


చదవండి - ఆనందించండి

# నేరము - శిక్ష

ఓరోజు మా నాన్న, తనని బస్తీలో జరిగే ఒక సమావేశానికి కారులో తీసుకెళ్ళమనడంతో ఎగిరి గంతేశాను. ఎలానూ బస్తీకెళ్తున్నాను కాబట్టి మా అమ్మ తనకవసరమైన సరుకులపట్టీ ఇచ్చింది. పైగా రోజంతా బస్తీలోనే ఉండాలి కనుక కారు సర్వీసింగ్‌తో పాటుగా చేయాల్సిన ఇతర పనులు కూడా మా నాన్న అప్పగించారు. ఆ ఉదయం మా నాన్నను దిగబెట్టాక, 'సాయంత్రం 5 గంటలకు మళ్ళీ ఇక్కడికే రా, కలసి ఇంటికి వెళ్దాం...' అన్నారు నాన్న.

హడావిడిగా పనులన్నీ ముగించుకుని నేరుగా దగ్గరలోని సినిమాహాల్‌కి వెళ్ళాను. సినిమాలో జాన్ వేన్ చేసిన ద్విపాత్రాభినయంలో లీనమవ్వడంతో సమయం గుర్తులేదు. నాకు గుర్తొచ్చేప్పటికి సాయంత్రం 5.30 గంటలయింది. నేను గారేజ్‌కి పరిగెత్తుకెళ్ళి కారు తీసుకుని నాకోసమే ఎదురుచూస్తున్న మా నాన్నను చేరేటప్పటికి సాయంత్రం 6.30 గంటలయ్యింది. 'ఎందుకు ఆలస్యమయింది?' అని ఆత్రుతతో నాన్న అడిగారు.

జాన్ వేన్ సినిమా చూశానని ఆయనకు చెప్పటానికి సిగ్గుపడ్డ నేను, ఆయన అప్పటికే గారేజ్ వారితో మాట్లాడి ఉన్న విషయం తెలియక, 'కారు సిద్ధం కాలేదు, నేను వేచి ఉండాల్సి వచ్చింది' అన్నాను.



అబద్ధం చెప్తూ పట్టుబడ్డ నాతో ఆయన 'నాతో నిజం చెప్పేందుకు ధైర్యం లేకపోయింది నీకు. నిన్ను పెంచటంలో నేనేదో తప్పు చేశాను. నేను ఎక్కడ తప్పుచేశానో తెలుసుకునేందుకు 18 మైళ్ళు నడిచి ఇంటికి వెళ్తున్నాను. దాని గురించి ఆలోచించు' అన్నారు. సూటూ, బూటూ వేసుకుని దర్జాగా ఉన్న ఆయన, చీకట్లో, దీపాలు లేని, ఆ గతుకుల రోడ్డు మీద నడవడం ప్రారంభించారు.

ఆయనను వదిలి వెళ్ళలేని నేను, బుద్ధి తక్కువగా నేను ఆడిన అబద్ధం వల్ల ఆయన అనుభవిస్తున్న ఆవేదనను చూస్తూ, ఐదున్నర గంటలపాటు ఆయన వెనకే, కారు నడుపుకుంటూ వెళ్ళాను. అప్పటికప్పుడే, అక్కడికక్కడే ఇక మళ్ళీ అబద్ధమాడకూడదని గట్టిగా నిర్ణయించుకున్నాను.


మనం మన పిల్లలను తిట్టీ - కొట్టీ శిక్షించే పద్ధతిలో ఆయన నన్ను శిక్షించి ఉంటే, నేనీ పాఠాన్ని నేర్చుకుని ఉండేవాడనా? అని అప్పుడప్పుడు ఈ సంఘటనను గురించి ఆలోచిస్తూ ఆశ్చర్యపోతుంటాను. నేర్చుకుని ఉండేవాడను కానని నా నమ్మకం. ఆ శిక్షను అనుభవించి మళ్ళీ ఎప్పటిలాగే అదే పని చేసి ఉండేవాడిని. కానీ, ఈ ఒక్క అహింసాచర్య ఎంత శక్తిమంతమైనదంటే, అది నిన్ననే జరిగినట్లుగా అనిపిస్తుంది. అహింసకున్న శక్తి అటువంటిది.

C1R6N6

# 10. త్రిజట స్వప్నం

H8X5N6

## వినడం - ఆలోచించి మాట్లాడడం




1. చిత్రంలో ఎవరెవరున్నారు ?
2. పాప ఎందుకు బాధపడుతూంది ?
3. అన్నయ్య చెల్లికి ఎలాంటి మాటలు చెబుతున్నాడు?


**ఉద్దేశం:** కష్టాల్లో ఉన్న వీళ్ళను మంచి మాటలతో ఓదార్చాలే తప్ప నిష్ఠురమైన మాటలతో బాధించకూడదనీ, రాక్షస స్త్రీలలో కూడా త్రిజటలాంటి మంచివాళ్ళు ఉంటారని తెలియజేయడమే ఈ పాఠం ఉద్దేశం.

**కవయిత్రి పరిచయం**

### ఆతుకూరి మొల్ల (16వ శతాబ్దం)



కడప జిల్లాలోని గోపవరంలో జన్మించారు. రామభక్త కవయిత్రి. 'మొల్ల రామాయణం' రాశారు. ఈ రామాయణంలో 871 గద్య, పద్యాలు ఉన్నాయి. స్త్రీ విద్యకు దూరంగా ఉన్న రోజుల్లో మొల్ల రామాయణాన్ని చక్కని పదాలతో, సరళంగా, రమణీయంగా రాశారు. తెలుగు సాహితీవనంలో పద్యాలనే మల్లెల పరిమళాలను వెదజల్లి చిరకీర్తిని మూటగట్టుకున్న కవయిత్రి. ఈ పాఠం మొల్ల రాసిన రామాయణంలోని సుందరకాండ లోనిది.



# త్రిజట స్వప్నం

మ॥ కలగంటిన్ వినుఁడింతులార! మన లంకాద్వీప మీయబ్ధి లో
పల వ్రాలన్, మన రావణేశ్వరుని శుంభద్రత్నకోటీరముల్
కలనన్ గూల రఘూద్వహుండెలమితో గంధద్విపం బెక్కి, యు
జ్జ్వలకాంతిన్ విలసిల్లుసీతఁ గొనిపోవన్ మిన్నకే నిప్పుడే 1

క॥ శుద్ధాత్ముఁడైన రాముఁడు
శుద్ధాంతపుదేవిఁ గానశుభసూచకముల్
శుద్ధమయి తోఁచుచున్నవి
సిద్ధం బీమాట వేదసిద్ధాంతముగాన్ 2

క॥ కావున నిక్కోమలియెడఁ
గావలి యున్నట్టిమీరు కఠినోక్తులు గా
నేవియు నాడకుఁ డిఁక నీ
దేవియ రక్షింప మనకు దిక్కగు మీఁదన్ 3

వ॥ అని చెప్పి మఱియును 4

క॥ అమ్మా వెఱవకు మదిలో
నిమ్మగ మఱి వేడ్క నుండు మిఁక, నీ మగఁడున్
నెమ్మిగ నినుఁ గొనిపోవును
మమ్మందఱ మనుపు మమ్మ! మఱవక కరుణన్ 5

ఆ॥వె॥ అనుచు దనుజ కాంతలంతంత నెడఁబాసి
నిదుర వోయి రంతనదరి సీత
తనకు దిక్కు లేమిఁ దలపోసి దుఃఖింపఁ
బవనసుతుఁడు మనుజ భాషఁ బలికె 6

క॥ ఉన్నాఁడు లెస్స రాఘవుఁ
డున్నాఁ డిదె కపులఁ గూడి, యురుగతి రానై
యున్నాఁడు, నిన్నుఁ గొని పో
నున్నాఁ డిది నిజము నమ్ము ముర్వీతనయా! 7



## భావాలు

1. "ఓ స్త్రీలారా! వినండి. నేను కలగన్నాను. ఆ కలలో లంకాద్వీపం సముద్రంలో మునిగిపోయింది. మన ప్రభువు తలలపై ప్రకాశించే రత్నకిరీటాలు నేలపై పడ్డాయి. రాముడు ఆనందంతో ఉన్నాడు. మదించిన ఏనుగును ఎక్కాడు. కాంతితో ప్రకాశిస్తున్న సీతాదేవిని తీసుకుని వెళుతున్నాడు" అని అప్రయత్నంగా తనకు కలిగిన కలను త్రిజట వివరించింది.

2. రాముడు పవిత్రమైన మనస్సు కలిగినవాడు. సీత పవిత్రమైన స్వభావం కలది. కాబట్టి శుభాన్ని కలిగించే దృశ్యాలు కనిపిస్తున్నాయి. ఈ విషయం నాలుగు వేదాల నిర్ణయం కాబట్టి పవిత్రమైనది.

3. అందువల్ల సీతాదేవిని రక్షిస్తున్న మీరు కఠినంగా మాట్లాడవద్దు. ఇకమీదట ఈ సీతాదేవి వల్లనే మనం రక్షింపబడతాము.

4. అని చెప్పి ఇంకా ఇలా అంది.

5. "అమ్మా! భయపడవద్దు. మనసులో ఆనందాన్ని నింపుకుని సుఖంగా ఉండు. నీ భర్త ప్రేమతో నిన్ను తీసుకొని వెళతాడు. తప్పక దయతో మమ్మల్ని కాపాడు."

6. అంటూ రాక్షస స్త్రీలు దూరంగా జరిగి నిద్రపోయారు. సీత తనకు సమీపంలో రక్షించేవారు ఎవరూ లేరనే భావనతో దుఃఖించింది. అప్పుడు ఆంజనేయుడు మానవ భాషలో ఇలా పలికాడు.

7. భూ పుత్రివైన ఓ సీతాదేవీ! నీకు రక్షకుడైన శ్రీరాముడు క్షేమంగా ఉన్నాడు. ఇప్పుడే వానరులతో కలిసి తగినవిధంగా రావడానికి, నిన్ను తీసుకొని పోవడానికి సిద్ధంగా ఉన్నాడు. ఇది వాస్తవం. నామాట నమ్ము.

## ఇవి చేయండి

**ఉపాధ్యాయుడు చెప్పిన కింది పదాలను (ఉక్తలేఖనం) రాయండి.**

త్రిజట, ఇంతి, ద్వీపము, ఉజ్జ్వల, పవనసుతుడు, హనుమంతుడు, రావణేశ్వరుడు, శుద్ధాత్ముడు, శుభసూచకం, కోటీరము, సిద్ధాంతం, ఉరుగతి, ఇమ్ముగ, దనుజులు, రాఘవుడు, అబ్ధి.



## అవగాహన – ప్రతిస్పందన

1. పాఠంలోని పద్యాల భావం సొంత మాటలలో చెప్పండి.
2. త్రిజటకు లంకను గురించి ఏమని కల వచ్చిందో రాయండి.
3. త్రిజట స్వప్నం పాఠ్యభాగ నేపథ్యం రాయండి.
4. కింది పద్యాన్ని చదివి, అడిగిన ప్రశ్నలకు జవాబులు రాయండి.

తనవారు లేనిచోటను
జనవించుక లేనిచోట, జగడము చోటన్
అనుమానమైనచోటను
మనుజునకు న్నిలువదగదు మహిలో సుమతీ!



**ప్రశ్నలు**

అ) తనవారు అంటే ఎవరు ?
ఆ) జగడం అంటే ఏమిటి ?
ఇ) ఈ పద్యం ఏ శతకంలోనిది ?
ఈ) మనిషి ఎక్కడెక్కడ నివసించకూడదు ?



## వ్యక్తీకరణ – సృజనాత్మకత

**అ) కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాలలో జవాబులు రాయండి.**

1. త్రిజట తోటి రాక్షస స్త్రీలతో సీతాదేవిపట్ల ఎలా నడచుకోవాలని చెప్పింది ?
2. కవయిత్రి మొల్ల గురించి మీకు తెలిసిన విషయాలు రాయండి.
3. తనను రక్షించేవారు లేరని బాధపడుతున్న సీతాదేవిని హనుమంతుడు ఏమని ఓదార్చాడు?

**ఆ) కింది ప్రశ్నలకు 8 నుండి 10 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. త్రిజట తన కలలో వచ్చిన అంశాలను తోటి వారితో ఎలా వివరించిందో మీ సొంత మాటల్లో రాయండి.
2. త్రిజట సీతను ఎలా ఓదార్చింది? ఆతరువాత ఏం జరిగిందో వివరించండి.
3. రాష్ట్రస్థాయి ఆటలపోటీకి ఎన్నికై గెలుపు గురించి ఆందోళన చెందుతున్న మీ మిత్రుడికి ధైర్యం చెబుతూ లేఖ రాయండి.

## భాషాంశాలు

**అ) కింద గీతగీసిన మాటలకు అర్థాలను రాయండి. వాటితో సొంతవాక్యం రాయండి.**

ఉదా॥ ఆ చెట్టు కింద ఉన్న ఇంతి సీతాదేవి.

ఇంతి = స్త్రీ

మనం స్త్రీలను గౌరవించాలి.

1. రావణుని తలపైనున్న కోటీరం నేలపై పడింది.

   ..........................................................................................

2. ఈ ఉర్వి పై మనమంతా నివసిస్తున్నాము.

   ..........................................................................................

3. సీతాదేవి భర్త అయిన రాఘవుడు వస్తాడు.

   ..........................................................................................

4. శ్రీరాముడు లెస్స గా ఉన్నాడు.

   ..........................................................................................

**ఆ) కింది వాక్యాలను చదవండి. ప్రతి వాక్యంలోను ఒక పదానికి అదే అర్థం వచ్చే మరొక పదం ఉన్నది. ఆ పదాలకింద గీతగీయండి.**

ఉదా: భూమిపై మనం నివసిస్తున్నాం. ఈ ధరణిలో మనతోపాటు అనేక ప్రాణులున్నాయి.

1. సీతను చూడగానే హనుమంతునికి సంతోషం కలిగింది. శ్రీరాముని గురించి వినగానే సీతమనసు ఎలమితో పొంగిపోయింది.
2. గురువు చెప్పిన మాట వినాలి. ఆ ఉక్తి మనకు మేలు చేస్తుంది.
3. చంద్రుడి కాంతి మనకు ఆనందాన్నిస్తుంది. ఆ వెలుగు ప్రకృతిని కూడా పరవశింప జేస్తుంది.
4. ఎవరైనా బాధలో ఉన్నప్పుడు వారిపై కరుణ చూపాలి. మనం చూపే దయ వారికి ఆ బాధను తగ్గిస్తుంది.

**ఇ) కింది పదాలకు ప్రకృతి, వికృతులను జతపరచి రాయండి.**

భాష, అమ్మ, నిద్ర, బాస, అంబ, నిదుర

| | ప్రకృతి | – | వికృతి |
|---|---|---|---|
| ఉదా: | భాష | – | బాస |
| 1. | ........... | – | ........... |
| 2. | ........... | – | ........... |

## వ్యాకరణాంశాలు

**ఈ) కింది పదాలను విడదీయండి.**

| | | | |
|---|---|---|---|
| ఉదా : | శుద్ధాత్ముడు | = | శుద్ధ + ఆత్ముడు |
| 1. | రామాలయం | = | ............. + .............. |
| ఉదా : | రవీంద్రుడు | = | రవి + ఇంద్రుడు |
| 2. | కవీంద్రుడు | = | ............. + .............. |
| ఉదా : | భానూదయం | = | భాను + ఉదయం |
| 3. | గురూపదేశం | = | ............. + .............. |
| ఉదా : | పిత్రూణం | = | పితృ + ఋణం |
| 4. | మాతౄణం | = | ............. + .............. |

పై మాటలలో ఈకింది మార్పు జరిగింది.

1. అ + ఆ = ఆ  2. ఇ + ఇ = ఈ  3. ఉ + ఉ = ఊ  4. ఋ + ఋ = ౠ

'అ–ఇ–ఉ–ఋ' అనే వర్ణాలకు అవే వర్ణాలు (సవర్ణాలు) కలిసినప్పుడు తప్పనిసరిగా దీర్ఘం రావడాన్ని 'సవర్ణదీర్ఘసంధి' అంటారు.

| | |
|---|---|
| 'అ' వర్ణానికి 'అ–ఆ' లు సవర్ణాలు. | 'ఇ' వర్ణానికి 'ఇ–ఈ' లు సవర్ణాలు. |
| 'ఉ' వర్ణానికి 'ఉ–ఊ' లు సవర్ణాలు. | 'ఋ' వర్ణానికి 'ఋ–ౠ' లు సవర్ణాలు. |

పైన సంధి జరిగిన పదాలు సంస్కృత పదాలు / సంస్కృత పదాల మధ్య జరిగే సంధులను 'సంస్కృత సంధులు' అంటారు.

**ఉ) కింది పదాలను విడదీయండి.**

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| ఉదా : | విద్యార్థి | = | విద్యా | + అర్థి | = | (ఆ + అ = ఆ) |
| 1. | కవీశ్వరుడు | = | ............. | + .............. | = | ( ) |
| 2. | కోటీశ్వరుడు | = | ............. | + .............. | = | ( ) |
| 3. | వధూపేతుడు | = | ............. | + .............. | = | ( ) |
| 4. | దేవాలయం | = | ............. | + .............. | = | ( ) |

**ఊ) కింది వాక్యాలను సంయుక్త వాక్యాలుగా మార్చండి.**

1. సీతకు ఆనందం కలిగింది.
   రామునికి ఆనందం కలిగింది.
   సంయుక్త వాక్యం : ..................................................................
2. త్రిజట బాధపడింది.
   ద్విజట బాధపడింది.

సంయుక్త వాక్యం : ..............................................................................

3. మీరు కఠినంగా మాట్లాడకండి.
మీరు కోపంగా మాట్లాడకండి.

సంయుక్త వాక్యం : ..............................................................................

4. హనుమంతుడు గొప్పవాడు.
హనుమంతుడు మంచి భక్తుడు.

సంయుక్త వాక్యం : ..............................................................................

5. అపర్ణ సంగీతం నేర్చుకుంది.
అపర్ణ నృత్యం నేర్చుకుంది.

సంయుక్త వాక్యం : ..............................................................................

### ఎ) ప్రశ్నార్థక వాక్యం

వాక్యంలో ప్రశ్నను సూచించే అర్థం ఉంటే దానిని ప్రశ్నార్థక వాక్యం అంటారు.

ఉదా : 1. త్రిజట ఏం మాట్లాడుతుంది?
2. సీత ఎందుకు బాధపడింది?

మీరు కొన్ని ప్రశ్నార్థక వాక్యాలు రాయండి.

..............................................................

..............................................................

### ఏ) ఆశ్చర్యార్థక వాక్యం

వాక్యంలో ఏదైనా ఆశ్చర్యం కలిగించే అర్థం వచ్చినట్లైతే దాన్ని ఆశ్చర్యార్థక వాక్యం అంటారు.

ఉదా : 1. ఆహా ! ఎంత బాగుందో !

2. ఔరా! సీతారాముల రథం ఎంత ముచ్చటగా ఉందో!

మీరు కొన్ని ఆశ్చర్యార్థక వాక్యాలను రాయండి.

..............................................................

..............................................................



## నేనివి చేయగలనా?



| | | |
|---|---|---|
| 1. | ఈ పాఠ్యభాగంలోని పద్యాలను రాగయుక్తంగా పాడగలను. | ఔను / కాదు |
| 2. | పద్యాలకు భావాలను సొంత మాటలలో చెప్పగలను, రాయగలను. | ఔను / కాదు |
| 3. | పాఠంలో ఇచ్చిన వాక్యాల రకాలు చెప్పగలను, రాయగలను. | ఔను / కాదు |
| 4. | పద్యాలలోని పదాలకు అర్థాలను నిఘంటువులో / అకారాది పట్టికలో చూసి తెలుసుకున్నాను. | ఔను / కాదు |

# పిచ్చుక నేర్పిన పాఠం

- వ్యక్తిత్వ వికాస కథలు

యువకుడొకడు ఒక జ్ఞాని వద్దకు వెళ్ళాడు.

అతడు జ్ఞానితో ఇలా అన్నాడు : "అయ్యా, ఈ ఊళ్ళో నాకు పని దొరకలేదు. ఇక్కడ నాకు ఆదాయానికి మార్గం ఏదీ లేదు. కాబట్టి నేను సుదూరంలో ఉన్న పెద్ద నగరానికి వెళ్ళి ఉద్యోగం చేసుకుంటాను. అందునిమిత్తం నేడే నేను మన ఊళ్ళోనుండి బయలుదేరుతున్నాను. నేను వెళ్ళే నగరంలో నాకు ఒక మంచి ఉద్యోగం లభించి అక్కడ నేను జీవితంలో స్థిరపడాలని నన్ను ఆశీర్వదించండి. అలాగే ఆ యువకుణ్ణి, జ్ఞాని మనసారా ఆశీర్వదించి పంపించాడు.

కొన్ని రోజులు గడిచాక జ్ఞాని అదే ఊళ్ళో ఆ యువకుణ్ణి మళ్ళీ చూసి ఆశ్చర్యపోయాడు.

ఆ యువకుడి వద్దకు వెళ్ళి, ఆ జ్ఞాని, "నాయనా! నువ్వు ఇంకా ఆ నగరానికి బయల్దేరి వెళ్ళలేదా? నువ్వు నన్ను కలుసుకున్న రోజునే, ఉద్యోగార్థం ఊరు విడిచి వెళుతున్నట్లు చెప్పావే?" అని అడిగాడు.

అందుకు ఆ యువకుడు ఇలా జవాబిచ్చాడు: "అయ్యా! నేను ఆరోజునే, అప్పుడే బయలుదేరాను. దారిలో నిర్మానుష్యమైన ఎడారి వంటి ప్రాంతం తారసపడ్డది. అక్కడున్న ఒక ఈతచెట్టు నీడన కాసేపు విశ్రాంతి కోసం కూర్చున్నాను.

"అక్కడ నేనొక దృశ్యం చూశాను.

"నేను కూర్చున్న చోటుకు కాస్త దూరంలో, ఒక చెట్టు కింద కాలు విరిగిన ఒక పిచ్చుక ఆకలితోనూ, అమిత బాధతోనూ నడవలేక తల్లడిల్లి పోతూండడం కంటపడింది. దాన్ని చూసి నేను 'ఈ పిచ్చుక దానంతట అదే ఎగిరి వెళ్ళి ఆహారం వెతుక్కోవడానికి దారి లేదే! ఇది ఎలా బతకగలదు?' అని ఆలోచిస్తూ ఉండిపోయాను.

"ఇలా నా ఆలోచనలు సాగుతూండగా, ఎక్కణ్ణుంచో ఒక పిచ్చుక ఎగిరి వచ్చింది. అది తన నోటితో ఆహారం తెచ్చి కాలు విరిగిన పిచ్చుక నోట్లో పెట్టి తినిపించింది.

"అది చూసి నేను, 'ఆహా! కాలు విరిగిన ఈ పిచ్చుకకు కూడా ఆహారం లభించడానికి, భగవంతుడు ఒక ఏర్పాటు చేసి ఉంచాడే! అలాంటప్పుడు, మనిషినైన నేను జీవించడానికి భగవంతుడు నాకొక ఏర్పాటు చెయ్యకుండా ఉంటాడా?' అని అనుకొని పయనం రద్దుచేసుకొని మన ఊరికే తిరిగి వచ్చేశాను."

అంతా విన్న ఆ జ్ఞాని, "నాయనా! నువ్వు ఎందుకు ఆ కాలు విరిగిన పిచ్చుకలా ఉండాలని ఆశిస్తున్నావు? తన శ్రమతో తన ఆహారాన్ని సముపార్జించుకొని, మరో పిచ్చుకకు కూడా ఆహారం తీసుకువచ్చిన ఔదార్యం గల ఆ రెండవ పిచ్చుకగా ఉండాలని నువ్వెందుకు ఆశించడం లేదు?" అని ప్రశ్నించాడు.



ఆ మాటలకు యువకుడికి కనువిప్పు కలిగింది.

'ఇతరుల శ్రమతో జీవించాలి' అనుకోవడం హీనాతిహీనం అని గ్రహించి కష్టపడి పనిచేయటం మొదలుపెట్టాడు. తన స్వకీయ శ్రమతో జీవిస్తూ ఇతరులకు కూడా సహాయ పడాలని ఆశించాలి, ఆకాంక్షించాలి. అప్పుడే మనిషి జీవితానికి సార్థకత చేకూరుతుంది.

U7M2R8

# 11. దూడూ బసవన్న



**వినడం - ఆలోచించి మాట్లాడడం**



1. పై సన్నివేశాలు ఏ పండుగరోజు కనిపిస్తుంటాయి ?
2. ఏ పండుగ సందర్భంలో హరిదాసు మీ ఇంటికి వస్తాడు ?
3. సంక్రాంతి పండుగరోజు ఇంకా మన ఇంటి ముంగిళ్ళ ముందు ఎవరు కనిపిస్తారు ?

**ఉద్దేశం:** గంగిరెద్దులవారి జీవన విధానాన్ని తెలియజేస్తూ, జానపద కళల పట్ల విద్యార్థులకు అవగాహన కలిగించడం ఈ పాఠం ఉద్దేశం.

**కవి పరిచయం**

## రావూరి భరద్వాజ (5.7.1927 - 18.10.2013)



గుంటూరు జిల్లా తాడికొండలో జన్మించారు. 'విమల' ఈయన రాసిన తొలి కథ. 'అపరిచితులు', 'కథాసాగరము' వంటి 37 కథా సంపుటాలు, 'ఉడుతమ్మ ఉపదేశం', 'కీలుగుర్రం' వంటి 43 పిల్లల కథలు, 'కరిమ్రింగిన వెలగపండు', 'జల ప్రళయం' వంటి 17 నవలలు రాశారు. వీరి 'పాకుడు రాళ్లు' నవలకు జ్ఞానపీఠ పురస్కారం లభించింది. కళా ప్రపూర్ణ, కేంద్రసాహిత్య అకాడమీ పురస్కారం, సోవియెట్ భూమి నెహ్రూ పురస్కారం, రాజాలక్ష్మీ ఫౌండేషన్ అవార్డు, గోపీచంద్ జాతీయ సాహిత్య పురస్కారం, కళారత్న (ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం), లోక్ నాయక్ ఫౌండేషన్ పురస్కారం వంటివి పొందారు. ప్రస్తుత పాఠ్యభాగం **'జీవనసమరం'** అనే వ్యథార్త జీవుల యథార్థగాథల పుస్తకం నుండి తీసుకోబడింది.

# డూడూ బసవన్న



"ప్రభువుగారికీ దణ్ణంబెట్టూ
పాదంవొంచీ దణ్ణం బెట్టూ
చాటెడు గింజలు ఇస్తారంటూ
చారెడు రూకలు ఇస్తారంటూ
దూ దూ దూ దూ బసవన్న
దూ దూ దూ దూ బసవన్న"

నాగరికత రోజురోజుకూ పెరుగుతున్నది. పెరగవలసిందే! అలా పెరుగుతున్నపుడు, కొత్త సంప్రదాయాలు, కొత్త విలువలూ వస్తాయి. ఇలా రావడంతో బాటుగా, పాత ఆచారాలు కొన్ని మరుగవుతాయి. అవుతున్నాయి. బొత్తిగా ఆచరణకు పనికిరానివీ, కాలంతోబాటు మారలేనివీ, ప్రయోజనం లేనివీ, మారినా, కనుమరుగయినా అంతగా బాధ ఉండదు. కానీ ఇలాంటి వాటిల్లో అంతో ఇంతో ఉండే అందచందాలు కూడా రూపుమాసి పోతున్నపుడే బాధవేస్తుంది. అలా క్రమంగా కనుదాటిపోతున్న వాటిల్లో గంగిరెద్దు ఒకటి.

గంగిరెద్దాట చాలా ప్రాచీనమయిందని చెప్పుకోవచ్చు. పరమేశ్వరుడంతటివాడు తన నందిచేత ఈ ఆట ఆడించాడు. మరి మహాచక్రవర్తులూ, యవన రాజులూ, రాజులూ, దేశమంతా చిత్తువత్తుగా ఉన్న రోజుల్లో ఈ ఆట మరింత దేదీప్యమానంగా ఉండేదేమో! ఎందుకనంటే, అప్పట్లో వెలువడిన పుస్తకాలు చూస్తూ ఉంటే వాటిల్లోని రాకుమారులూ, రాజకుమార్తెలూ ఈ గంగిరెద్దాటలు చూసి ఆనందించిన ఘట్టాలు కనిపిస్తాయి. ప్రారంభంలో ఇదొక వినోద క్రీడగా మొదలయినా, రానురాను గంగిరెద్దును ఆడించడం వొక వృత్తిగా మార్పు చెందింది. ఇప్పుడా వృత్తికి తిలోదకాలివ్వవలసి వచ్చిందంటున్నాడు బసవయ్య.

బసవయ్యది - చాలా పెద్ద కుటుంబం. ఆరుగురు అన్నదమ్ముల్లోనూ పెద్దవాడు. తండ్రి వెంట ఊరూరా తిరగడం, తండ్రిని గమనిస్తూ ఉండడం, ఆయన మాటల్ని, పద్ధతుల్ని అనుకరిస్తూ ఉండడంతో, చిన్నతనం నుండీ, ఈ ఆటలోని మెలకువలన్నీ అవగతమయ్యాయి. తండ్రి, "బసవా!" అని కేకవేసి, ఎద్దుచేత ఒక్కో మోళీ చేయిస్తున్నప్పుడు, బసవయ్య ఆ మోళీకి అనుగుణంగా 'రాండోలు' వాయించేవాడు.

"దాన్ని వాయించడం కష్టమండీ దొరగారూ! మామూలు డోలు వాయించడమంటే - ఒక చేత్తో డోలును కర్రను పట్టుకొని, మరో చేతివేళ్ళతో వాయించాలి. రాండోలును వాయించడానికి, రెండు చేతుల తోనూ, రెండు కర్రల్ని పట్టుకోవాలి. ఒక పుడకతో డోలు చర్మాన్ని రాపాడుతూ, మరో కర్రతో రెండోవేపున వరసలు వాయించాలి. నాకీ పని చిన్నప్పట్నించీ తెలుసునండీ!" అన్నాడు బసవయ్య.

తనూ, తన తండ్రీ తన చిన్నాన్నా కలిసి, అనేక వందల ఊళ్ళు తిరిగామన్నాడు బసవయ్య. తన బాబాయి శ్రుతిపోస్తూ, రాండోలు వాయించేవాడట. తను సన్నాయి వాయిస్తుంటే, తండ్రి గంగిరెద్దును ఆడించేవాడు. ఆ రోజుల్లో వారికో పెయ్యదూడ కూడా ఉండేది. అది గొడ్డుమోతు గొడ్డు.

"పోలేరమ్మ గుడి దగ్గరో, బొడ్డురాయి దగ్గరో 'గడివేసే వాళ్ళమండి. రెండుమూడు వందలమంది దాకా, చుట్టూ చేరేవారు. ఎద్దుచేత రకరకాల మోళీలు వేయించేవాడు మా నాన్న. ఆ ఎద్దు ముంగాళ్ళు వంచి, ముందుకు నడుస్తుంది. వెనక్కు జరుగుతుంది. ఒంటికాలితో దణ్ణం పెడుతుంది. "కాదు" 'అవును' అని తలతో సైగచేసేది. రాండోలు వాయిద్యానికి అనుగుణంగా గంతులు వేసేది, అలిగేది, కోపగించుకొనేది. ఆనందంతో చిందులు తొక్కేది. కోపంతో కాలు దువ్వి, తోకమట్ట ఎగబట్టి, రంకెలు వేసేది. ఏ పని చేయమంటే, ఆ పని, సుబ్బరంగా చేసేదండీ" అన్నాడు బసవయ్య.

సాధారణంగా గంగిరెద్దుల్ని కొనడమంటూ జరగదన్నాడు బసవయ్య. తప్పుడు సుడులున్న గిత్తల్నీ, పొగరుమోతు వాటినీ, పోట్ల కోడెల్నీ ఈ గంగిరెద్దులవాళ్ళకు ఇస్తూ ఉండేవారట. ముగుదాడు వేసీ, మూతికి చిక్కంగట్టి, కాళ్ళకు బంధాలు వేసి దాన్ని అంకెకు తెచ్చేవారుట. ఒక్కో గిత్త, మూడు, నాలుగు మాసాల కల్లా, విద్యలన్నీ నేర్చుకొంటే, మరొకదానికి నేర్పడానికి ఏడెనిమిది మాసాలు కూడా పడుతుందన్నాడు బసవయ్య.

"ముందుగా వినవండీ! దాన్ని సాదికలోకి తీసుకురావడం చాలా కష్టం! ఆట నేర్పేటప్పుడు - కొట్టక తప్పదండీ! నేర్చుకొన్న తరువాత కూడా వొక్కోసారి మొరాయించి, మా పరువు తీస్తుందండీ!" అన్నాడు బసవయ్య. ఆరోజుల్లో, ఒక్కో ఊళ్ళో, మూడేసి రోజులు మకాం వేస్తుండేవాళ్ళమనీ, ఊరి బయట, ఏ చెట్టుకిందనో ఉడకేసుకు తింటూ ఉండేవాళ్ళమనీ, ఏరైతు కొట్టం దగ్గరకెళ్ళినా, ఎద్దు మేతకు కరువుండేదికాదనీ చెప్పుకొచ్చాడు బసవయ్య.

"పోటీలుపడి ఆడించే వాళ్ళు బాబయ్యా! పాతపంచెలు, ఉత్తరీయాలు, చొక్కాలు, చీరెలు, రవికెలు, మూటెడు దొరికేవి. గంగిరెద్దుకీ, ఆవుకూ మేతా, దాణా - ఊరివాళ్ళు పోటీలమీద పంపించేవారు... క్రమంగా, చూస్తూ చూస్తూ ఉండగానే ఆ కాలం కళ్ళముందే దాటిపోయిందండీ! బస్తీల మొఖంచూసి, ఎన్నేళ్ళయిందోనండీ! మరీ మారుమూల పల్లెటూళ్ళను పట్టుకుని వేళ్ళాడుతున్నాం. ఇదివరకు చాటల్తో గింజలు పెట్టేవాళ్ళు. ఇప్పుడు గుప్పెళ్ళతో వేస్తున్నారు. లేదా 5 పైసలో 10 పైసలో పడేస్తున్నారు. నా తమ్ముళ్ళందరూ, కూలిపనో, నాలిపనో చేసుకుంటున్నారు. ఇదిగో నేనూ, మా లింగమయ్యా మాత్రం, ఇంకా బసవదేవుల్ని నమ్ముకొని బతుక్కొస్తున్నాం... అసలు మాదేవూరో, పొట్టచేత పట్టుకొని, ఊరూరా తిరిగే వాడికొక ఊరంటూ ఉంటే గడుస్తుందా బాబూ! ఏ ఊరు పచ్చగా ఉంటే అదే నావూరు. ఎక్కడ ధర్మప్రభువులుంటే, అదే నాఊరు", అన్నాడు బసవయ్య!

బసవయ్యకు ఐదుగురు పిల్లలు. పెద్దవాడు, తన రెండో తమ్ముడి దగ్గర ఉంటున్నాట్ట. మిగిలిన నలుగురూ, తనతోబాటే ఊరూరా తిరుగుతుంటారట.


"ఈ విద్య నాతోనే ఆఖరుసార్!" అన్నాడు బసవయ్య, గంగిరెద్దు గంగడోలును ఆప్యాయంగా నిమురుతూ. అలా అంటున్నప్పుడు అతని కళ్ళు నీటితో నిండిపోయాయి!



**ఇవి చేయండి**

**ఉపాధ్యాయుడు చెప్పిన కింది పదాలను (ఉక్తలేఖనం) రాయండి.**

ప్రభువు, సంప్రదాయాలు, ప్రయోజనం, గంగిరెద్దాట, మహాచక్రవర్తులు, చిత్తువత్తు, దేదీప్యమానం, రాజకుమార్తెలు, వినోదక్రీడ, వృత్తి, అన్నదమ్ములు, చర్మం, చిన్నప్పణ్ణించి, గొడ్డువోతు, ముంగాళ్ళు, పరమేశ్వరుడు, ఉత్తరీయం, ధర్మప్రభువులు, భరద్వాజ, ఆనందించిన ఘట్టం.



## అవగాహన - ప్రతిస్పందన

1. మీరు చూసిన లేదా విన్న ఏదైనా కళారూపం గురించి చెప్పండి.
2. గంగిరెద్దులవాళ్ళను చూసినప్పుడు రచయితకు ఎందుకు బాధ కలిగిందో రాయండి.
3. బసవయ్య గంగిరెద్దులు ఆడించడం ఎలా నేర్చుకున్నాడు ?

**4. కింది గద్యాన్ని చదవండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.**

సమాజ వినోదం కోసం ఏర్పడినవే జానపద కళారూపాలు. ఇవి కొండ గ్రామాలలో పుట్టి క్రమక్రమంగా ద్రావిడ దేశాలన్నింటా విస్తరించాయి. వీటిలో ప్రత్యేకమైనది కురవంజి. ఆటవికుల నుండి పుట్టిన ప్రాచీన జానపద కళారూపం కురవంజి. కురవలు అనేవారు ఏదో వినోదం కోసం ఆరంభించినా క్రమంగా అదే జీవనోపాధి అయింది. వీరు పుణ్యక్షేత్రాల దగ్గర వాటి స్థలపురాణాలను, పవిత్ర కథలు, గాథల్ని ఆశువుగా చెప్పి యాత్రికులను మంత్రముగ్ధులుగా చేసేవారు. యాత్రికులు వారి ప్రదర్శనకు మెచ్చి బహుమతులిచ్చేవారు. కురవంజి కాలానుగుణంగా అనేక రూపాంతరాలు చెందింది. ఏకపాత్రగా మారి ఎఱుక చెప్పే సోదెగా నేడు మిగిలింది. వారు సోదె చెప్పే విధానం అద్భుతంగా, ఆశ్చర్యంగా ఉంటుంది.

### ప్రశ్నలు

(అ) జానపద కళారూపాలు ఎందుకు ఏర్పడ్డాయి ?

(ఆ) కురవంజి ప్రదర్శనలో వేటి గురించి కురవలు చెప్పేవారు ?

(ఇ) కురవంజి ప్రస్తుతం ఏ కళారూపంగా మారింది ?

(ఈ) పై గద్యం ఆధారంగా ఒక ప్రశ్న తయారుచేయండి.





## వ్యక్తీకరణ - సృజనాత్మకత

**అ) కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాలలో జవాబులు రాయండి.**

1. "ఎక్కడ ధర్మప్రభువులుంటే అదే మాఊరు" అని బసవయ్య ఎందుకు అని ఉంటాడు ?
2. గంగిరెద్దాట ప్రాచీనమైనదని ఎలా చెప్పగలవు ?
3. గంగిరెద్దుల వాళ్ళదగ్గర ఏ వాయిద్యాలుంటాయి ? వాటిని ఎలా ఉపయోగిస్తారు?

**ఆ) కింది ప్రశ్నలకు 8 నుండి 10 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. గంగిరెద్దుల ఆట ఎలాఉంటుందో వర్ణిస్తూ రాయండి.
2. గంగిరెద్దులవాళ్ళు పల్లెటూళ్ళలోనే ఉండిపోవడానికి కారణాలు రాయండి.
3. మీకు నచ్చిన లేదా మీరు మెచ్చిన జానపద కళారూపాన్ని ప్రశంసిస్తూ రాయండి.



## భాషాంశాలు

**అ) కింది గీతగీచిన పదాలకు అర్థాలు రాయండి. వాటితో సొంత వాక్యాలు రాయండి.**

ఉదా॥ ఆరిఫ్ కుటుంబం శ్రీకాకుళంలో మకాం ఉంటుంది.

మకాం = నివాసం

ఎలుకలు బొరియలలో నివాసం ఉంటాయి.

1. రాబర్ట్ వాళ్ళ బామ్మ నన్ను ఎప్పుడూ ఆప్యాయం గా పలకరిస్తుంది.

   ......................................................................................

2. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణం గా మనం నడచుకోవాలి.

   ......................................................................................

3. కాలుష్యం ఎక్కువైతే ప్రకృతి అందాలు కనుమరుగు అవుతాయి.

   ......................................................................................

**ఆ) కింది పదాలకు సమానార్థక పదాలు (పర్యాయపదాలు) వెతికి రాయండి.**

ఉదా: నదులలో నీరు తియ్యగా, సముద్రంలో జలం ఉప్పగా ఉంటుంది.

ఉదకం : నీరు, జలం

1. సునీల తండ్రి గురవయ్య. వినయ్ జనకుడు స్వామి.

   నాన్న = .......................... ..........................

2. వృషభం, ఎద్దు, గోవు, ధేనువు, పాదపం.

   పై వాటిలో 'బసవన్న' అనే పదానికి సమానార్థక పదాలు గుర్తించి రాయండి.

3. మా విజ్ఞానయాత్ర మాకు ఆనందాన్ని, మా ఉపాధ్యాయులకు సంతసాన్ని పంచింది.
సంతోషం = ......................... .........................

**ఈ) కింది పదబంధాలకు విశేషార్థాలు చదవండి. వాటితో సొంత వాక్యాలు రాయండి.**

ఉదా॥ రూపుమాపు = నాశనం చేయు
మనం వరకట్న దురాచారాన్ని రూపుమాపాలి.

1. పట్టుకొని వేలాడు = వదిలిపెట్టకుండా ఉండు

.............................................................................................

2. కాలుదువ్వు = తగవుకు సిద్ధపడడం.

.............................................................................................

3. తిలోదకాలివ్వడం = సంబంధం లేదా అనుబంధం తెంచుకోవడం

.............................................................................................

## వ్యాకరణాంశాలు

**అ) కింది పదాలను విడదీసినప్పుడు వచ్చిన మార్పును గమనించండి.**

| | | | | |
|---|---|---|---|---|
| 1. మహేశ | = | మహా + ఈశ | = | ఆ + ఈ = ఏ |
| 2. మహోదధి | = | మహా + ఉదధి | = | ఆ + ఉ = ఓ |
| 3. రాజర్షి | = | రాజ + ఋషి | = | అ + ఋ = అర్ |

పై పదాలను పరిశీలించినప్పుడు పూర్వపదం చివర అ/ఆ అనే అచ్చులు ఉన్నాయి. పరపదంలో మొదటి అచ్చులుగా ఇ, ఉ, ఋ లు ఉన్నాయి. వాటి స్థానంలో క్రమంగా ఏ, ఓ, అర్ లు ఏకాదేశంగా వచ్చాయికదా!

అలాగే కిందనున్న పదాలను విడదీసి రాయండి.

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 1. | రాజేంద్ర | = రాజ + ఇంద్ర | = | అ + ఇ | = | ఏ |
| 2. | తిలోదకాలు | = .................. | = | ............ | = | ............ |
| 3. | మహర్షి | = .................. | = | ............ | = | ............ |



పరిశీలించండి.

అ / ఆ +
- ఇ = ఏ
- ఉ = ఓ
- ఋ = అర్

ఏ, ఓ, అర్ లను గుణములు అంటారు. ఇలా అకారానికి (అ, ఆ) "ఇ, ఉ, ఋ" లు (ఇ ఈ, ఉ ఊ, ఋ ౠ) పరమైతే క్రమంగా ఏ, ఓ, అర్ లు వస్తాయి. దీనినే గుణసంధి అంటారు.

**ఆ) కింది పదాలను విడదీసి సంధిపేరు రాయండి.**

1. పరోపకారం = ................ + ................ = ....................
2. రమేశ = ................ + ................ = ....................
3. జాతీయోద్యమం = ................ + ................ = ....................
4. దేవర్షి = ................ + ................ = ....................

**ఇ) కింది సంధి పదాలను విడదీసి సంధిపేరు రాయండి.**

1. సత్యాగ్రహం = ................ + ................ = ....................
2. గిరీశుడు = ................ + ................ = ....................
3. గురూపదేశం = ................ + ................ = ....................
4. పితౄణం = ................ + ................ = ....................

**ఈ) కింది పదాలను కలిపి సంధిపేరు రాయండి.**

1. శైల + అగ్రం = ....................... = .........................
2. ముని + ఇంద్రుడు = ....................... = .........................
3. మధు + ఊహ = ....................... = ..........................

**ఉ) కింది ద్వంద్వ సమాస పదాలకు విగ్రహ వాక్యాలు రాయండి.**

1. అందచందాలు : ............................................
2. కాలుసేతులు : ............................................
3. అన్నదమ్ములు : ...............................................

**ఊ) కింది విగ్రహ వాక్యాలను ద్విగు సమాస పదాలుగా కూర్చి రాయండి.**

1. రెండైన చేతులు = ...............................................
2. మూడైన మాసాలు = ...............................................
3. ఐదుగురైన పిల్లలు = ...............................................

**ఎ) కింది వాక్యాలను పరిశీలించండి.**

1. మీరు లోపలికి రావచ్చు. 2. నువ్వు ఇంటికి వెళ్ళవచ్చు. 3. మీరు సెలవు తీసుకోవచ్చు.

ఇలా ఒక పనిని చేయడానికి అనుమతి ఇచ్చే అర్థాన్ని సూచించే వాక్యాన్ని అనుమత్యర్థక వాక్యం అంటారు.

ఉదాహరణకు "మీరు పరీక్ష రాయవచ్చు". ఇలాంటి వాక్యాలు సేకరించి రాయండి. అలాగే

1. నీకు శుభం కలుగుగాక! 2. నిండు నూరేళ్ళు వర్ధిల్లు 3. నీకు మంచి బుద్ధి కలుగుగాక!

ఈ విధంగా ఆశీస్సులను తెలియజేసే వాక్యాలను ఆశీరర్థక వాక్యాలు అంటారు.

ఆంటోనీ! నీకు దైవానుగ్రహము కలుగుగాక! - ఇలాంటి వాక్యాలు సేకరించి రాయండి.

**ఏ) కింది వాక్యాలు చదివి అవి ఏరకం వాక్యాలో రాయండి.**

1. నాయనా! వర్ధిల్లు.
2. రహీమ్ నువ్వు ఇంటికి వెళ్ళవచ్చు.
3. సరోజా! సద్విద్యా ప్రాప్తిరస్తు
4. ఎల్విన్! నువ్వు పాఠశాలకు వెళ్ళవచ్చు.
5. నీకు ఎల్లెడలా శుభం కలుగుగాక
6. నీ ఇష్టం వచ్చిన చోటికి వెళ్ళిరావచ్చు.

| అనుమత్యర్థక వాక్యాలు | ఆశీరర్థక వాక్యాలు |
|---|---|
| ........................................ | ........................................ |
| ........................................ | ........................................ |
| ........................................ | ........................................ |

**ఐ) జతపర్చండి.**

| | | | | |
|---|---|---|---|---|
| 1. | నువ్వు పద్యం చదివావా? | (అ) | ఆశీరర్థకం | (     ) |
| 2. | అల్లరి చేయకండి. | (ఆ) | ఆశ్చర్యార్థకం | (     ) |
| 3. | అబ్బో! పువ్వు ఎంత బాగుందో! | (ఇ) | ప్రశ్నార్థకం | (     ) |
| 4. | సుభాష్ నీకు శ్రేయస్సు కలుగుగాక! | (ఈ) | నిషేధార్థకం | (     ) |



## చమత్కార పద్యం

కప్పను చూసి పాము వణికింది అని సమస్యను ఒక కవికి ఇవ్వడం జరిగింది. కప్పను చూసి పాము వణకదు. ఈ సమస్యకు కవి కింది విధంగా పరిష్కారం చూపాడు.

కుప్పలు కావలిగాయగ
చెప్పులు కర్రయును బూని శీఘ్రగతిం దా
జప్పడగుచు వచ్చెడి వెం
కప్పను గని ఫణివరుండు గడగడ వణికెన్.

పద్యం చివరిపాదంలో కప్ప దాని ముందరి అక్షరంతో కలిసి వెంకప్ప అయింది. ఆ వెంకప్ప కుప్పలు కాయడానికి చెప్పులు వేసుకొని కర్రతో బయలుదేరాడు. ఆ వెంకప్పను చూసి ఒక పాము గడగడ వణికిందట.



## నేనివి చేయగలనా?



1. పాఠాన్ని ధారాళంగా చదవగలను. అర్థంచేసుకొని సొంతమాటలలో చెప్పగలను. ఔను / కాదు
2. పాఠంలోని మాండలిక పదాలను, పదబంధాలను వాక్యాలలో ఉపయోగించగలను. ఔను / కాదు
3. గంగిరెద్దులవారి జీవనవిధానాన్ని, సంస్కృతిని సొంతమాటలలో చెప్పగలను. ఔను / కాదు
4. పాఠంలోని ప్రశ్నలకు జవాబులు సొంతమాటలలో రాయగలను. ఔను / కాదు

చదవండి - ఆనందించండి

X4P7J1

# గురి

పూర్వం విదర్భ దేశాన్ని విక్రమసేనుడు అనే రాజు పరిపాలించేవాడు. ఆయన మంత్రి రాంభట్టు ఎంతో తెలివైన వాడే కాదు సమయస్ఫూర్తి కలవాడు కూడా. విక్రమసేనుడు అన్ని విషయాల్లో మంత్రి సలహాలను తీసుకునేవాడు.

విక్రమసేనుడికి వేటంటే చాలా ఇష్టం. సంవత్సరంలో ఏదో ఒక నెల అడవికి వెళ్లి జంతువులను వేటాడుతూ గడిపేవాడు. ఒకసారి తన పరివారాన్ని వెంటబెట్టుకుని రాజ్యానికి తూర్పు దిక్కున ఉన్న దట్టమైన అడవికి వెళ్లాడు. ఆయనతో పాటు మంత్రి రాంభట్టు కూడా ఉన్నాడు.

ఆరోజు ఎంత తిరిగినా ఒక్క జంతువు కూడా కనబడలేదు. విక్రమసేనుడికి ఎంతో నిరాశగానూ, విసుగ్గానూ అనిపించింది. వాళ్ళు గుడారానికి తిరిగి వస్తుండగా పచ్చిక బయలులో ఒక లేడిపిల్ల కనిపించింది. విక్రమసేనుడు వెంటనే విల్లు ఎక్కుపెట్టి గురి చూసి బాణం వదిలాడు. రివ్వున విల్లు నుండి దూసుకెళ్ళిన బాణం లేడిపిల్లకు తగులకుండా కొన్ని అంగుళాల దూరంలో చెట్టుకు తగిలింది. ప్రమాదం పసిగట్టి లేడిపిల్ల పారిపోయింది.

“భలే గురి” అంటూ ఒక సైనికాధికారి అలవాటుగా చప్పట్లు చరిచి అన్నాడు.

అసలే కోపంతో ఉన్న విక్రమసేనుడు మరింత ఉగ్రుడయ్యాడు. “నన్నే ఎగతాళి చేస్తున్నావా? ఎంత ధైర్యం” అంటూ కళ్ళెర్ర చేశాడు.



ఆ సైనికాధికారి బిక్కచచ్చిపోయాడు. తనకు శిక్ష ఖాయమనుకొని గజగజా వణికాడు. పరిస్థితిని అంచనా వేసిన రాంభట్టు కల్పించుకుని “అతను ఎగతాళి చేయడం లేదు మహారాజా! నిజమే చెప్పాడు” అని అన్నాడు.

“మీ బాణం ఎప్పుడూ క్రూర మృగాల వైపే ఎక్కుపెట్టి ఉంటుంది. అమాయకమైన చిన్న చిన్న జంతువులను మీరు వేటాడరు. ఆ లేడిపిల్లను పారిపొమ్మని మీరు బాణం వేశారు. మీ గురి తప్పకుండా బాణం లేడిపిల్లకు తగలకుండా సరిగా లేడిపిల్ల ప్రక్కనే ఉన్న చెట్టుకు తగిలింది. అదే మీలోని చాతుర్యం” అని వివరించాడు.

దానితో విక్రమసేనుడి కోపం పోయి సంతోషంగా నవ్వాడు. తనను రక్షించినందుకు రాంభట్టు వైపు కృతజ్ఞతగా చూశాడు సైనికాధికారి.

# 12. ఎంతమంచి వారమ్మా...!

## (ఉపవాచకం)

X6S9X7

(శ్రీ వెన్నెలకంటి రాఘవయ్య 'యానాదులు' అనే పుస్తకం నుంచి సంక్షిప్తం.)

విభిన్న జాతులు, ఆచార వ్యవహారాలకు నిలయం మన దేశం. మన దేశంలో ప్రతి జాతి ఔన్నత్యాన్ని గుర్తిస్తూ గతాన్ని స్మరించుకొని, నేటిని తర్కించుకొని, భావిని ఊహించుకొని, మంచి చెడ్డలను నిర్మొగమాటంగా మనసుకు తెచ్చుకోవడం ఆవశ్యకం, కర్తవ్యం. నాగరికతకూ, సౌకర్యాలకూ దూరమైనా తమ విభిన్న జీవనశైలితో దేశం కోసం తమవంతు కృషిని చేసిన జాతులు, తెగలు కోకొల్లలు. వారిలో ఒకరు యానాదులు.

ఎంత మంచి వాడమ్మా
యాడకి పోయినాడమ్మా
గుట్టమీది కెక్కాడు
పుట్ట తేనె తెచ్చాడు
మట్టగుడిశెలు తెచ్చాడు
పిట్టలకుచ్చు లేస్తాడు
కట్టెల మోపులు మోస్తాడు
ఏటికి కావలి కాస్తాడు
పుట్టినా గిట్టినా ఒకటేనంటాడు
కట్టుబట్టలతోనే కాలం
గడిపేస్తాడు.



ఎంత మంచి వాడమ్మా యాడకి బోయినాడమ్మా అని పాడుకుంటూ నిరాడంబర జీవనశైలితో సాక్షాత్కరించు కష్టజీవులు యానాదులు.

వీరు ద్రావిడుల వలసలకు చాలా పూర్వమే తెనుగు ప్రాంతాన్ని అంటిపెట్టుకొనియున్న అనాది మానవులు అనుకోవచ్చు. అనాది పదంనుండి 'యానాది' అనే పదం పుట్టిఉండొచ్చు అనే భావన ప్రజల్లో ఉంది. దక్షిణాన పొన్నేరు (తమిళనాడు), ఉత్తరాన కృష్ణ (ఆంధ్రప్రదేశ్) మధ్యప్రాంతమే వీరి తొలిస్థానం.

అడవుల్లో పుష్కలంగా దొరుకుచుండిన తేనె, చారపప్పు, వైద్యానికి అవసరమైన మూలికలు సేకరించి అమ్ముతుంటారు. ఇండ్లకు కావలసిన కలప, వెదురు మొదలైన అడవి ఫలితాన్ని పరిసర గ్రామాల

రైతులకు విక్రయించి, తమకవసరమైన తిండిగింజలను, బట్టలను, చమురులను కొనుగోలు చేసుకుంటూ జీవనం గడుపుతారు. పొలాల్లో పంట కాపుదల, చేపలను పట్టడం కూడా వారి వృత్తులే! దేశం యొక్క ధాన్యరాశులు ఎలుకలు నశింపజేయకుండా లక్షల సంవత్సరాల నుండి నిరంతరం కాపాడుతున్న కష్టజీవులు.

పంటల పరిరక్షకునిగా, సంఘశ్రేయస్సు భుజానికెత్తుకున్న యానాది రూపంలో నిర్మలమైన కండ్లు, విండ్లవలె తీరిన కనుబొమలు కనిపిస్తాయి. ఎంత చమురు రాసినా ఎదుగనొల్లని ఎరకల ఉంగరాలు, సన్నని పెదవులు, పలుచని పలుకబారు కట్టె శరీరాలు, పరుగుల్లో గుఱ్ఱాలను కూడా వెనుకవేయగల లేసైన పిక్కలు, సన్నని నడుములు, అందమైన పెదవులను ఎడబాయని చిరునవ్వులు, దక్షిణదేశపు ఆదివాసులందరిలోకి యానాదులే అందగాళ్ళని అనిపిస్తే అందుకు ఎవరూ కినియ బనిలేదు.

అడవి యానాదులకు జంతువుల జాడలు పరిచయమైనట్లు, పల్లప్రాంతాల యానాదులు కూడా మానవుల జాడను అంత సులువుగా కనిపెట్టగలరు. జాడలు తీయడంలో వీరికున్న తెలివితేటలను పోలీసు ఉద్యోగులు ఎట్లు ఉపయోగించెదరో, అట్లే వేటకాండ్రు కూడా యానాదుల తోడ్పాటును వేటలో హెచ్చుగా ఉపయోగించుకుంటారు. జమీందార్లు ఏలేటప్పుడు సురక్షితంగా తాము కూర్చున్న మంచెల దగ్గర పులులను, చిరుతలను, ఎలుగుబంట్లనూ, అడవి దున్నలనూ పరవ తోలించుకొనుటకు వీరే పనికివస్తారు. పుట్టలోని కోడెనాగుల బుసలు అతన్ని బెదిరించవు. ఆయుర్వేద వైద్యులకు కావలసిన మూలికలు యానాదులకు తెలిసినట్లు ఇతరులకు తెలియవు. వీరిద్వారానే వైద్యులు మూలికలను సమకూర్చుకుంటారు. స్మారకంలో ఉన్న యే యానాది అలోపతిక్ వైద్యశాలకు పగ్గాలు పట్టినా పోడు. అతని ఆరోగ్యము మామూలుగా తృప్తికరముగా ఉంటుంది. చీటికి మాటికి మందులు, మాకులు తినకుండా ఉండేవారు ఆరోగ్యవంతులని నమ్మే కూనీ వైద్యశాస్త్ర ప్రాపకులలో యానాదులు ప్రథములు. కుండకషాయాలు, మూలికలే వీరి ఔషధాలు.


ఒకవిధంగా ఆలోచిస్తే యానాదిని వేదాంతిగానే భావించవచ్చు. ఆస్తి మీద ఆశ లేకుండా, కాయకష్టం మీద ఆధారపడి జీవిస్తారు. వీరి నివాసమైన గుడిసెలను పరిశీలిస్తే అన్నీ ఒకేరీతిగా ఉంటాయి. ఇళ్ళ నిర్మాణానికి కావలసిన కలపంతా చెట్లకొమ్మలు, లేకుంటే చిట్టివెదుళ్ళు, వెదురు బొంగులతో వలయాకారంగా నిర్మించిన ఇంటిని తాటాకులతో నేలనుండి పైవరకూ నారతో కుట్టేస్తారు. ఇంటి వాకిలికి కుడిప్రక్కన గుంటపొయ్యి, నీళ్ళకుండలు, చెంబు ఉంటాయి. ఎడమప్రక్కన తట్టలు, బుట్టలు, మధ్యరోకటిగుంట, నెత్తిమీద తగిలేటట్టు కట్టిపెట్టిన తప్పెట, వాకిలి వెనుక ప్రక్క జాజిచెక్కల పెట్టె, దానిపై వ్రేలాడగట్టిన ఈత ఆకుల చాప, చూరులో దోపిన గెసిక (గూచి) కఱ్ఱ యానాది ఐహిక ఐశ్వర్యమంతా!

యానాది అల్పసంతోషి అయినందువల్ల, ఆశ అసలే లేనందువల్ల అతని జీవితములో నిరాశా నిస్పృహలు, ఈర్ష్యాద్వేషాలు, అసూయ కనిపించవు. ఒకవేళ కనిపించినా దీర్ఘకాలము ఉండవు. పస్తుకు, పండుగకు అంత భేదము లేకపోవడమే ఒడిదుడుకులు లేని అతని జీవయాత్రకు ఊతకర్ర. మితభాషి అయినందువల్ల అధిక ప్రసంగాలు, పరనిందారోపణలు, ఇరుగు పొరుగు తగాదాలు ఇతన్ని బాధించవు. "పరుగెత్తి పాలుత్రాగే దానికన్నా నిలుచొని నీళ్ళు త్రాగడమే మేలనే కోవకు చెందినవాడే యానాది. వీరిని

ఏకభుక్తులుగా పరిగణించవచ్చు. మాంసాహారముతోబాటు ఆకుకూరలను ఆహారంలో భాగంగా చేసుకుంటారు. కలేపండ్లు, నాగజెముడుపండ్లు, బిక్కిపండ్లు వారు తినే పండ్లు. యానాదులకు మద్యపానం గిట్టదు. వివిధ జాతుల నైతికవర్తనాన్ని స్థూలంగా పరీక్షించినప్పుడు మత్తుకుగాని, దాని తోబుట్టువయిన దౌర్జన్యానికిగాని ఒడిగట్టని నిరుపేద కులాలలో నిష్ఠగా జీవించేవారు యానాదులొక్కరే అని సగర్వంగా చెప్పవచ్చు. మొగమాటము యానాదులకు ఉగ్గుపాలతో అలవాటైన సుగుణము. అమాయకత్వం, మర్యాద, ఆదరము, అతిథిసత్కారము ఇవన్నీ పెదవులను ఎడబాయని చిరునవ్వులోనే ప్రస్ఫుటమవుతాయి. వీళ్ళు మాట్లాడేటప్పుడు స్వచ్ఛమైన అచ్చతెలుగు మాటలు ముత్యాల్లా జారిపడుతుంటాయి. ఒక్కొక్కసారి ఒత్తులులేని పదాలకు ఒత్తులు సునాయాసంగా కలిపించి (బావను భావగా పలకడం) వారి నోటినుండి భాష నూతన సొంపులను సంతరించుకుంటుంది.

తిరునాళ్ళన్నా, వీధి భాగవతాలన్నా, తోలుబొమ్మలాటలన్నా, జాతరలన్నా, ఊరేగింపులన్నా యానాదులకు భలే సంబరం. తిరునాళ్ళకు, తీర్థాలకు ఒంటరిగా పోకుండా ఇంటిల్లిపాది ముదుసళ్ళతోసహా కదలివెళ్తుంటారు. వీరిలో కళాకారులు కూడా ఉండటం విశేషం. వీరు ప్రదర్శించే యక్షగానం బాగా గ్రామీణులను ఆకర్షిస్తుంది. యానాదుల భాగవతాన్ని చూడడానికి ఐదారుమైళ్ళ దూరంనుండి జనం వస్తారు. స్త్రీ వేషాలను కూడా మగవారే ధరిస్తారు. వేషము యొక్క నాణ్యానికి జోడు గొంతుయొక్క మాధుర్యము పండిత పామరులను సైతం ఆకర్షిస్తుండేవి. యువతుల గొబ్బిపాటలు అంత శ్రావ్యంగాను, ఆటలు మరింత రమ్యంగాను, నటన అంత గంభీరంగాను ఉంటాయి. యానాది స్త్రీలకు తెలిసినన్ని పాటలు ఇతరులకు అంతగా తెలియవు, వారు పాడే పాటల్లో

"కట్టమీద గడ్డికోసేలలనా
కట్టకింద మోపుగట్టే
లలనా బంగారుసామే"



"వస్తా పదరా రస్తా పనికి" అని మొదలుపెట్టి పాడుతూ "ధనము దాచుట దొంగతనము" అని పాటను ముగిస్తుంటారు. తెల్లవారకముందే వాకిండ్లను చిమ్మి కల్లాపు చల్లి వైకుంఠ వాకిళ్ళను రంగవల్లి, పచ్చీసును తెల్లటి పిండిముగ్గులతో వారు చిత్రించినవి అందంగాను, ఆనందంగాను ఉంటాయి.

భక్తిపరమైన భజనలు, మౌనధ్యానాలు, మంత్రతంత్రాలు యానాదిని ఆకర్షించవు. యానాదుల దైవం వెంకటేశ్వర్లు. ఆయన టెంకాయలతో, తులసీదళాలతో చులకనగా తృప్తిపడతాడని వీరి ఉద్దేశం.

వీళ్ళు వేటకు వెళ్ళేముందు కాట్రాయుడికి మొక్కుతుంటారు. సంక్రామిక వ్యాధులు తటస్థమైనప్పుడు మహాలక్ష్మమ్మ, పోలేరమ్మ వెలిసియుండే చెట్ల దగ్గర, గ్రామ చావిళ్ళ దగ్గర ప్రార్థిస్తుంటారు.

చల్లని చూపుల మందహాసం, నిర్మల హృదయాన్ని ప్రతిబింబించే కనుదోయి, మితభాషణ, సహజమైన వినయము, ఆకర్షణీయమైన అమాయకత్వం వారికి పెట్టని భూషణములు.

"అందంగ రానటువంటి సుఖంబుల కళ్ళులు చాచదు మాకులము
పొందంగ రానటువంటి ఫలంబుకు పొక్కదు సొక్కదు మాకులము"


అనే నిబ్బరముతో బాహ్యప్రపంచానికి నీతిని నేర్పగల యానాది మన మానవ సంఘానికి పరమేశ్వరుడు ప్రసాదించిన ఆభరణం.

నేటి తరంలో యానాదులు సగౌరవంగా, భాషను పెంచుకొని, విద్యాగంధమలవరచుకొని, ఆంధ్ర జనబాహుళ్యంలో ఒకరై, సాంఘిక పురోగమన పథంలో నడుస్తున్నారు. సంఘాభిమానము, పరస్పర సహకారము, సంఘశక్తి, పౌరుషము, పట్టుదలలు ఆలంబనగా వారు అత్యున్నత పదవులను పొందడం మనం గర్వించదగ్గది.

**కవి పరిచయం**

## వెన్నెలకంటి రాఘవయ్య

(4.6.1897 - 24.11.1981)



నెల్లూరు గాంధీగా పేరు పొందిన రాఘవయ్యగారు స్వాతంత్ర్య సమరయోధులు, సంఘసేవకులు, చరిత్రకారులు. స్వాతంత్ర్య సమరంలో సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొని 21 నెలలు జైలు శిక్ష అనుభవించారు. వీరిని 1973లో భారత ప్రభుత్వం 'పద్మభూషణ్' ఇచ్చి గౌరవించింది. 'యానాదులు', 'భారతదేశంలో ఆదివాసులు' వంటి 22 పుస్తకాలు రాశారు. తెలుగులో 'అడవిపూలు', 'నాగులు', 'చెంచులు', 'సంచార జాతులు' వంటి పది పుస్తకాలు రాశారు.

### లఘుప్రశ్నలు



1. యానాది రూపాన్ని వర్ణించండి.
2. యానాదులు నిరాడంబర భక్తులు - సమర్థించండి.
3. యానాదుల భాషణం ఏవిధంగా ఉంటుంది ?

### వ్యాసరూప ప్రశ్నలు

1. యానాదులను చూసి మనం ఎందుకు గర్వపడాలి?
2. "యానాది వేదాంతి" - దీనిని సమర్థిస్తూ రాయండి.

F1P1Z3

# అర్థాల పట్టిక

### అ

1. అంకె = వశం
2. అంగడి = కొట్టు (దుకాణం)
3. అంబుధి = సముద్రం
4. అఘము = పాపం
5. అజ్ఞానం = జ్ఞానం లేకపోవడం
6. అణగుట = నశించుట
7. అతుల = సాటిలేని
8. అధునాతనము = ఆధునికం
9. అనర్గళంగా = ధారాళంగా/అడ్డంకి లేకుండా
10. అనుకరించు = మరొకరు చేసినట్లు చేయు
11. అనుగుణము = తగినది/అనుకూలమైనది
12. అన్వేషణ = వెదకుట
13. అబ్ధి = సముద్రం
14. అర్థించి = వేడుకొని
15. అలరించు = ఆనందింపజేయు
16. అవగతము = తెలియబడినది
17. అశ్వము = గుర్రం
18. అసువులు = ప్రాణాలు

### ఆ

1. ఆకృతి = ఆకారం
2. ఆచరణ = నిజ జీవితంలో అమలు చేయడం / నడత
3. ఆజ్ఞ = ఆనతి
4. ఆత్మవిశ్వాసం = తన శక్తి సామర్థ్యాలపై తనకున్న నమ్మకం
5. ఆనందపరవశుడు = సంతోషంచేత పరాధీనుడు
6. ఆపన్నులు = ఆపదలో ఉన్నవారు
7. ఆపద = ప్రమాదం
8. ఆప్యాయత = ప్రేమ, ఆదరం
9. ఆలు = భార్య
10. ఆవశ్యకత = అవసరం
11. ఆశ్రయించు = ఆధారంచేసుకొను
12. ఆశ్రితులు = ఆశ్రయించినవారు

### ఇ

1. ఇంకుట = ఇగిరిపోవుట
2. ఇంతి = స్త్రీ
3. ఇమ్ముగ = కుదురుగ / స్థిరంగా

### ఉ

1. ఉచ్చు = పక్షులు మొదలైన వాటిని పట్టడానికి పెట్టే ఉరి
2. ఉజ్జ్వల = బాగా ప్రకాశించేది
3. ఉత్తరీయం = కండువా
4. ఉదకము = నీరు
5. ఉబలాటం = కుతూహలం / ఒక పని చేయాలనే తొందరతో కూడిన కోరిక

### ఎ

1. ఏకభుక్తులు = ఒకపూట మాత్రమే తినేవారు
2. ఎడబాయు = వేరగు
3. ఎలమి = సంతోషం
4. ఎరుక = జ్ఞానం

### ఐ

1. ఐశ్వర్యం = సంపద

### ఒ

1. ఒద్దిక = అనుకూలత, స్నేహం
2. ఒసగుట = ఇచ్చుట

### ఔ

1. ఔన్నత్యము = గొప్పతనం

### క

1. కదనం = యుద్ధం
2. కనుమఱుగు = కంటికి కనిపించకుండా పోవు
3. కన్నుల పండుగ = చూడడానికి ఆనందంగా ఉండటం
4. కపటం = మోసం
5. కపి = కోతి
6. కర్తవ్యం = బాధ్యత
7. కవిపుంగవుడు = శ్రేష్ఠమైన కవి
8. కాంస్యం = కంచు
9. కాలుడు = యముడు
10. కాడు = శ్మశానం
11. కాలయముడు = ప్రాణాలు తీసేవాడు
12. కావలి = రక్షణ
13. కినియు = కోపించు
14. కూడు = అన్నం
15. కూరిమి = స్నేహం
16. కృతజ్ఞతలు = ధన్యవాదాలు
17. కేరింత = నవ్వు / సంతోషంలో చేసే ధ్వని
18. కోటీరము = కిరీటం
19. కోమలి = అందమైన స్త్రీ
20. కోలాహలం = హడావుడి

### గ

1. గండం = ప్రమాదం
2. గిరాకీ = వెల ఎక్కువ / కొనుగోలు దారులకు న్న ఆసక్తి

### ఘ

1. ఘట్టం = రసవంతమైన సన్నివేశం

### చ

1. చారెడు = కొద్దిగా చెయ్యి వంచినప్పుడు ఏర్పడే పరిమాణం, ఒక చేతిలో పట్టినన్ని
2. చిక్కం = తీగలతో అల్లి పశువుల మూతికి తగిలించే బుట్ట
3. చిరస్మరణీయుడు = నిత్యం స్మరింపదగినవాడు
4. చేజారిపోవు = చేతి నుండి విడిపోవు
5. చేటు = కీడు, అనర్థం

### జ

1. జాగృతి = మేలుకొలుపు
2. జాడ = ఆనవాలు
3. జీవనశైలి = జీవించే విధానం/ బతికే పద్ధతి

### డ

1. డెందము = హృదయం

### త

1. తనయ = కూతురు
2. తనరు = ప్రకాశించు
3. తనూభవుడు = కుమారుడు

4. తర్కించు = చర్చించు
5. తరుణము = తగిన సమయం
6. తలపోయు = ఆలోచించు
7. తహతహలాడు = ఆరాటపడు, తొందరపడు
8. తిలలు = నువ్వులు
9. తీవ్రత = ఆధిక్యం
10. తుల్యం = సమానం
11. తెంపు = సాహసం
12. తేట తెల్లంచేయు = మిక్కిలి స్పష్టంగా వివరించు

## ద

1. దత్త = ఇవ్వబడిన
2. దనుజులు = రాక్షసులు
3. దళం = ఆకు
4. దాణా = పశువులకు పెట్టు ఆహారం
5. దాశరథి = శ్రీరాముడు
6. ద్విపము = ఏనుగు
7. ద్వీపము = నాలుగువైపులా నీటితో చుట్టబడిన భూమి
8. దుర్గతి = చెడ్డస్థితి
9. దుర్భరం = భరింపలేనిది
10. దేదీప్యమానం = మిక్కిలి ప్రకాశవంతం
11. దొరతనం = ప్రభుత్వం, అధికారం
12. దోచు = అపహరించు

## ధ

1. ధరణి = భూమి
2. ధాటి = దాడి

## న

1. నారి = స్త్రీ
2. నిక్కం = నిజం
3. నిరాడంబరం = ఆడంబరం లేనిది
4. నిర్దేశం = ఆజ్ఞ
5. నిశ్చితాభిప్రాయం = దృఢమైన అభిప్రాయం, గట్టినిర్ణయం
6. నిష్ఫలం = ప్రయోజనం లేనిది
7. నెమ్మి = ప్రేమ, క్షేమం
8. నెతిగుతి = సరియైన లక్ష్యం
9. నేరము = తప్పు

## ప

1. పటాపంచలు = చెల్లా చెదరు
2. పథకం = ఆలోచన, ప్రణాళిక
3. పరస్పరం = ఒకరికొకరు
4. పరవ = ప్రవాహం
5. పస్తు = ఉపవాసం
6. పాటు = ఆపద
7. పాతకం = పాపం
8. పామరుడు = తెలివిలేనివాడు
9. పారదని = జరగదని
10. పీడ = బాధ
11. పుంగవం = ఎద్దు
12. పుడుక = పుల్ల (పుడకఅనివాడుక)
13. పుష్కలం = అధికం, సమృద్ధి
14. పుస్తె = తాళిబొట్టు
15. పొంచి = చాటున దాగియుండి
16. పొలతి = స్త్రీ
17. పోరాటం = యుద్ధం
18. పోరు = యుద్ధం
19. ప్రజ్ఞాశాలి = ప్రతిభ గలవాడు
20. ప్రతీక = గుర్తు
21. ప్రథితం = ప్రఖ్యాతి నొందినది
22. ప్రభువు = రాజు
23. ప్రస్తుతం = ఇప్పుడు
24. ప్రాచీనం = పూర్వకాలం, పురాతనం
25. ప్రాణం = జీవం
26. ప్రారంభం = మొదలు

## బ

1. బుధుడు = పండితుడు
2. బుడతడు = బాలుడు

## భ

1. భద్రం = శుభకరం, శ్రేష్ఠం
2. భావన = తలపు/ఆలోచన
3. భావి = భవిష్యత్తు
4. భాస్కరుడు = సూర్యుడు
5. భీతి = భయం
6. భూషణములు = అలంకారాలు
7. భేదం = తేడా
8. భ్రాతృజనం = అన్నదమ్ములు

## మ

1. మకాం = నివాసం
2. మదం = గర్వం
3. మదత్రయం = విద్యాగర్వం, ధనగర్వం, కులగర్వం
4. మనుచు = రక్షించు
5. మనువు = బ్రతుకు
6. మట్టగుడిసె = ఒకరకమైన చేప
7. మమకారం = ప్రేమ/నాది అనేభావం
8. మహనీయులు = గొప్ప వారు
9. మిన్నక = ఊరక/అప్రయత్నంగా
10. ముట్టుకోవడం = తాకడం
11. మున్నీరు = సముద్రం
12. ముల్లె = ధనం/మూట
13. మెలకువ = మేలుకొనుట/జాగృతి
14. మేటి = శ్రేష్ఠం
15. మేను = శరీరం
16. మైత్రి = స్నేహం
17. మొరాయించు = చెప్పిన మాట వినక పోవడం
18. మొహమాటం = జంకు, సంకోచం
19. మోళీ = రీతి/తరగతి
20. మౌనం = మాట్లాడకుండా ఉండడం

## య

1. యాచకులు = భిక్షుకులు

## ర

1. రణము = యుద్ధం
2. రమ్యము = అందమైనది
3. రాజద్రోహం = రాజాపరాధం
4. రాట్నం = నూలువడికే యంత్రం
5. రాశి = పోగు
6. రూకలు = నాణెములు
7. రూపు మాయు = నశించు, అంతరించు

### ల

1. లేసు = సులభం, చులుకన

### వ

1. వదనం = ముఖం
2. వర్ధనం = వృద్ధి పొందించేది
3. వలయాకారం = గుండ్రని రూపం
4. వాత్సల్యం = ప్రేమ
5. వ్రాత = సమూహం కలది
6. విక్రయించు = అమ్ము
7. విచ్ఛిన్నం = ముక్కలు చేయబడినది
8. విధూతము = కదలించబడినది
9. విరసం = రసము లేనిది
10. వివేకి = తెలివైనవాడు
11. విహరిస్తున్న = స్వేచ్ఛగా తిరుగుతున్న
12. వీడ్కోలు = వెళ్ళడానికి ఇచ్చే అనుమతి
13. వెఱచు = భయపడు
14. వైరం = శత్రుత్వం

### శ

1. శింశుపా వృక్షం = ఇరుగుడు చెట్టు
2. శుంభత్ = ప్రకాశించే
3. శుద్ధము = పవిత్రం
4. శూరులు = శౌర్యం కలవారు
5. శ్రేయస్సు = శుభం

### స

1. సాంక్రమికవ్యాధులు = అంటువ్యాధులు
2. సంఘాతం = సమూహం/గట్టి దెబ్బ
3. సంచితం = కూడబెట్టబడినది
4. సంప్రదాయం = గతంనుండి పాటిస్తూ వచ్చిన నిర్దిష్ట ఆచారం
5. సంబరం = సంతోషం
6. సంస్కృతి = ఆచారవ్యవహారాలు, నాగరికత
7. సఖ్యంగా = స్నేహంగా
8. సత్కవి = మంచికవి
9. సత్యమైనది = నిజమైనది
10. సన్నుతి = చక్కని పొగడ్త
11. సాక్షాత్కరించు = ప్రత్యక్షమగు
12. సిరి = సంపద
13. సుంత = కొంచెం
14. సునాయాసం = తేలిక
15. సువర్ణము = బంగారం
16. సొంపు = అందం
17. స్ఫూర్తి = స్ఫురణం, ప్రకాశం
18. స్మరించు = తలచుకొను
19. స్వాంతం = హృదయం
20. స్మారకం = స్మృతిచిహ్నం

### హ

1. హరియించు = చంపు
2. హితము = మేలు
3. హితుడు = మేలుకోరేవాడు
4. హెచ్చు = ఎక్కువ

## పర్యాయ పదాలు

1. అఘము : పాపం, దురితం
2. అధికం : ఎక్కువ, మెండు
3. అనలం : అగ్ని, వహ్ని
4. అబ్ధి : సముద్రం, జలధి
5. అశ్వము : గుర్రం, తురగం
6. ఇంతి : స్త్రీ, వనిత
7. ఉదకము : నీరు, జలం
8. ఉర్వి : భూమి, వసుధ
9. కన్ను : నేత్రం, నయనం
10. కపి : కోతి, మర్కటం
11. కుమారుడు : తనయుడు, పుత్రుడు
12. కూరిమి : స్నేహం, చెలిమి
13. కాశీ : వారణాసి, అవిముక్తం
14. డెందము : హృదయం, ఎద
15. తండ్రి : జనకుడు, పిత
16. తరుణము : సమయం / కాలం
17. దనుజులు : అసురులు, రాక్షసులు
18. దుఃఖము : ఖేదం, బాధ
19. నంది : వృషభం, ఎద్దు
20. నారి : స్త్రీ, పొలతి
21. పరులు : ఒరులు, ఇతరులు
22. పామరుడు : అజ్ఞుడు, నీచుడు
23. ప్రతీక : గుర్తు, చిహ్నం
24. ప్రారంభం : అంకురార్పణ, మొదలు
25. ప్రాచీనము : ప్రాక్తనం, సనాతనం
26. భాస్కరుడు : సూర్యుడు, భానుడు
27. ప్రాణం : ఉసురు, జీవం
28. మకాం : బస, నివాసం
29. మదం : గర్వం, పొగరు
30. మాత : తల్లి, జనని
31. మేను : శరీరం, దేహం
32. మైత్రి : స్నేహం, నెయ్యం
33. రణం : యుద్ధం, పోరు
34. రథము : తేరు, స్యందనం
35. రాజు : ప్రభువు, భూపతి
36. వృక్షం : చెట్టు, తరువు
37. సకలం : సర్వం, సమస్తం
38. స్వర్గం : దివి, నాకం

F3S4D9

## ప్రకృతి - వికృతి

| | |
|---|---|
| 1. అంబ - అమ్మ | 11. గర్భం - కడుపు |
| 2. ఆకాశం - ఆకసం | 12. త్యాగం - చాగం |
| 3. ఆశ్చర్యం - అచ్చెరువు | 13. దిశ - దెస |
| 4. ఆహారం - ఓగిరం | 14. దీపం - దివ్వె |
| 5. ఉత్తరీయం - ఉత్తరిగం | 15. దోషం - దోసం |
| 6. కథ -కత | 16. ధర్మము - దమ్మం |
| 7. కవి - కయి | 17. పుణ్యము - పున్నెం |
| 8. కాలం - కారు | 18. పుస్తకము - పొత్తం |
| 9. కార్యం - కజ్జం | 19. భక్తి - బత్తి |
| 10. కుమారుడు - కొమరుడు | 20. సంతోషం - సంతసం |